

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

CELKON

గురువారం | 13-6-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 58 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 9.34 తదుపరి అష్టమి; నక్షత్రం: పుబ్బ తె. 5.08 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ. 11.10-12.58; దుర్ముహూర్తం: ఉ. 10.04-10.57, మ. 3.17-4.09; అమృతఘడియలు: రా. 9.57-11.44; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.46 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


45 YEARS OF EXCELLENCE
SRAMAYEVA JAYATHE
NARAYANA
EDUCATIONAL INSTITUTIONS
IIT-JEE అయినా, NEET అయినా, పోటీపరీక్ష ఏదైనా...
టాప్ ర్యాంకుల సర్వాంతర్యామి నారాయణ
JEE-ADV. 2024
Narayana Student Class 8th - 12th
AIR 3rd
BHOGALAPALLI SANDESH
HT No: 246136003
6th AIR
RAJDEEP MISHRA (DLP)
HT No: 241016176
Narayana Student Class 6th - 12th
AIR 11th
MATCHA BALAADITYA
HT No: 245005057
AIR 12th
RAGHAV SHARMA (DLP)
HT No: 242053073
AIR 16th
BISMIT SAHOO (DLP)
HT No: 242072080
Narayana Student Class 11th - 12th
AIR 17th
ARYAN PRAKASH
HT No: 241104226
Narayana Student Class 11th - 12th
AIR 20th
AMOGH AGRAWAL
HT No: 241050091
Below 20 All India Open Category Ranks 7 Ranks
Below 100 All India Open Category Ranks 31 Ranks
Below 500 All India Open Category Ranks 96 Ranks
Below 1000 All India Open Category Ranks 179 Ranks
Below 100 All India Category Ranks 127 Ranks
Below 1000 All India Category Ranks 873 Ranks
Total Selections 3816+
NEET-2024
NEET లో ఏకంగా 9 ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు నారాయణ కైవసం !
720/720 Marks 1st AIR
SAM SHREYAS JOSEPH
App No.: 240410631844
720/720 Marks 1st AIR
K SANDEEP CHOWDARY
App No.: 240410223438
720/720 Marks 1st AIR
SHASHANK SHARMA
App No.: 240410226887
720/720 Marks 1st DLP AIR
ADITYA KUMAR PANDA
App No.: 240410186525
720/720 Marks 1st DLP AIR
RISHABH SHAH
App No.: 240411165956
720/720 Marks 1st DLP AIR
ISHA KOTHARI
App No.: 240410220941
720/720 Marks 1st DLP AIR
PRACHITA
App No.: 240410135119
720/720 Marks 1st DLP AIR
DARSH PAGHDAR
App No.: 240410987668
720/720 Marks 1st DLP AIR
KRISHNAMURTI P S
App No.: 240410572378
ANDHRA PRADESH: IIT-JEE & NEET LONG TERM BRANCHES
VIZAG: IIT BOYS-RES: VELLANKI, ANANDAPURAM, PH: 8179880706, 8179880712, 8179881292. NEET GIRLS-RES: BOYAPALEM, PH: 9912340781, 8179880713, 9963905426. NEET BOYS-RES, PARADESIPALEM, PH: 9912340781, 8179880701, 6281043656. NEET-DAY SCHOLARS, OPP. TIMPONY, GATE-A, CBM COMPOUND, PH: 7337336240, 7337336443, 7204253065. KAKINADA: NEET DAY SCHOLARS: SANTHI NAGAR, PH: 8179880272, 8179881077, 8179880688. RAJAHMUNDRY: NEET- DAY SCHOLARS: AYYAPPA NAGAR, THADOTHOTA, PH: 8179880186, 8179914224, 8179002748. VIJAYAWADA: IIT GIRLS-RES: CURRENCY NAGAR, PH: 9346230305. IIT BOYS-RES: GUDAVALLI, PH: 9912344332. NEET- DAY SCHOLARS: MOGALRAJAPURAM, PH: 8247089099, NEET GIRLS-RES: KANURU, PH: 7337335699. NEET - BOYS-RES: KANURU, PH: 7337335437. TIRUPATI: NEET DAYS SCHOLAR & BOYS-RES: NEW BALAJI COLONY, PH: 7337337069, 7337336092, 9700107895. NEET GIRLS-DAY & RES: KORLAGUNTA, PH: 8179969006, 9441443925, 9948359777. KURNOOL: NEET DAY & RES: LAKSHMI NAGAR, PH: 7337336357, 8179880175, 8179880438, 8179880596. NELLORE: NEET DAY SCHOLARS: HARANATHAPURAM, PH: 8179880611. NEET RES-GIRLS: DHANALAKSHMIPURAM, PH: 8179881289. NEET BOYS-RES: KAKUPALLI, PH: 8179880607.
Scan QR For Admissions
Trust Narayana to fulfil your IIT-JEE / NEET dreams, as #YourDreamsAreOurDreams
Toll Free: 1800 102 3344 | SUBSCRIBE /TheNarayanaGroup | www.narayanagroup.com

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 13-6-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


చిరంజీవి, పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రధాని మోదీ అభివాదం


సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న చంద్రబాబు

అతిరథ మహారథుల సమక్షం..
అభిమానుల ఆనంద సందోహం..
ఆద్యంతం అంగరంగ వైభవం!
నవ్యాంధ్రలో నవ శకం ఆరంభం!

ఎల్లెడలా ఉల్లాసం... ఉత్సాహం... భావోద్వేగభరిత వాతావరణం నడుమ కొత్త సర్కారు కొలువు తీరింది. 'నారా చంద్రబాబు నాయుడు అనే నేను...' అనే మాటతో సంబరం అంబరాన్నంటింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు... జనసేన అధిపతి కొణిదెల పవన్ కల్యాణ్ సహా 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

చంద్రబాబు ..అనే నేను

మీ తమ్ముడు గట్టివాడు!
పవన్ కల్యాణ్ గురించి చిరంజీవితో మోదీ
మురిసిపోయిన అన్నయ్య
12

అంగరంగ వైభవంగా కొలువుదీరిన 'కూటమి'

సీఎంగా బాబు ప్రమాణ స్వీకారం

ప్రతి ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వాలు ఏర్పడటం, ప్రమాణ స్వీకారాలు జరగడం షరా మామూలే! కానీ... బుధవారం ఉదయం గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద జరిగిన కార్యక్రమం వేరు! కేంద్రంలో చంద్రబాబుకు దక్కిన ప్రాధాన్యానికి నిదర్శనంగా... ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తదితరులు ఈ కార్యక్రమానికి తరలి వచ్చారు. మోదీ ఆద్యంతం ఉల్లాసంగా కనిపించారు. కరచాలనాలు, ఆలింగనాలు, శుభాకాంక్షలు, పలకరింపులు, అభివాదాలు, నవ్వులతో ఉత్సాహంగా గడిపారు! ఐదేళ్లుగా ఎక్కడా 'పేరు వినిపించని... ఒకరకమైన 'చీకటి'లో మగ్గిన రాష్ట్రానికి తగిన గుర్తింపు వస్తుందనేందుకు సంకేతంగా పలు దేశాల దౌత్యవేత్తలూ హాజరయ్యారు. వేదికపై మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చంద్రబాబు శ్రేయోభిలాషి, తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కొత్త కళ తీసుకొచ్చారు. బాలకృష్ణ తనదైన శైలిలో వేదికపై సందడి చేశారు. నారా, నందమూరి, మెగా కుటుంబ సభ్యులు ఈ సంబరాన్ని అబ్బురంగా వీక్షించారు. రాష్ట్రహితం కోరే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా వేదికపై ఆశీనులయ్యారు. ఇలా అన్ని రంగాలకు చెందిన ప్రముఖులతో వేదిక సంపూర్ణత సంతరించుకుంది. అన్నింటికీ మించి... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తల సందడి సరేసరి!



చంద్రబాబుతో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయిస్తున్న గవర్నర్ నజీర్. వేదికపై ప్రధాని మోదీ, భువనేశ్వరి


ప్రమాణస్వీకార వేదికపై చంద్రబాబు, ప్రధాని మోదీ ఆత్మీయ ఆలింగనం

సమగ్ర కథనాలు 8,10,11లో

- మంత్రిగా జనసేనాధిపతి పవన్ కల్యాణ్ ప్రమాణం
- లోకేశ్, అచ్చెన్నాయుడు సహా 24 మంది మంత్రులు
- వేదికపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా
- చంద్రబాబు, పవన్‌కు మోదీ ప్రత్యేక అభినందనలు
- ప్రత్యేక ఆకర్షణగా చిరంజీవి, రజనీకాంత్, బాలకృష్ణ
- భారీగా తరలి వచ్చిన ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు
- '..అనే నేను' అనగానే హోరెత్తిన హర్షధ్వానాలు

తొలి సంతకాలు నేడే

- సాయంత్రం 4.41కి సచివాలయానికి బాబు
- మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ రద్దు, 4 వేల పెన్షన్, స్కిల్స్ సెన్సస్, అన్న క్యాంటీన్లపై సంతకాలు
- మంత్రులకు శాఖల కేటాయింపూ నేడే
- ప్రమాణ స్వీకారం తర్వాత మంత్రులతో బాబు భేటీ
- పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని సూచన
- గత మంత్రుల పేషీల్లో సిబ్బందిని తీసుకోవద్దని స్పష్టీకరణ

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా పదవీప్రమాణం చేసిన చంద్రబాబు రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో గురువారం అడుగు పెట్టనున్నారు. పాలనాపరమైన నిర్ణయాలకు అక్కడే శ్రీకారం చుట్టనున్నారు. సాయంత్రం 4.41 గంటలకు ఆయన తన చాంబర్లో అడుగు పెట్టి బాధ్యతలు స్వీకరిస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. సచివాలయంలోని ఐదు బ్లాకుల్లో మొదటి బ్లాకులో ముఖ్యమంత్రి కార్యాలయం ఉంటుంది. అందులోని మొదటి అంతస్తులో ఆయన చాంబర్ సిద్ధమవుతోంది. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మెగా డీఎస్సీ సహా

మిగతా 8వ పేజీలో...

కొత్త తరానికి అందలం

- మొత్తంగా సామాజిక సమతౌల్యం!
- 17 మందికి తొలిసారి కేబినెట్‌లో చోటు
- భావి నాయకత్వం పెంపొందేలా అడుగులు
- మంత్రి పదవుల్లో సగం బలహీనవర్గాలకే
- ఇందులో 8 మంది బీసీ ఎమ్మెల్యేలు
- అక్రమ కేసుల్లో జైళ్లకు వెళ్లినవారికి స్థానం
- సమీకరణలతో కొందరు సీనియర్లకు నిరాశ
- యనమల, అయ్యన్నలకు దక్కని పదవులు

సీనియర్లకూ ప్రాధాన్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పార్టీలోని కొత్త తరాన్ని అధికార అందలమెక్కించేలా చంద్రబాబు తన బృందాన్ని ఎంపిక చేసుకున్నారు. సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తూనే కొత్త తరానికి కేబినెట్‌లో అధిక స్థానాలు కేటాయించారు. 17 మంది మొదటిసారి మంత్రి పదవులు అందుకోవడం విశేషం. గతంలో మంత్రులుగా పనిచేసినవారు కొత్త కేబినెట్‌లో ఏడుగురే. మంత్రుల్లో పది మంది తొలిసారి ఎన్నికైన వారు కావడం మరో విశేషం. వీరిలో

మిగతా 11వ పేజీలో...

ట్రాఫిక్ టెర్రర్!
చిక్కుకున్న గవర్నర్ వాహనం.. ప్రమాణ స్వీకారం 6 నిమిషాలు ఆలస్యం
డీజీపీ రంగంలోకి దిగాకే దొరికిన దారి.. నేతలు, ఐపీఎస్‌లకూ ఇక్కట్లు



కేసుల భయంతో 5 ఐఫోన్లు మటాష్

- ఎన్నికల ఫలితాల రోజే ధ్వంసం.. వాటిలోని క్లౌడ్ డేటా తొలగింపు
- గనుల శాఖ ఘనుడి నిర్వాకం.. జగన్ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు అడ్డగోలుగా పనిచేశారు. మళ్లీ వైసీపీ గెలుస్తుందని భావించి చెలరేగిపోయారు. ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించడంతో ఆ అధికారి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. అదే రోజు రాత్రి 7:30 గంటల సమయంలో బహుశా తాడేపల్లి ప్యాలెస్ నుంచేమో ఓ ఫోన్ కాల్ వచ్చింది. అంతే.. ఆగమేఘాల మీద ఆయన రెండు కొత్త ఐఫోన్లు తెప్పించారు. ఇంట్లో ఉన్న ఐదు ఐఫోన్లలో ఉన్న డేటాను పూర్తిగా తొలగించారు. ఐక్లౌడ్‌లో ఉన్న డేటాను కూడా పూర్తిగా డిలీట్ చేశారు. ఆ వెంటనే ఆ ఫోన్లను ధ్వంసం చేశారు. గనుల శాఖలో కీలకంగా వ్యవహరించిన ఓ ఉన్నతాధికారి చేసిన నిర్వాకం ఇదీ. జగన్ ప్రభుత్వంలో గనుల శాఖలో పనిచేసిన ఆయన స్వామి భక్తి చాటుకున్నారు. గనుల శాఖలో

మిగతా 2వ పేజీలో...

పాతాళం నుంచి పునర్నిర్మాణం!



జగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి

విభజన కంటే ఐదేళ్లలోనే నష్టం ఎక్కువ

- ఏపీ అప్పులు రూ.11 లక్షల కోట్లకు పైనే
- ఏడాదికి కట్టాల్సిన వడ్డీలు 65,000 కోట్లు
- పరిశ్రమలు పరార్.. యువతకు ఉపాధి లేదు
- మూడు ముక్కలాటతో అమరావతి నాశనం
- కుదేలైన రియల్.. ప్రభుత్వ ఖజానాకు గండి
- పడకేసిన ప్రాజెక్టులు.. అస్తవ్యస్తంగా రోడ్లు
- మళ్లీ గాడిన పెట్టాల్సిన బాధ్యత బాబుపైనే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఎటుచూసినా గుంతలమయమైన రోడ్లు... అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులు... కొత్త పరిశ్రమలేవు... ఉన్నవీ ఇతర రాష్ట్రాలకు వలసబాట... దేశంలోనే అత్యధిక శాతం నిరుద్యోగం... కొండలా పెరిగిపోయిన అప్పుల కుప్ప... గత ఐదేళ్లలో జగన్ పాలనలో జరిగిన విధ్వంసం అంతా ఇంతా కాదు. రాష్ట్రానికి కోలుకోలేనంత నష్టం జరిగింది. ఒక్కముక్కలో చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే గత ఐదేళ్లలో జగన్ పాలనలో జరిగిన నష్టమే ఎక్కువ. రాష్ట్రంలో భూతద్దం పెట్టి వెదికినా అభివృద్ధి జాడే కనిపించదు. మూడుముక్కలాటతో అమరావతిని సర్వనాశనం చేసేశారు. రాష్ట్రంలో ప్రతిరంగం పాతాళానికి పడిపోయింది. వ్యవస్థలన్నింటినీ చక్కదిద్ది ఆంధ్రప్రదేశ్‌కు పునర్వైభవం తీసుకురావాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉంది. ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టి పెట్టుబడిదారుల్లో విశ్వాసం చూరగొనాలి. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి యువతకు ఉపాధి కల్పించాలి. ప్రాజెక్టులను పూర్తి చేసి

మిగతా 2వ పేజీలో...


కువైట్‌లో అగ్ని కీలల్లో చిక్కుకున్న ఎన్‌బీటీసీ గ్రూప్ భవనం

కువైట్‌లో భారీ అగ్ని ప్రమాదం

50 మంది భారతీయుల

దుర్మరణం

- మరో 35 మందికి గాయాలు.. వారిలో ఏడుగురి పరిస్థితి విషమం
- మృతులంతా మలయాళీ, తమిళులే.. అందరూ ఎన్‌బీటీసీ కార్మికులే
- ఆరంతస్తుల భవనంలో తెల్లవారుజామున వ్యాపించిన మంటలు
- గ్యాస్ లీకేజీతోనే అగ్నిప్రమాదం
- నిద్రలోనే అనంత లోకాలకు 35 మంది
- చికిత్స పొందుతూ 15 మంది మృతి
- మునిసిపాలిటీ అధికారుల సస్పెన్షన్
- ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు 2 లక్షలు
- కువైట్‌కు కేంద్ర మంత్రి కేవీ సింగ్
- తెలుగు వారంతా క్షేమం

కువైట్ సిటీ/న్యూఢిల్లీ/తిరువనంతపురం, జూన్ 12: పొట్టకూటి కోసం దేశం కాని దేశం వెళ్లి.. భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకునేందుకు రేయింబవళ్లు కష్టపడి పనిచేసే ఆ కార్మికుల ఊపిరి ఆగిపోయింది. కాయకష్టం చేసి, ఆదమరిచి సేదతీరుతున్న వారిలో 35 మంది భారీ అగ్నిప్రమాదంతో నిద్రలోనే తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. పొగతో ఉక్కిరిబిక్కిరై కొందరు.. పైఅంతస్తుల నుంచి కిందకు దూకి తప్పించుకునే ప్రయత్నంలో

మిగతా 2వ పేజీలో...

మద్యం మత్తుకు చెక్ పెట్టే జెల్

ఆ మహమ్మారి వల్ల కలిగే దుష్ప్రభావాలకూ
ఎలుకల రక్తంలో ఈ జెల్‌తో 40-56% మేర తగ్గిన మద్యం స్థాయిలు
ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞుల ఘనత
2


3

బడికి వేళాయె

నేడు పాఠశాలల పునఃప్రారంభం
స్టూడెంట్ కిట్ల పంపిణీ కూడా నేటి నుంచే..

పాక్ ఉగ్రవాదికి క్షమాభిక్ష తిరస్కరణ

2000లో ఎర్రకోటపై దాడి కేసులో ఆరిఫ్‌కు మరణశిక్ష
2
నాడు రివ్యూ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం
నేడు క్షమాభిక్ష పిటిషన్‌ను తోసిపుచ్చిన ముర్ము



'నీట్' పిటిషన్లన్నీ బదిలీ చేయాలి

సుప్రీంకెళ్తాం.. హైకోర్టుకు తెలిపిన ఎన్టీఏ
2

పాతాళం నుంచి పునర్నిర్మాణం!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలి. గంజాయి మహమ్మారిని పూర్తిగా నిర్మూలించి యువతను ఆదుకోవాలి. రోడ్లను బాగు చేయాలి. అమరావతిని మళ్లీ పట్టాలెక్కించాలి. రియల్ ఎస్టేట్‌కు ఊతంతో పాటు పారదర్శకమైన ఇసుక విధానాన్ని తేవాలి. నవ్యాంధ్రను అభివృద్ధిపథంలో నడపాల్సిన బాధ్యత చంద్రబాబుపై ఉంది.

అప్పుల కుప్ప

జగన్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు. మొత్తం అప్పులు ఈ ఏడాది మే తొలి వారానికి రూ.11 లక్షల కోట్లకు మించిపోయాయి. వీటికి ఏడాదికి రూ.65,000 కోట్ల వడ్డీలు చెల్లించాలి. ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, పార్కులు, కాలేజీలు, పోర్టు భూములు, ఆఖరికి రాష్ట్ర సచివాలయం కూడా తాకట్టులో ఉన్నాయి. అడ్డగోలుగా ఇన్ని అప్పులు చేసినా ప్రభుత్వ ఉద్యోగులకు ఏనాడూ ఒకటో తేదీన జీతాలు ఇచ్చిన పాపాన పోలేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నుంచి రాబడి మందగించింది. ఉపాధి లేక ప్రజలు అల్లాడిపోయారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు లభించాలన్నా, ఖజానాకు ఆదాయం రావాలన్నా కొత్తగా పెట్టుబడులు రావాలి. పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. అందుకోసం పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించాలి. కానీ జగన్ పాలన అంతా 'రివర్స్'లో సాగింది. ఐదేళ్ల పాలనలో కొత్త పరిశ్రమలు రాక పోగా, ఉన్నవి కూడా పొరుగు రాష్ట్రాల బాటపట్టాయి. మరోవైపు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వం ఏ మాత్రం చేయూత ఇవ్వలేదు. దీని ఫలితమే దేశంలోనే అత్యధికంగా 24% నిరుద్యోగం రాష్ట్రంలో ఉంది. టీడీపీ హయాంలో ప్రపంచస్థాయి సంస్థలు, విదేశీ పెట్టుబడులు, దేశంలోనే దిగ్గజ కంపెనీల రాకతో రాష్ట్రం కళకళలాడుతుండేది. రాష్ట్రానికి చంద్రబాబు ఓ బ్రాండ్ సృష్టించారు. కానీ జగన్ పాలనలో పరిస్థితి పూర్తిగా తలకిందులైంది.

అమరావతి సర్వనాశనం

రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. చంద్రబాబు ముందుచూపుతో ప్రపంచస్థాయి నగర నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. నిర్మాణ పనులు కూడా చేపట్టారు. జగన్ వచ్చాక పనులు ఆపేసి మూడుముక్కలాట ఆడారు. నిర్మాణాన్ని అలాగే కొనసాగించి ఉంటే ఎన్నో సంస్థలు వచ్చేవి. ఉపాధి, ఉద్యోగాలు లభించేవి. చుట్టు పక్కల జిల్లాల్లో కూడా రియల్ ఎస్టేట్ జోరుగా ఉండేది. ఖజానాకు ఆదాయం వచ్చేది. అయితే జగన్ అమరావతిని సర్వనాశనం చేశారు. మరోవైపు విశాఖను పాలనా రాజధానిని చేస్తామంటూ అక్కడి ప్రభుత్వ భూములను, కార్యాలయాలను తాకట్టు పెట్టారు. ప్రైవేటు భూములను కబ్జా చేసి సొంత జేబులు నింపుకొన్నారు.

ముందుకుసాగని ప్రాజెక్టులు

జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా పడకేశాయి. ఏ ఒక్క ప్రాజెక్టూ ముందుకు కదల్లేదు. ఆఖరికి వైసీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న వెలిగొండ, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణాలు ఇంచు కూడా ముందుకు సాగలేదు. ఎన్నో గడువులు మార్చారు కానీ పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారు. అసమర్థ నిర్ణయాలతో అతీగతీ లేకుండా చేశారు. కేంద్ర జలసంఘం ఆమోదించిన దాని కంటే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం అంచనాను రూ.8,932 కోట్లకు ఆర్‌సీసీ తగ్గించినా జగన్ కనీసం నిరసన తెలుపకుండా చప్పట్లు కొట్టి మరీ సంతకాలు పెట్టి వచ్చారు. ఐదేళ్లలో వెలిగొండ టన్నెల్‌లో ఒక్క మీటర్ కూడా లైనింగ్ పనులు చేయడం చేతగాని జగన్ ప్రభుత్వం.. సొరంగాలు పూర్తయి నీటి విడుదలకు సిద్ధంగా ఉందంటూ తప్పుడు ప్రచారం చేసింది. వరికపూడిసెల ఎత్తిపోతలకు ఇంతవరకు పర్యావరణ అనుమతే తీసుకోలేదు. కనీసం దరఖాస్తు కూడా చేయలేదు. ఇలా సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ వైసీపీ ప్రభుత్వం పాతరేసింది.

గంజాయికి కేరాఫ్‌గా ఏపీ

జగన్ హయాంలో రాష్ట్రం గంజాయికి కేరాఫ్‌గా మారింది. పాఠశాల విద్యార్థుల నుంచి యువత వరకు ఈ మహమ్మారి నాశనం చేస్తోంది. విశాఖ మన్యం నుంచి ఏటా రూ.10 వేల కోట్ల విలువైన గంజాయి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు దేశ, విదేశాలకు తరలిపోతోంది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో చేరేసరికి దీని విలువ రూ.25 వేల కోట్ల పైమాటే. ఏపీ కేంద్రంగా ఇంత భారీ దందా సాగుతుంటే ఉక్కుపాదం మోపాల్సిన జగన్ సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా గంజాయి మాఫియాకు కొమ్ముకాశారనే ఆరోపణలున్నాయి. నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పట్టుకున్న 23 లక్షల కిలోల గంజాయిలో 70 శాతం అంటే.. 16 లక్షల కిలోలకు పైగా ఏపీ నుంచి సరఫరా అయింది.

నరకానికి నకళ్లుగా రోడ్లు

ఒక రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందో తెలియాలంటే అక్కడి రోడ్లను చూస్తే అర్థమవుతుంది. అయితే రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్లపై గుంతలే. జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలను కలిపే రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. కొత్త రోడ్ల విషయం అటుంచితే ఉన్నవాటికి మరమ్మతులు కూడా చేయలేదు. గత ఐదేళ్లలో తట్టెడు మట్టి కూడా వేయలేదు. రోడ్ల నిర్మాణం కోసం తెచ్చిన అప్పులను కూడా వైసీపీ ప్రభుత్వం సొంత ప్రయోజనాల కోసం మళ్లించింది.

రియల్ ఎస్టేట్ ఢమాల్

జగన్ సర్కారు వచ్చాక రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం స్తంభించిపోయింది. దౌర్జన్యాలు, బెదిరింపులు, ముడుపులు, కమీషన్లతో కోలుకుండా చేశారు. మూడు రాజధానుల ప్రకటనతో పరిస్థితి మరింత దిగజారింది. ఉమ్మడి గుంటూరు, కృష్ణాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో కూడా ఈ ప్రభావం ఎక్కువగా పడింది. ఇక సొంత జేబులు నింపుకోవడానికి వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీ వల్ల భవన నిర్మాణ రంగం కుదలైంది. కార్మికులు ఉపాధి లేక వలస వెళ్లిపోయారు.

కేసుల భయంతో 5 ఐఫోన్లు మటాష్

(మొదటి పేజీ తరువాయి)

తిరిగి తానే కీలక పోస్టులో ఉంటానని ఎన్నికల ముందు బహిరంగంగా చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు వరకు ఆయన సర్వీసు ఉంది. జూలై వరకు ఏపీలో పనిచేసేలా డిప్యుటేషన్ తెచ్చుకున్నారు. టీడీపీ ప్రభుత్వంలో పేదలకు ఉచిత ఇసుక ఇవ్వడం వల్ల గనుల శాఖకు నష్టం వాటిల్లిందని కేసు పెట్టించారు. అయితే టీడీపీ కూటమి విజయదుందుభి మోగించడంతో ఆయనకు ముచ్చెమటలు పట్టాయి. భవిష్యత్ కళ్లముందు కనిపించింది. గనుల శాఖలో తాను చేసిన లావాదేవీలు, దందాలు, సెటిల్‌మెంట్‌లకు సంబంధించిన డేటా ఉన్న ఐఫోన్‌లు, 2 ఐప్యాడ్‌లను ధ్వంసం చేయాలనుకున్నారు. నిధుల దుర్వినియోగం కేసులో పరారీలో ఉన్న ఓ ఐటీ ఇంజనీర్‌ను రహస్యంగా తన ఇంటికి పిలిపించుకున్నారు. తన వద్ద ఉన్న రెండు ఐఫోన్లు, భార్య, చిన్న కూతురి వద్ద ఉన్న రెండు ఐఫోన్లు, తన సహాయకుడు వాడే ఐఫోన్‌లో ఉన్న క్లౌడ్ డేటాను రికవరీకి సాధ్యంకాని రీతిలో డిలీట్ చేశారు. ఆ తర్వాత ఆ ఐదు ఫోన్లను ధ్వంసం చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం 2 కొత్త ఐఫోన్లను ఆయన వాడుతున్నట్లు తెలిసింది. కొత్త ప్రభుత్వం ఇసుక, బొగ్గు, బీచ్‌శాండ్, మేజర్, మైనర్ మినరల్ వేలంలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశిస్తే కచ్చితంగా ఆ మాజీ అధికారి ఇరుక్కుంటారు. అప్పుడు ఆయన ఫోన్లను సీజ్ చేసి డేటాను విశ్లేషించే అవకాశం ఉంటుంది. దీంతో తన బండారం బయటపడుతుందని భావించి, ముందు జాగ్రత్తగా ఫోన్లను ధ్వంసం చేసినట్లు తెలిసింది.

కువైట్‌లో భారీ అగ్నిప్రమాదం

50 మంది భారతీయుల దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

మరికొందరు.. ఇలా 50 మంది గాయాలపాలవ్వగా వారిలో 15 మంది ఆస్పత్రిలో కన్నుమూశారు. క్షతగాత్రుల్లో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. కువైట్‌లోని మంగఫ్ మునిసిపాలిటీ పరిధిలోని ఎన్‌బీటీసీ గ్రూప్ భవనంలో ఈ దారుణం చోటుచేసుకుంది. మలయాళీ అయిన కేజీ అబ్రహానికి చెందిన ఎన్‌బీటీసీ కంపెనీలో పనిచేసేవారంతా మలయాళీలు, తమిళులే.! వీరికి వసతి కల్పించేందుకు కువైట్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో భవనాలను నిర్మించారు. మంగాఫ్ నగరంలోని ఆరంతస్తుల భవనంలో సుమారు 196 మంది మలయాళీలు, తమిళులు నివసిస్తున్నారు. కువైట్‌లోని భారతీయులు ఈ భవనాన్ని 'మలయాళీ క్యాంపు'గా పిలుస్తారు. కువైట్ కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 4.45 గంటల సమయంలో ఎన్‌బీటీసీ కార్మికులు నివసించే భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న వంటగదిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వంటగదిలో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలడంతో.. క్షణాల్లో మంటలు పైఅంతస్తులకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఉదయం 6 గంటల వేళ మంటలు అదుపులోకి వచ్చాయి. ఘటనాస్థలిలో 35 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, అగ్నిప్రమాదం నుంచి తప్పించుకునేందుకు పైఅంతస్తుల నుంచి కిందకు దూకి గాయాలైన వారు, దట్టమైన పొగతో శ్వాస ఇబ్బందులను ఎదుర్కొంటున్న వారు.. ఇలా మొత్తం 50 మందిని అల్-అదాన్, అల్-ఫర్వానియా, అల్-అమీరి, అల్-ముబారక్, అల్-జాబెర్ ఆస్పత్రులకు తరలించినట్లు ఆయన వివరించారు. వీరిలో 15 మంది మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. మిగతా 35 మంది క్షతగాత్రులకు అత్యవసర చికిత్సలు అందజేస్తున్నట్లు వివరించారు. బాధితుల్లో చాలా మంది దట్టమైన పొగను పీల్చడం వల్ల మరణించినట్లు వైద్య అధికారులు ప్రకటించారు. కువైట్‌లోని భారత రాయబారి ఆదర్శ్ స్వైకా సంఘటనాస్థలిని సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడారు. బాధితుల కుటుంబ సభ్యులు ఎంబసీ హెల్ప్‌లైన్ +965 65505246ను సంప్రదించవచ్చన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న భారత రాయబారి ఆదర్శ్

మోదీ, జైశంకర్ దిగ్భ్రాంతి

కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో భారతీయులు మృతిచెందడం పట్ల ప్రధాని మోదీ, విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "పరిస్థితిని సమీక్షిస్తున్నాం. కువైట్‌లోని భారతీయ రాయబార కార్యాలయ అధికారులు సంఘటనాస్థలికి చేరుకున్నారు" అని పోస్టు చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ప్రధాని ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. భారీ ప్రాణనష్టం జరిగిన నేపథ్యంలో విదేశాంగ శాఖ సహాయ మంత్రి కృతి వర్ధన్ సింగ్ హుటాహుటిన కువైట్‌కు బయలుదేరారు. మృతదేహాలను త్వరితగతిన భారత్ తరలించేందుకు ఆయన చొరవ తీసుకుంటారని తెలుస్తోంది.

తెలుగు వారంతా క్షేమమే

తమకు ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం అగ్నిప్రమాద మృతుల్లో తెలుగు వారెవరూ లేరని ఎన్నారై టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ సభ్యుడు, యునైటెడ్ తెలుగు ఫోరం కన్వీనర్ వెంకట్ కోడూరి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. "ప్రమాదం జరగ్గానే మనవాళ్లు ఉన్నారా? అనే అంశంపై ఆరా తీశాం. ఎన్‌బీటీసీ భవనం చుట్టుపక్కల నివసించే తెలుగువారిని ఆరా తీస్తే.. మృతుల్లో మలయాళీలు, తమిళులే ఉన్నట్లు చెప్పారు. కువైట్ అధికారిక వర్గాలు విడుదల చేసిన పేర్లలో, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో తెలుగువారు ఎవరూ లేరని స్పష్టమవుతోంది" అని ఆయన వివరించారు. అయితే, బుధవారం కడపటి వార్తలందేసరికి మృతుల్లో 21 మంది పేర్లను ప్రకటించారు. వారిలో ఒకరు ఏపీకి చెందిన వారు కావొచ్చని అనుమానిస్తున్నారు. మృతుల్లో ఎక్కువ మంది మలయాళీలు కావడంతో కేరళలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, కువైట్‌లోని మలయాళీ సంఘాలు మృతులు, క్షతగాత్రుల కుటుంబ సభ్యులను సంప్రదించేందుకు ఈ కింది హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేశాయి.

అనుప్ మంగత్	+965 90039594
బిజోయ్	+965 66893942
రిచీ జార్జ్	+965 60615153
అనిల్ కుమార్	+965 66015200
థామస్ సెల్వన్	+965 517141951
అన్సారీ	+965 60311882
జిన్స్ థామస్	+965 65589453

పాక్ ఉగ్రవాదికి క్షమాభిక్ష తిరస్కరణ

- 2000లో ఎర్రకోటపై దాడి కేసులో ఆరిఫ్‌కు మరణశిక్ష
- క్షమాభిక్ష పిటిషన్‌ను తోసిపుచ్చిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, జూన్ 12: ఎర్రకోటపై దాడి కేసులో మరణశిక్ష ఎదుర్కొంటున్న పాకిస్థాన్ ఉగ్రవాది మొహమ్మద్ ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్ క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. అధికార వర్గాలు బుధవారం ఈ విషయాన్ని వెల్లడించాయి. 2000 డిసెంబరు 22న ఎర్రకోట ఆవరణలోని 7 రాజ్‌పుతానా రైఫిల్స్ యూనిట్‌పై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడటంతో ముగ్గురు జవాన్లు మరణించారు. ఆ తర్వాత నాలుగు రోజులకు లష్కరే తాయిబా ఉగ్రవాది ఆరిఫ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. 1999లో మరో ముగ్గురు ఉగ్రవాదులు అబూ షాద్, అబూ బిలాల్, అబూ హైదర్‌లతో కలిసి ఆరిఫ్ అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం అబూ షాద్, అబూ బిలాల్, అబూ హైదర్ వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మరణించారు. 2005 అక్టోబరు 5న విచారణ కోర్టు ఆరిఫ్‌కు మరణ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టు కూడా విచారణ కోర్టు తీర్పును సమర్థిస్తూ 2011 ఆగస్టులో తీర్పు వెలువరించింది. ఆ తర్వాత ఆరిఫ్ వేసిన రివ్యూ పిటిషన్, క్యూరేటివ్ పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు 2022లో కొట్టివేసింది. కాగా, ఈ ఏడాది మే 15న ఆరిఫ్ క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేయగా, దానిని అదేనెల 27వ తేదీన రాష్ట్రపతి తిరస్కరించారు. మే 29న వెలువడిన రాష్ట్రపతి సెక్రటేరియట్ ఆదేశంలో ఈ మేరకు పేర్కొన్నట్టు అధికారులు బుధవారం వెల్లడించారు.

పార్లమెంటు సమావేశాలు 24 నుంచి



న్యూఢిల్లీ, జూన్ 12: ఇటీవలి ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన ఎంపీలతో 18వ లోక్‌సభ ఈ నెల 24న కొలువుదీరనుంది. జూలై 3 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. తొలి మూడు రోజులు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం, స్పీకర్ ఎన్నిక ఉంటాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. ఈ నెల 27న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఇక రాజ్యసభ 264వ సమావేశాలు ఈ నెల 27 నుంచి జూల్ 3 వరకు కొనసాగుతాయని 'ఎక్స్'లో రిజిజు పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీ తన మంత్రులను 27న రాష్ట్రపతి ప్రసంగం అనంతరం పార్లమెంటుకు పరిచయం చేస్తారని భావిస్తున్నారు.

నేడు ఇటలీకి మోదీ

- జీ-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రధాని నరేంద్రమోదీ జీ-7 దేశాల 50వ సదస్సులో పాల్గొనేందుకు ఇటలీ వెళ్లనున్నారు. ఇటీవల మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీకిది తొలి విదేశీ పర్యటన కానుంది. అపులియా ప్రాంతంలోని బోర్గో ఎగ్నాజియా అనే రిసార్ట్‌లో జూన్ 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు ఈ సదస్సు జరుగనుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్, జపాన్ ప్రధాని ఫుమ్యో కిషిడా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. ఉక్రెయిన్ యుద్ధం, గాజా సంఘర్షణపై సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశముంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం ఓ సెషన్‌కు హాజరై తమ దేశంపై రష్యా జరుపుతున్న దాడి గురించిన చర్చలో పాల్గొంటారు. కాగా, జీ-7 సదస్సులో మోదీ పాల్గొనడం జీ-20 ఫలితాలను అనుసరించేందుకు ఉపకరిస్తుందని విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వత్రా బుధవారం తెలిపారు. కాగా, ఇటలీలో మహాత్మగాంధీ విగ్రహాన్ని బుధవారం ఖలిస్థానీ మద్దతు దారులు ధ్వంసం చేశారు.

చావు దెబ్బ తీశాం

- మోదీ సర్కారుది కనీసం నడవలేని స్థితి
- వయనాడ్, రాయ్‌బరేలీల్లో దేన్ని త్యజించాలో తేల్చుకోలేకపోతున్నా: రాహుల్



వయనాడ్, జూన్ 12: ఎన్నికల్లో విపక్షాలు కొట్టిన చావుదెబ్బకు మోదీ సర్కారు కనీసం నడవలేని స్థితికి చేరుకుందని కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. దేశాన్ని నడిపించే చేవ ఎన్డీయే కూటమికి లేదన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ తమ వైఖరులను మార్చుకోవాల్సిందేనన్న స్పష్టమైన సంకేతాన్ని తమ తీర్పుతో దేశ ప్రజలు ఇచ్చారని పేర్కొన్నారు. కేరళలోని వయనాడ్‌లో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం తర్వాత వయనాడ్‌లో తొలిసారి ఆయన పర్యటించారు. "ఇప్పుడు చూసేది పాత మోదీని కాదు. మోదీ వేసుకున్న పథకాలను ఇండియా కూటమి ధ్వంసం చేసేసింది" అని రాహుల్ పేర్కొన్నారు. వారాణసీలో మోదీ త్రుటిలో ఓటమిని తప్పించుకున్నారని ఆయన పేర్కొన్నారు. "ఏడో విడత ఎన్నికల ప్రచార విరామంలో అందరూ ఇంటికి పరిమితం అయ్యారు. కానీ, మోదీ ధ్యానం పేరిట కన్యాకుమారిలో ప్రచారం సాగించారు. ఇంత చేసినా గానీ వారాణసీలో మోదీ మెజారిటీ గణనీయంగా తగ్గిపోయింది" అని రాహుల్ ఎద్దేవా చేశారు. మోదీ అవసరాలను తీర్చేలా షెడ్యూల్‌ను ఈసీ తయారుచేసిందని, వారాణసీకి చివరి విడతలో ఎన్నికలు జరిపించడం ఇందులో భాగమేనన్నారు. కాగా, సాధారణ ఎన్నికల్లో రాహుల్ వయనాడ్‌తోపాటు రాయ్‌బరేలీ నుంచి కూడా విజయం సాధించారు. ఈ రెండింటిలో ఒకటి ఆయన వదులుకోవాల్సి ఉంది. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. 'ఇంకా సందిగ్ధంలోనే ఉన్నాను. కానీ, నేను ఏ నిర్ణయం తీసుకున్నా ఈ రెండు నియోజకవర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలి' అని కోరారు. కాగా, "దేశానికి నాయకత్వం వహించాల్సిన నేతను వయనాడ్‌కే పరిమితం చేసి చూడలేం" అంటూ కాంగ్రెస్ పార్టీ కేరళ శాఖ అధ్యక్షుడు సుధాకరన్ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది.

అయోధ్య ప్రజలది గొప్ప తీర్పు

పుణే, జూన్ 12: మందిర రాజకీయాలను ఎలా తిప్పికొట్టాలో అయోధ్య ప్రజలు రుజువు చేశారని, అందుకే అక్కడ బీజేపీ ఓటమి చవిచూసిందని ఎన్‌సీపీ(ఎస్‌పీ) నేత శరద్‌పవార్ పేర్కొన్నారు. రామ మందిరమే ప్రధాన ఎజెండాగా ఎన్నికల్లోకి వెళ్లిన అధికార పార్టీ భారీగా ఓట్లు మూటకట్టుకుంటుందని తాను భావించానని, కానీ దేశ ప్రజలు వివేకవంతులని, గుడి పేరుతో ఓట్లు అడుగుతుందని గ్రహించి బీజేపీని ఓడించారని తెలిపారు. మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన... మోదీపై విమర్శలు గుప్పించారు.



'నీట్' పిటిషన్లన్నీ బదిలీ చేయాలి

- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం: ఎన్టీఏ

న్యూఢిల్లీ, జూన్ 12: నీట్-యూజీ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పలు హైకోర్టుల్లో దాఖలు చేసిన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) కోరింది. ఈ విషయమై తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని బుధవారం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. కొందరికి గ్రేస్ మార్కులు కేటాయించడం, పేపర్ లీక్, ఇతర అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు జవాబు ఇవ్వాలని కోర్టులు ఆదేశించిన నేపథ్యంలో ఎన్టీఏ ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు తెలియజేసింది. 7 హైకోర్టులతో పాటు సుప్రీంకోర్టులోనూ ఈ అంశంపై పిటిషన్లు దాఖలయ్యాయని ఎన్టీఏ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. త్వరలోనే ఈ పిటిషన్ల బదిలీపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు ధర్మాసనానికి తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను జూలై 5కు వాయిదా వేసింది. నీట్ కౌన్సెలింగ్ ఆపాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. మరోవైపు 1500 మందికి పైగా విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ 'ఫిజిక్స్ వాలా' సంస్థ సీఈవో అలఖ్ పాండే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

కేసులు నమోదైతే పేపర్ లీకైనట్లు కాదు

నీట్-యూజీ పరీక్షకు సంబంధించి కేసులు నమోదైనంత మాత్రన పేపర్ లీకైనట్లు కాదని ఎన్టీఏ డీజీ సుబోధ్ కుమార్‌సింగ్ అన్నారు. నీట్‌కు సంబంధించి సుప్రీంకోర్టులో కేసు నమోదైన నేపథ్యంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. "నీట్-యూజీ పరీక్షకు సంబంధించి 63 కేసులు నమోదయ్యాయి. 23 మంది పరీక్ష సమయంలో డిబార్ అయ్యారు. 40 మంది విద్యార్థులు అవకతవకలకు పాల్పడితే పేపర్ లీకేజీ జరిగినట్లు కాదు. దానివల్ల నీట్ పరీక్ష పవిత్రత దెబ్బతినదు" అని అన్నారు.

మోదీ 3.0కి మరో సవాల్!

న్యూఢిల్లీ, జూన్ 12: కేంద్రంలో సొంతంగా అధికారంలోకి రాలేకపోయిన బీజేపీకి, ప్రధాని మోదీకి ఈ సారి పార్లమెంటరీ కమిటీల పదవుల విషయంలో పెద్ద సవాల్ ఎదురు కానుంది. కమిటీల్లో సింహభాగం ఇన్నాళ్లూ బీజేపీ చేతిలోనే ఉండేవి. ఇప్పుడు విపక్షాల సంఖ్యాబలం (234) పెరగడంతో కొన్ని కమిటీల సారథ్యం వాటికీ ఇవ్వక తప్పని పరిస్థితి. ఎన్డీయేలో ప్రస్తుతం బీజేపీ (240) తర్వాత పెద్ద పార్టీలైన టీడీపీ (16), జేడీయూ (12) కూడా కొన్ని కమిటీల చైర్మన్ పదవులు తప్పక ఆశిస్తాయి. కేంద్రప్రభుత్వంలోని అన్ని శాఖలకు సంబంధించి పార్లమెంటులో మొత్తం 24 కమిటీలు ఉంటాయి. ప్రతి కమిటీలో 31 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 21 మందిని లోక్‌సభ నుంచి స్పీకర్, 10 మందిని రాజ్యసభ నుంచి చైర్మన్ ఎంపిక చేస్తారు. ఇవిగాక ఎస్టిమేట్స్ కమిటీ, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ), సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ), ప్రివిలేజెస్ కమిటీ, హౌస్ కమిటీలు ఉంటాయి. మొత్తంగా 30 కమిటీలు ఉంటాయని.. వీటి చైర్మన్లను పార్లమెంటులో బలాబలాల ఆధారంగా ఆయా పార్టీల నుంచి ఎంపిక చేస్తారు. కీలక బిల్లులను చట్టంగా మార్చే క్రమంలో పార్లమెంటరీ కమిటీల పాత్ర కీలకం. బిల్లుల్లో లోపాలను ఎత్తిచూడం, సిఫారసులు చేయడం కమిటీల విధి. ఈ నేపథ్యంలో కీలక సంస్కరణలు, విధానాల కొనసాగింపునకు వీలుగా హోం, ఆర్థిక, ఐటీ, రక్షణ, విదేశీ వ్యవహారాల కమిటీల చైర్మన్ పదవులను బీజేపీ వదులుకోదని పార్లమెంటరీ వర్గాలు అంటున్నాయి. అయితే, సంకీర్ణ భాగస్వాములను కూడా బీజేపీ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుందని.. ముఖ్యంగా ఏపీ, బిహార్ రాష్ట్రాల అంశాలపై దృష్టి సారించాల్సి ఉంటుందని ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని జాకీర్ హుస్సేన్ ఢిల్లీ కాలేజీ ప్రొఫెసర్ రవి రంజన్ తెలిపారు.

మద్యం దుష్ప్రభావాలకు చెక్ పెట్టే జెల్

అభివృద్ధి చేసిన ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞులు



న్యూఢిల్లీ, జూన్ 12: మద్యం మత్తుకు, ఆ మహమ్మారి వల్ల శరీరంపై పడే దుష్ప్రభావాలకూ చెక్ పెట్టే వినూత్న ప్రొటీన్ జెల్‌ను స్విస్ శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. శరీరంలోకి ప్రవేశించిన మద్యం ప్రమాదకరమైన ఎసిటాల్డిహైడ్‌గా మారకముందే.. దాన్ని నిరపాయకరమైన ఎసిటిక్ యాసిడ్ మార్చేయడం ఈ జెల్ ప్రత్యేకత. సాధారణంగా మనం తినే ఆహారం జీర్ణవాహికలో నిదానంగా జీర్ణమవుతుంది. కానీ, మద్యం అలా నెమ్మదిగా కాకుండా.. జీర్ణవాహిక గోడలపై ఉండే మ్యూకస్-మెంబ్రేన్ పొరల గుండా రక్తంలోకి ప్రవేశించి, రక్త కణాల ద్వారా శరీరమంతా వేగంగా వ్యాపిస్తుంది. అందుకే మద్యం తీసుకున్న కొద్దిసేపటికే మత్తు కలగడం మొదలవుతుంది. అలా రక్తంలోకి చేరిన ఆల్కహాల్‌ను మన కాలేయం బ్రేక్‌డౌన్ చేసి అసిటాల్డిహైడ్‌గా మారుస్తుంది. అది కొద్దిసేపటికే ఎలాంటి ప్రమాదం లేని అసిటిక్ యాసిడ్‌గా మారుతుంది. కానీ.. ఆలోగానే అసిటాల్డిహైడ్ మన శరీరానికి తీవ్ర హాని చేస్తుంది. ఈ నేపథ్యంలోనే స్విట్జర్లాండ్‌కు చెందిన ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞులకు ఒక ఆలోచన వచ్చింది. శరీరంలోకి ప్రవేశించిన ఆల్కహాల్ రక్తంలోకి ప్రవేశించి, ఆపై అసిటాల్డిహైడ్‌గా మారకుండా నేరుగా అసిటిక్ యాసిడ్‌గా మారిపోయేలా చేస్తే మద్యం మత్తును, ఇతర దుష్ప్రభావాలను అరికట్టవచ్చన్నది వారి ఆలోచన. దీనిపై రకరకాల ప్రయోగాలు చేసి, చివరికి.. వే ప్రొటీన్లకు ఐరన్, గ్లూకోజ్, గోల్డ్ నానో పార్టికల్స్‌ను జోడించి తాము అనుకున్న జెల్‌ను తయారు చేయగలిగారు. ప్రయోగాల్లో భాగంగా ఆ జెల్‌ను రెండు గ్రూపుల ఎలుకలకు ఇచ్చారు. ఒక గ్రూపులో ఎలుకలకు ఒక్కసారి మద్యం తాగించారు. మరో గ్రూపులోని ఎలుకలకు 10 రోజులపాటు మద్యం తాగించారు. ఒక్కసారి మద్యం తాగించిన ఎలుకలకు ఈ జెల్‌ను ఇచ్చి.. అరగంట తర్వాత పరీక్ష చేయగా, వాటిలో ఆల్కహాల్ స్థాయులు 40% తగ్గినట్టు వెల్లడైంది. ఐదుగంటల తర్వాత పరీక్ష చేయగా.. మద్యం స్థాయులు 56 శాతం మేర తగ్గాయి. పదిరోజులపాటు వరుసగా ఆల్కహాల్ ఇచ్చిన ఎలుకలకు ఈ జెల్ ఇవ్వగా.. అది మద్యం వల్ల కలిగే దుష్ప్రభావాలను బాగా తగ్గించినట్టు గమనించారు. ఆ ఎలుకల కాలేయం, ప్లీహం, పేగులు అంత ఎక్కువగా దెబ్బతినకుండా ఉండడాన్ని శాస్త్రజ్ఞులు గుర్తించారు. అయితే.. ఈ జెల్ ప్రభావం మానవులపై ఎలా ఉంటుందో పరీక్షించాల్సి ఉంది. మానవులపై కూడా జెల్ ఇలాగే పనిచేస్తే ఏటా మద్యపాన వ్యసనం వల్ల సంభవిస్తున్న 30 లక్షల మరణాలకు చెక్ పెట్టవచ్చని ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కాలేయంలో కాకుండా...

"ఆల్కహాల్ సాధారణంగా కాలేయంలో బ్రేక్‌డౌన్ అవుతుంది. కానీ, మా జెల్ ఆ ప్రక్రియను కాలేయం నుంచి జీర్ణవాహికకు మారుస్తుంది" అని ఈ పరిశోధనలో పాలుపంచుకున్న డాక్టర్ రఫెల్ మెజెంగా వివరించారు. అసలు మద్యపానం చేయకుండా ఉండడమే ఉత్తమమమైన పని అని.. ఇప్పటికే ఆ వ్యసనానికి బానిసలై, మానలేనివారికి తమ జెల్ ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే.. తాగిన మద్యం పేగుల్లో ఉండేదాకా మాత్రమే తమ జెల్ పనిచేస్తుందని, ఒక్కసారి ఆ ఆల్కహాల్ రక్తంలోకి ప్రవేశిస్తే మాత్రం దాని ప్రభావాన్ని జెల్ ఏ మాత్రం రివర్స్ చేయలేదని డాక్టర్ రఫెల్ స్పష్టం చేశారు. అంటే.. మద్యం మత్తు ఆవరించాక జెల్ తీసుకుంటే మత్తు పోదు. కాకపోతే, అవయవాలు డ్యామేజ్ కాకుండా కాపాడుతుంది. మద్యం తాగక ముందే ఈ జెల్‌ను నోటి ద్వారా మాత్ర రూపంలో తీసుకుంటే ఎక్కువ ఉపయోగం ఉంటుందని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

చివరాఖరు.. ఈ జెల్ తీసుకుంటే రక్తంలో మద్యం స్థాయులు తగ్గుతాయంటే.. భవిష్యత్తులో మందుబాబులు డ్రంకెన్‌డ్రైవ్‌ల్లో పట్టుబడకుండా ఉండడానికి వీటిని విచ్చలవిడిగా వాడేయరూ?

ఒడిసా సీఎంగా మాఝీ ప్రమాణం

భువనేశ్వర్, జూన్ 12: ఒడిసాలో తొలిసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ పార్టీ నేత, గిరిజన నాయకుడు మోహన్ చరణ్ మాఝీ ఒడిసా ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సమక్షంలో ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. కేవీ సింగ్ డియో, ప్రవతీ పరిడా ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో గవర్నర్ రఘుబర్ దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా హాజరయ్యారు. కాగా, భక్తుల సౌకర్యార్థం పూరీ జగన్నాథ స్వామి ఆలయంలోని నాలుగు ద్వారాలను గురువారం ఉదయం నుంచి తెరుస్తామని సీఎం మాఝీ బుధవారం ప్రకటించారు. ఇన్నాళ్లూ జగన్నాథ స్వామి ఆలయంలోకి భక్తులను కేవలం ప్రధాన ద్వారం నుంచే అనుమతిస్తున్నారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పెమా ఖండూ వరుసగా మూడో సారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఖండూను ఎన్నుకున్నట్టు ఆ పార్టీ వర్గాలు ప్రకటించాయి.

అడ్డగోలుగా చెల్లింపులు

- ఎన్నికల ఫలితాలు వచ్చాక కూడా కోట్లలో బిల్లులు
- జగన్ కేసులు వాదించిన లాయర్లకు ఫీజులు
- అమరావతికి వ్యతిరేకంగా వాదించిన లాయర్లకూ
- ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణ స్వామిభక్తి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక, టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరే ముందు కూడా జగన్ భక్త అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. గడచిన ఐదేళ్లూ ఆర్థిక వ్యవస్థను కుళ్లబొడిచిన ఆ శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ... జగన్ అస్మదీయులకు బిల్లులు విడుదల చేశారు. జగన్ కేసులు, అమరావతికి వ్యతిరేకంగా ప్రభుత్వం తరఫున వాదించిన లాయర్లకు ఫీజుల రూపంలో కోట్ల రూపాయలు చెల్లించారు. న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, నిరంజన్ రెడ్డి, రంజిత్ కుమార్, ఎంఏ నజ్కీ... జగన్ సొంత కేసులతో పాటు అమరావతికి వ్యతిరేకంగా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో వాదనలు వినిపించారు. వీరికి ఇటీవల రూ.కోటి 69 లక్షలు చెల్లించారు. 6వ తేదీన అడ్వొకేట్లు ఎంఏ నజ్కీ, భాస్కర్ రెడ్డికి భారీగా చెల్లింపులు చేశారు. వీరితో పాటు మరో 10 మంది న్యాయవాదులకు సత్యనారాయణ బిల్లులు చెల్లించారు. 11వ తేదీన కూడా కొందరు న్యాయవాదులకు కోట్ల రూపాయల బిల్లుల చెల్లింపులు జరిగాయి. అలాగే 11వ తేదీన వివాదాస్పద ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డికి ఫీజుల కింద బిల్లులు చెల్లించేశారు. తమకు పెండింగ్ బిల్లులు చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ 4 లక్షలకు పైగా పిటిషన్లు హైకోర్టులో గత నాలుగేళ్లలో దాఖలయ్యాయి. ఇందులో చాలా కేసుల్లో అధికారులు కోర్టుకు హాజరై సంజాయిషీ చెప్పుకొన్నారు. కోర్టు ఆదేశించినా బిల్లులు చెల్లించకుండా కంటెంప్ట్ ఎదుర్కొన్నారు. కేవలం వైసీపీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం కోసం జగన్ భక్త అధికారులు కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించారు. ఇప్పుడు ప్రభుత్వం మారినప్పటికీ సాధారణ కాంట్రాక్టర్లను పక్కన పెట్టి, జగన్ అస్మదీయులకు సత్యనారాయణ పెద్దపీట వేయడం దారుణం.

రేపటితో డిప్యుటేషన్ పూర్తి

జగన్ వీరభక్త అధికారి, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ డిప్యుటేషన్ ఈ నెల 14వ తేదీతో ముగియనుంది. గతంలో ఒకసారి ఎక్స్‌టెన్షన్ తెచ్చుకున్న సత్యనారాయణ ఈసారి తనను రిలీవ్ చేయాల్సిందిగా పోలింగ్ జరిగిన తర్వాత అప్పటి సీఎస్ జవహర్ రెడ్డిని కోరారు. అయితే.. 'మళ్లీ వైసీపీనే అధికారంలోకి వస్తుంది. భయమెందుకు మనోళ్లకు బిల్లులు ఇవ్వండి' అని జగన్ హయాంలోని సీఎంవో అధికారులు ఆయనకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక సత్యనారాయణ దాదాపు రూ.22,000 కోట్ల బిల్లులను జగన్ అస్మదీయులకు చెల్లించారు. పోలింగ్ ముగిశాక కూడా అదే పంథా కొనసాగించారు. పేదల పథకాలకు నిధుల విడుదల ముసుగులో వైసీపీ కాంట్రాక్టర్లకు వేలకోట్లు చెల్లించారు. రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీయడానికి, రాష్ట్ర సచివాలయంతో సహా ప్రభుత్వ ఆస్తులన్నీ తాకట్టులో వెళ్లిపోవడానికి, ప్రభుత్వ శాఖలు నిధుల లేమితో అల్లాడడానికి, విపరీతమైన అప్పుల భారంతో కార్పొరేషన్లు కుంగిపోవడానికి ముఖ్యకారణం ఈ అధికారే.

నేడు పాఠశాలల పునఃప్రారంభం

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. అడ్మిషన్లు కూడా నేటి నుంచే స్వీకరిస్తారు. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు తరగతి గదులు, ప్రాంగణాలను శుభ్రం చేయించారు. నేటి నుంచే స్టూడెంట్ కిట్ల పంపిణీ ప్రారంభమవుతుంది. కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, బెల్టు, యూనిఫాం క్లాత్, డిక్షనరీలు అందిస్తారు. పాఠ్యపుస్తకాలు దాదాపుగా మండల స్టాక్ పాయింట్లకు చేరినా, మిగిలిన వస్తువుల సరఫరాలో జాప్యం ఏర్పడింది. టెండర్లు పిలవకుండా నేరుగా కాంట్రాక్టర్లను ఎంపిక చేయడం వల్ల ఈ ఇబ్బంది తలెత్తింది.

గుంటూరులో బోరుగడ్డ అనిల్ కార్యాలయం దగ్ధం

- నిప్పుపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- గడిచిన ఐదేళ్లలో విపక్ష నేతలపై బూతులతో విరుచుకుపడిన అనిల్
- కౌంటింగ్ తర్వాతా ఆగని హెచ్చరికలు


గుంటూరు నగరంలో దగ్ధమవుతున్న బోరుగడ్డ అనిల్‌కుమార్ కార్యాలయం

గుంటూరు, జూన్ 12: గుంటూరు నగరంలో వల్లూరి వారి తోట ఆరో లైనులోని వైసీపీ కార్యకర్త బోరుగడ్డ అనిల్ కుమార్ కార్యాలయానికి బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. క్షణాల వ్యవధిలో మంటలు ఎగసిపడి కార్యాలయం పూర్తిగా దగ్ధమైంది. గతంలో కూడా ఒకసారి ఇదే కార్యాలయాన్ని తగలబెట్టారు. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అప్పటి నుంచి కార్యాలయంలో ఎటువంటి విలువైన సామగ్రి ఉంచడం లేదు. ప్రస్తుతం కార్యాలయాన్ని ఆధునీకరిస్తుండటంతో సామగ్రి బయటపెట్టారు. కొంత ఫర్నీచర్ లోపలే ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు ఫర్నిచర్‌కు పెట్రోల్ పోసి నిప్పంటించారు. గడచిన ఐదేళ్లలో అనిల్ టీడీపీ, జనసేన నేతలపై తీవ్ర అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. జగన్ కనుసైగ చేస్తే అరగంటలో చంద్రబాబును లేపేస్తానంటూ ఓ యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో అనిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ బెడ్రూంలో కూర్చుంటానంటూ ఆయన కుమార్తె, భార్యను ఉద్దేశించి నీచంగా మాట్లాడారు. లోకేశ్‌తో పాటు టీడీపీ, జనసేన ముఖ్య నాయకులను అసభ్యంగా దూషించడం ఆయనకు అలవాటుగా మారింది. గతంలో వైసీపీ రెబల్ ఎమ్మెల్యేగా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని నెల్లూరులో బండికి కట్టుకొని ఈడ్చుకు వస్తానంటూ బెదిరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, జగన్‌ను విమర్శించినా అనిల్ సోషల్ మీడియా ద్వారా బూతులు తిడుతూ వీడియోలు విడుదల చేసేవారు. కాగా, అనిల్ కార్యాలయానికి నిప్పుపెట్టిన సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని, మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

నాసా కాన్ఫరెన్స్‌లో శ్రీ చైతన్య విద్యార్థులకు బహుమతులు



హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అమెరికా నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) సంస్థ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఐఎస్‌డీసీ కాన్ఫరెన్స్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు అదరగొట్టారని శ్రీ చైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ చెప్పారు. ప్రపంచస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో శ్రీ చైతన్య పాఠశాలల నుంచి 167 మంది విద్యార్థులు ఎంపికై పాల్గొన్నారని ఆమె తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌కు సుమారు 30 దేశాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారని, ఏ ఇతర దేశ విద్యాసంస్థ నుంచి ఇంత ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు కాన్ఫరెన్స్‌కు హాజరుకాలేదని చెప్పారు. భారతదేశం నుంచి 28 వేల మంది విద్యార్థులు పాల్గొనగా, ఇందులో తమ సంస్థకు చెందిన విద్యార్థులే 62 విన్నింగ్ ప్రాజెక్టులను గెలుచుకున్నట్టు సీమ తెలిపారు.

నేడు పిడుగులతో వానలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు బుధవారం తెలంగాణ మొత్తం, ఛత్తీస్‌గఢ్‌లో పలు ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న మూడు రోజుల్లో ఉత్తరాంధ్రలో మిగిలిన ప్రాంతాలకు విస్తరించనున్నాయి. ఉత్తరాంధ్ర మీదుగా తూర్పు, పడమర మధ్య ద్రోణి సముద్ర మట్టానికి 3.1 కి.మీ నుంచి 5.8 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. దీని ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల బుధవారం వర్షాలు కురిశాయి. కోస్తాలోని మిగిలినచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. మచిలీపట్నంలో 37.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున గురువారం మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా, రానున్న రెండు రోజులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. గురువారం విజయనగరం, మన్యం, అల్లూరి, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని పేర్కొంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉగ్రపంజా!

జమ్మూకశ్మీర్‌లో శాంతిస్థాపన జరిగిందని, ఉగ్రవాదాన్ని తరిమికొట్టి ప్రజలకు భద్రతను ప్రసాదించామని నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన ప్రచారమంతా ఉత్తదేనని కాంగ్రెస్ బుధవారం విమర్శించింది. మూడు రోజుల్లో మూడు ఉగ్రవాద ఘటనలు జరిగినా ప్రధాని మాట్లాడటం లేదు ఎందుకని ఆ పార్టీ ప్రశ్నిస్తోంది. రీయాసీ, కథువా, దోడాల్లో జరిగిన ఉగ్రదాడులు పరిస్థితిలో ఏ మార్పూ రాలేదనడానికి నిదర్శనమని, రెండేళ్ళుగా రజౌరీ, పూంఛ్‌లు సరిహద్దు ఉగ్రవాదానికి స్థావరాలుగా మారి, నలభై మంది సైనికులు బలైనారని, ఇప్పుడు పొరుగున ఉన్న రియాసీ జిల్లాలోకి కూడా ఉగ్రవాదం విస్తరించి ఏకంగా యాత్రికులమీదనే దాడి జరిగిందని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. పదేళ్ళుగా మోదీ చెబుతున్నదంతా అసత్యమేనని కాంగ్రెస్ చేస్తున్న ఈ రాజకీయ విమర్శలను అటుంచితే, ఆదివారం నాటి రియాసీ ఘటన భద్రతాదళాలకు ఒక తీవ్రమైన హెచ్చరిక.

వైష్ణోదేవి బస్సు యాత్రికులమీద ఉగ్రవాదులు అత్యంత అధునాతనమైన తుపాకులతో కాల్పులు జరిపి డ్రైవర్‌ను చంపివేయడంతో, బస్సు అదుపుతప్పి లోయలో పడి 10మంది మరణించారు, ముప్పైమంది గాయపడ్డారు. స్థానిక ఉగ్రవాదులు కాదు, సరిహద్దుదాటివచ్చినవారు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని నిఘావర్గాలు అన్నాయి. స్థానిక ఉగ్రవాదులు యాత్రికులను లక్ష్యంగా చేసుకొని ఇటువంటి దారుణాలకు పాల్పడటం అత్యంత అరుదు. పర్యాటకాన్ని, తీర్థయాత్రలను దెబ్బతీసే ఇటువంటి ఘాతుకాలకు పాల్పడిన పక్షంలో, ఉపాధి దెబ్బతిని ప్రజలు తిరగబడతారని ఇక్కడి మిలిటెంట్లకు తెలుసు. కానీ, పొరుగుదేశంనుంచి చొరబడినవారికి ఇవేమీ పట్టవు. పాలకులకు సవాలు విసరడం, ప్రజలను భయోత్పాతంలో ముంచడం, శాంతిని భగ్నం చేసి తమ ఉనికిని చాటుకోవడం వారి లక్ష్యాలు. కనీసం ఎనభైమంది విదేశీ ఉగ్రవాదులు ఇక్కడ కార్యకలపాలు నిర్వహిస్తున్నారన్న అంచనాలు నిజమైనపక్షంలో, భద్రతాదళాలకు అది అత్యంత తీవ్రమైన సవాల్. ఆధునిక ఆయుధాలతో ఈ ఉగ్రవాదులు సృష్టించగలిగే విధ్వంసం ఊహకు అందనిది.

జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తరువాత ఉగ్రవాద ఘటనలు అరవై శాతానికి పైగా తగ్గిపోయాయంటూ మొన్న జనవరిలో హోంమంత్రి అమిత్ షా లెక్క విప్పిచెప్పారు. రాళ్ళురువ్వడం నుంచి కాల్పులవరకూ వివిధ అంశాల్లో వచ్చిన మార్పును హోంశాఖ కూడా వివరించింది. టెర్రరిజం తగ్గి టూరిజం పెరిగినందుకు ప్రధానమంత్రి తన ఎన్నికల సభలో సంతోషం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి మాట్లాడినప్పుడల్లా బీజేపీ అధినాయకులకు నెహ్రూ చేసిన తప్పిదాలు గుర్తొస్తూనే ఉంటాయి. దశాబ్దాల పాపాలను ప్రక్షాళించి ఆ రాష్ట్రాన్ని ఉద్ధరించామనీ, ప్రత్యేకప్రతిపత్తి రద్దు ద్వారా దారికి తెచ్చామని మొన్నటి ఎన్నికల వేళ వారు చాలా చెప్పుకున్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో ఈ కేంద్రపాలిత ప్రాంతం చూపిన ఉత్సాహం కూడా కొత్త ఆశలు కలిగించింది. అంతాబాగున్నదని అనుకుంటున్న తరుణంలో, రియాసీ దారుణం కొత్త ఆందోళనలకు వీలుకల్పిస్తున్నది. అధీనరేఖకు కాస్తంత దూరంగా ఉండే ఈ ప్రాంతంలో, రజౌరీ, పూంఛ్‌లతో పోల్చితే ఉగ్రవాదదాడులు తక్కువే. ఇక్కడే ఇంతటి భీకరమైన దాడి జరగడం విచిత్రం.

మోదీ ఏలుబడిలో, జమ్మూకశ్మీర్‌లో ఇప్పటివరకూ 2,262ఉగ్రదాడులు జరిగాయని, 363మంది పౌరులు, 596మంది సైనికులు మరణించారని కాంగ్రెస్ అంటోంది. 19 భారీ ఉగ్రదాడుల్లో జరిగిన నష్టాన్నీ గుర్తుచేస్తోంది. మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంలో రియాసీ ఘటన జరగడం వెనుక ఐఎస్ఐ పాత్ర లేదని అనుకోలేం. జమ్మూకశ్మీర్‌లో తాను అనుకున్నది చేసుకుపోగలిగే అవకాశం భారత ప్రభుత్వానికి లేకుండా చేయడం ఈ దాడి ఉద్దేశం. లష్కరే తోయిబా ప్రకటన ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నది. గతకాలపు వాతావరణాన్ని తాము మళ్ళీ పునరుద్ధరించామని, ఇది ఆరంభం మాత్రమేనని ఆ ప్రకటన అంటున్నది. పాకిస్థాన్ సైన్యం, ఐఎస్ఐ తమకు తాముగా వ్యవహరిస్తున్నాయో, షరీఫ్ సోదరులకు చెప్పిచేస్తున్నాయో కానీ, రియాసీ వంటి ఘటనలు ఇకపై జరగకుండా ఉండాలంటే భారతదేశం భద్రతకు సంబంధించి వ్యూహాలు మార్చుకోవాలి, కొత్త జాగ్రత్తలు తీసుకోవాలి. వీటితోపాటు, సాధ్యమైనంత వేగంగా అసెంబ్లీ ఎన్నికలు జరిగి, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఏర్పడితే ఉగ్రవాదానికి తోడ్పాటును అందించే పరిస్థితులను నిరోధించడం వీలవుతుంది.

కాంగ్రెస్ విజయాలు, వైఫల్యాలు

భారత జాతీయ కాంగ్రెస్ అధికారానికి రాలేదు గానీ దాని ప్రస్థానం ఒక మేలు మలుపు తిరిగింది. 18వ సార్వత్రిక ఎన్నికలలో అంతిమంగా దానికి లభించిన మొత్తం సీట్లు 99 మాత్రమే. ప్రత్యర్థి పక్షం భారతీయ జనతా పార్టీకి లభించిన 240 సీట్లతో పోలిస్తే కాంగ్రెస్ సంఖ్యా బలం గొప్పదేమీ కాదు. అవును, జాతీయ ఎన్నికలలో కాంగ్రెస్‌కు అతి తక్కువ సీట్లు (100 లోపు) లభించడం ఇది మూడోసారి. 2014, 2019 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ వరుసగా 44, 52 సీట్లు మాత్రమే సాధించింది. ఘోరమైన విషయమేమిటంటే గత లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ సాధించిన 52 సీట్లలో 32 కేవలం మూడు రాష్ట్రాల – కేరళ, పంజాబ్, తమిళనాడు– నుంచి మాత్రమే లభించాయి. గమనార్హమైన విషయమేమిటంటే ఈ మూడు రాష్ట్రాలలోను బీజేపీ కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా లేదు. తమిళనాడులో అయితే డీఎంకేకు జూనియర్ భాగస్వామిగా కాంగ్రెస్ పోటీ చేసింది.



▪ యోగేంద్ర యాదవ్



ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో 400కు పైగా సీట్లు సాధించాలనే లక్ష్యాన్ని బీజేపీ నిర్దేశించుకున్నది. దేశ వ్యాప్తంగా బలమైన ఉనికితో తనకు దీటైన జాతీయ ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్‌ను పూర్తిగా కుదేలుపరచడమే బీజేపీ ధ్యేయం. బీజేపీ ప్రచారానికి తగ్గట్టుగానే ఒక దశలో ఈ సారి కాంగ్రెస్‌కు దక్కే సీట్లు సంఖ్య 40 కంటే తక్కువగా ఉండవచ్చని, ఎన్నికల అనంతరం ఆ జాతీయ పార్టీ దక్షిణ భారతీయ జాతీయ కాంగ్రెస్‌గా మిగిలిపోవచ్చనే అభిప్రాయం బాగా వ్యక్తమయింది. అయితే కాంగ్రెస్ ప్రతికూల పరిస్థితులు అన్నిటినీ అధిగమించి తన సీట్ల సంఖ్యను ఇంచుమించు రెట్టింపు చేసుకున్నది. అంతిమంగా, పునరుత్థానమవుతున్న పార్టీగా వెలుగొందింది. ఏమైనా 2024 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్‌ది ఆశ్చర్యకరమైన విజయగాథ. ఎల్లెడలా విజయాలు సాధించింది. హర్యానా నుంచి బిహార్ దాకా హిందీ రాష్ట్రాలలో ఆ పార్టీ సంఖ్యా బలం 5 నుంచి 23కి పెరిగింది. మహారాష్ట్రలో పోటీ చేసిన సీట్లను దాదాపుగా గెలుచుకున్నది– అన్ని నియోజకవర్గాలలోను భారీ మెజారిటీ సాధించింది. పంజాబ్‌లో బీజేపీకి ఒక్క సీటును కూడా దక్కనివ్వకపోవడంలో కాంగ్రెస్ సఫలమయింది. జాతుల ఘర్షణతో అతలాకుతలమైన మణిపూర్‌లోని రెండు సమస్యాత్మక నియోజకవర్గాలనూ కైవసం చేసుకున్నది. నాగాలాండ్‌లోను, మేఘాలయ గారోహిల్స్‌లోను పోటీ చేయడం ద్వారా ఈశాన్య భారత రాష్ట్రాలలో తన ఉనికిని మళ్లీ సుస్థిరపరచుకున్నది. ప్రత్యర్థి పార్టీలకు గట్టి పోటీనిచ్చి తన సత్తాను చాటుకున్నది. సీట్ల సంఖ్యను పెంచుకోవడంతో పాటు ఓట్ల వాటాను సైతం కాంగ్రెస్ పెంపొందించుకున్నది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఓట్ల వాటా 1.7 శాతం మేరకు పెరిగింది. ఇది అద్భుతమైన విజయం కాకపోవచ్చు గానీ ఆరోగ్యకరమైన పెరుగుదల అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

భారత్ జోడో యాత్రతో ప్రారంభమైన కాంగ్రెస్ నవ ప్రస్థానం ఆ పార్టీ పట్ల బలంగా ఉన్న మిథ్యా భావనలు లేదా తప్పుడు అభిప్రాయాలను పటాపంచలు చేసింది. వాటిని వివరంగా చూద్దాం. (1) ఒక రాష్ట్రంలో మూడో స్థానానికి నెట్టివేయబడిన తరువాత కాంగ్రెస్ ఎట్టి పరిస్థితులలోనూ అక్కడ పుంజుకోలేదన్నది మొదటి తప్పుడు అభిప్రాయం. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన విజయంతో అది పూర్తిగా తొలగిపోయింది. 2019 సార్వత్రిక ఎన్నికలలో తెలంగాణలో కాంగ్రెస్ సీట్ల సంఖ్యలో మూడో స్థానానికి పడిపోయింది. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన విజయాలను ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో నిలుపుకున్నది. (2) లోక్‌సభ ఎన్నికలలో ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాలలో బీజేపీతో ముఖాముఖీ పోటీలో కాంగ్రెస్ నిలవలేదన్న తప్పుడు అభిప్రాయం ఒకటి ప్రబలంగా ఉన్నది. గత సార్వత్రిక ఎన్నికలలో 190 నియోజకవర్గాలలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉన్నది. అప్పుడు వాటిలో కేవలం 15 సీట్లను మాత్రమే కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో ప్రధాన జాతీయ పార్టీలు రెండూ 215 నియోజకవర్గాల్లో ముఖాముఖీ తలపడ్డాయి. అయితే కాంగ్రెస్ ఈ సారి వాటిలో 62 నియోజకవర్గాలను కైవసం చేసుకున్నది. బీజేపీ గెలిచిన సీట్లలో ఆ పార్టీకి మెజారిటీని గణనీయంగా తగ్గించడంలో కూడా కాంగ్రెస్ సఫలమయింది. (3) ఒక ప్రాంతీయ రాజకీయ పక్షం లేదా ఒక కుల లేదా మత ఆధార రాజకీయ శక్తికి కోల్పోయిన స్థానాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ పునః సాధించుకోలేదు. ఇది కూడా ఒక తప్పుడు అభిప్రాయమే గత రెండు దశాబ్దాలుగా అస్సాంలో తనకు పలు విధాల నష్టం కలిగిస్తూ అన్ని విధాల ప్రయోజనం పొందుతున్న బద్రుద్దీన్ అజ్మల్ నాయకత్వంలోని ఎఐయుడిఎఫ్‌ను ఈ సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పూర్తిగా ఓడించింది. అలాగే హర్యానాలో జేజేపీపై కూడా విజయం సాధించింది. (4) ఆపరేషన్ కమల్‌ను కాంగ్రెస్ తట్టుకోలేదన్నది కూడా పూర్తిగా మిథ్యా భావనే. హిమాచల్‌ప్రదేశ్ ఓటర్లు ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ వైపు మొగ్గారు. అయితే లోక్‌సభతో పాటు శాసనసభ ఉప ఎన్నికలలో బీజేపీకి ఫిరాయించిన శాసన సభ్యులు అందరినీ తిరస్కరించారు.



18వ లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్‌ది ఆశ్చర్యకరమైన విజయగాథ. బీజేపీకి లభించిన 240 సీట్లతో పోలిస్తే కాంగ్రెస్ సంఖ్యా బలం గొప్పదేమీ కాదు. సార్వత్రిక ఎన్నికలనే అన్‌లిమిటెడ్ ఓవర్స్ టెస్ట్ మ్యాచ్‌లో సంపూర్ణ విజయం సాధించేందుకు కాంగ్రెస్ ఇంకా ఎంతో కష్టపడవలసి ఉన్నది. ఉగ్ర వేసవి రోజున, పాడైన పిచ్‌పై, బాడీ లైన్ బౌలర్స్, నిష్పాక్షికంగా వ్యవహరించని అంపైర్లు, ప్రతికూల వ్యాఖ్యాతలను తట్టుకుని 99 పరుగులు తీయడం అల్ప విజయమా?

(5) కాంగ్రెస్ తన మిత్రపక్షాలకు పెద్ద భారమవుతుంది అన్నది మరొక తప్పుడు అభిప్రాయం. ఇది ఒకప్పుడు నిజం కావచ్చు గానీ, ఇటీవలి ఎన్నికలలో అది తప్పు అని రుజువయింది. కేవలం తమిళనాడు, మహారాష్ట్రలో మాత్రమే కాదు యూపీ, బిహార్, ఢిల్లీ, జమ్ము కశ్మీర్‌లో కూడా కాంగ్రెస్, ఇండియా కూటమిలోని తన భాగస్వామ్య పక్షాల విజయానికి విశేషంగా తోడ్పడింది. (6) ఉత్తరప్రదేశ్‌లో గత అసెంబ్లీ ఎన్నికలలో ఘోర పరాజయం అనంతరం ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. రాష్ట్ర ఎన్నికలలో కేవలం 2 శాతం ఓట్లను మాత్రమే పొందిన కాంగ్రెస్ ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో గణనీయమైన సంఖ్యలో సీట్లు, ఓట్లు సాధించుకోవడం అద్భుత విజయమేనని నిస్సంకోచంగా చెప్పవచ్చు. (7) ప్రజా ఉద్యమాలతో మమేకం కాదన్నది కాంగ్రెస్‌పై ఉన్న మరొక తప్పుడు అభిప్రాయం. దశాబ్దాల పాటు అధికార పార్టీ లేదా ఆధిపత్య రాజకీయ శక్తిగా ఉన్న కాంగ్రెస్ ఎట్టకేలకు పాలక పక్షాల, ఆధిపత్య శక్తుల వ్యతిరేక రాజకీయాలతో తనను తాను సంధానం చేసుకోవడాన్ని నేర్చుకున్నది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, పశ్చిమ యూపీలో రైతుల ఆందోళనలు, ముస్లిం పౌరులు నిర్వహించిన పౌరసత్వ చట్టాల వ్యతిరేక ఉద్యమాలకు మద్దతునివ్వం ద్వారా కాంగ్రెస్ బాగా లబ్ధి పొందింది.

భారత జాతీయ కాంగ్రెస్ మళ్లీ ప్రజల ఆదరణను, మద్దతును పొందుతున్నది. అయితే ఇది ఆరంభం మాత్రమే. ఈ శుభ పరిణామం పట్ల సంతృప్తి చెంది, నిష్క్రియాత్మకంగా ఉండడం ఎట్టి పరిస్థితులలోను తగదు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ చెప్పుకోదగిన విజయాలు సాధించినప్పటికీ వైఫల్యాలూ అనేకమున్నాయి. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పరాజిత బీఆర్ఎస్‌కు వెన్నుదన్నుగా ఉన్న సామాజికవర్గాలను ఆకట్టుకోవడంలో విఫలమయింది. ఒడిషాలో బిజూ జనతాదళ్–బీజేపీ జుగల్ బందీకి ప్రత్యామ్నాయమయేందుకు లభించిన సువర్ణావకాశాన్ని కాంగ్రెస్ చేజార్చుకున్నది. కర్ణాటకలో తమ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చినప్పటికీ అందుకు తగ్గట్టుగా ప్రజల మద్దతును సాధించుకోవడంలో విఫలమయింది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్‌లలో కాంగ్రెస్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. బెంగాల్‌లో కాంగ్రెస్ అనుసరించిన వ్యూహంతో ప్రజల నుంచి రాజకీయ సుహృద్భావాన్ని పోగొట్టుకున్నది; సంభావ్య రాజకీయ భాగస్వామిని దూరం చేసుకున్నది. ఫలితంగా బీజేపీకి ఆరు సీట్లను పోగొట్టుకున్నది. ఇక ఢిల్లీలో ఇప్పటికీ కోలుకోలేకపోతోంది. సార్వత్రిక ఎన్నికలనే అన్‌లిమిటెడ్ ఓవర్స్ టెస్ట్ మ్యాచ్‌లో సంపూర్ణ విజయం సాధించేందుకు కాంగ్రెస్ ఇంకా ఎంతో కష్టపడవలసి ఉన్నది. ఉగ్ర వేసవి రోజున, పాడైన పిచ్‌పై, బాడీ లైన్ బౌలర్స్, నిష్పాక్షికంగా వ్యవహరించని అంపైర్లు, ప్రతికూల వ్యాఖ్యాతలను తట్టుకుని 99 పరుగులు తీయడం ఒక అల్ప విజయం ఎంత మాత్రం కాదు సుమా!

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఐదు వ్యాసాల పరంపరలో ఇది మూడవది)

ఓటమిని దాచి నటన చేయగలమా?

పొంగిపోము, కుంగిపోము అని రాజకీయ నాయకులు చెబుతుంటారు కానీ, అంత స్థితప్రజ్ఞులు ఇప్పుడు ఎవరున్నారు? పైకి ఎలా కనిపించినా లోలోపల వాళ్ల మనస్సులు గాల్లో తేలిపోవడమో, పాతాళానికి జారిపోవడమో చేస్తుంటాయి. బుద్ధినే కాదు, మనఃస్థితిని కూడా ప్రదర్శించేది ముఖమే. జయాపజయాల సందర్భాలలో ఎంత దాచుకున్నా, సంతోష విచారాలు ముఖాల్లో తొంగిచూస్తాయి. ప్రజాజీవితం ఒక ప్రదర్శనగా కూడా మారిపోయింది కాబట్టి, గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకోవడం, ముఖకవళికలను, ఆంగిక భాషను నియంత్రించడం కొందరికి నైపుణ్యంగా మారిపోయింది. కానీ, వారికి కూడా వశపడని సందర్భాలు కొన్ని ఉంటాయి.



ఈ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మనకు పరిచితమైన రాజకీయ వ్యాకరణానికి లొంగేవి కావు. అంతా అధివాస్తవికత, మొత్తంగా విరోధాభాస. కొంచెం నీరు. కొంచెం నిప్పు. వారి విజయం విజయంలాగా లేదు. వీరి ఓటమి ఓటమిలాగానూ లేదు. గెలిచినవాడు కోల్పోయినట్టు విచారపడుతున్నాడు. ఓడినవాడు విజేతలాగా సంబరపడుతున్నాడు. సన్నివేశానికి అభినయానికీ మైత్రి కుదరడం లేదు. పోనీ, కొయ్యముఖం పెట్టి తప్పించుకుందామా అంటే, ముఖనటన కుదరని సంక్లిష్ట మనోభావం.

ఈ ఎన్నికల ఫలితాలు భారతీయ జనతాపార్టీకి ఏమంత సంతోషాన్ని ఇచ్చి ఉండవు. మెజారిటీని మించి మరింత, మరింత బలాన్ని ఇవ్వమని ఓటర్లను అభ్యర్థిస్తే, వారు మెజారిటీకి ముప్పై రెండు దిగువన నిలబెట్టారు. కూటమిగా తమకు అధికారం ఖాయమే అయినా, ఈ విజయంలో తగినంత అపజయం కూడా ఉన్నది. తేజస్సు జారిపోయి, పరాధీనపు అధికారం దక్కింది కదా అని బాధపడుతున్నది. ఇక కాంగ్రెస్‌తో సహా అనేక పార్టీల ఇండియా కూటమికి బీజేపీకి సొంతంగా వచ్చినన్ని సీట్లు కూడా రాలేదు. కానీ, బీజేపీని చావుదెబ్బ తీశామన్నట్టు అది ఆనందిస్తున్నది. ప్రియాంక గానీ పోటీచేసి ఉంటేనా, మోదీ కూడా చిత్తుగా ఓడేవాడు కదా అని పశ్చాత్తాపపడేంతగా కాంగ్రెస్‌లో విజయోత్సాహం కనిపిస్తున్నది. ఫలితాల అంతర్యం బీజేపీని తగ్గించడమే కావచ్చును కానీ చిత్తుగా ఓడించడం కాదు, ఇండియా కూటమిని పెంచడమే కావచ్చును కానీ, పూర్తిగా గెలిపించడం కాదు. ఫలితాల సాంకేతిక సత్యంతో పొంతనలేని ముఖచిత్రాలను ఈ రెండు పార్టీల శ్రేణులలో చూడవచ్చు.

నరేంద్రమోదీ ముఖం గంభీరంగా ఉంటుంది. చూపు పదునుగా ఉంటుంది. ఎప్పుడైనా నవ్వినా అది ఆత్మీయంగా కాక, యథాలాపంగా ఉంటుంది. అత్యధిక జనాదరణ కలిగిన ఒక నాయకుడు, కఠినమైన వ్యవహారసరళి, కఠోరమైన రాజకీయ సంకల్పాలు కలిగి ఉంటే ఎట్లా ఉంటారో దానికి తగ్గట్టు ఆయన ముఖకవళికలు గత పదేళ్లుగా మనకు అలవాటు అయ్యాయి. ఒక రకమైన దర్పంతో ఆయన యాభైయ్యారు అంగుళాల ఛాతీ ఉప్పొంగి కనిపించేది. ఫలితాలు వచ్చాక ఆయన ఎట్లా ఉన్నారు? ఫలితాలు రాకముందు, తొలిరౌండ్లలో వారణాసి కౌంటింగ్‌లో వెనుకబడినప్పుడు ఆయన ముఖం ఎట్లా ఉండి ఉంటుంది? కెమెరా ఎదుట లేనప్పుడు ఆయన మనోభావాలే ఆయన ముఖంలో పలికి ఉంటాయి. జూన్ నాలుగోతేదీ సాయంత్రం బీజేపీ కేంద్ర కార్యాలయానికి వచ్చినప్పుడు, ఆయన పార్టీ నాయకుడిగా, ఫలితాలపై శ్రేణులకు సంతృప్తినో, ఓదార్పునో అందించవలసిన కర్తవ్యంలో ఉన్నారు. ప్రత్యక్ష ప్రసారంలో ఆయనను చూసినవారంతా ఆయన కవళికలను శ్రద్ధగా గమనించారు. తప్పనిసరిగా ఆయన తనను తాను కూడగట్టుకున్నారు. నవ్వుతున్నారు కానీ, అది యథాలాపంగా నిర్లిప్తంగా లేక, ఏదో అప్రియ భావాన్ని ప్రకటిస్తోంది.

రాజకీయ ఆరోపణల సంగతి పక్కనబెడితే, కనీసం నాలుగైదు సీట్లను కాంగ్రెస్ నష్టపోయిన మాట వాస్తవం. రేవంత్ రెడ్డి రూపొందించిన నినాదాలు దేశమంతా కాంగ్రెస్‌కు పనికివచ్చాయి. మరి తెలంగాణలో ఎందుకు ప్రభావం వేయలేకపోయాయి? దేశమంతా తమకు దొరికిన విజయాలకు రాహుల్ గాంధీ ఎంతో ఆనందంగా ఉన్నారు. కానీ, ఆయనకు తెలంగాణలో చెలామణీ లేకపోయిందా? బీజేపీ పని అయిపోయిందని ప్రకటనలు చేస్తున్నప్పుడు, తాము అధికారంలో ఉన్న ఒక రాష్ట్రంలో బీజేపీ తన భవిష్యత్ విజయానికి విత్తనం వేసిందని రాహుల్‌గాంధీ గ్రహించారా?

తమకు దక్కింది ఆశించిన విజయమో కాదో ఆయన చెప్పలేదు. ఎన్నికల ప్రచారమంతటా ఆయన తన పేరును మాత్రమే జపించారు. ఆ నాటి సందేశం తరువాత ఇక ఆయన ఎన్డీయే ప్రతినిధిగా మారిపోయారు. రెండో ప్రభుత్వానికి కొనసాగింపే మూడో ప్రభుత్వం అన్నారు. గెలుపోటములు వస్తుంటాయి పోతుంటాయి అన్నారు కానీ, ఆ వ్యాఖ్యను ప్రస్తుత సందర్భంతో అన్వయించలేదు. అప్పటి నుంచి ఆయన చాలా కలివిడిగా కనిపించాలని చూస్తున్నారు. ఆలింగనాలు కరచాలనాలు పెంచారు. హాయిగా నవ్వాలని ప్రయత్నిస్తున్నారు. ఛాతీని కాక హృదయాన్ని ముందుకు తోస్తున్నారు. నిజానికి చాలా కష్టమైన ప్రక్రియ ఇది. నలుగురిని కలుపుకుని పోవలసిన అగత్యంలో, ఒక దృఢమైన నాయకుడికి కలిగే కష్టం ఇది. తన అపజయానికి తాను మొహం చాటేసి, సాంకేతికమయిన విజయాన్ని నెత్తిన పెట్టుకోవలసిన పరిస్థితి.



▪ కె. శ్రీనివాస్

సందర్భం

ఓటమికి పెద్ద బాధపడకుండా, గెలుపును పెద్దగా వేడుక చేసుకోకుండా ఉండవలసిన పరిస్థితిని తెలంగాణలో కూడా చూడవచ్చు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో బీజేపీకి పెద్ద లాభం చేకూర్చాయి. కాంగ్రెస్‌కు బాగా నష్టం చేశాయి. బీఆర్ఎస్ సంగతి చెప్పుకోవలసిన పని లేదు. కానీ, జాతీయ స్థాయి పరిణామాల హడావిడిలో, పొరుగు తెలుగు రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ఘనవిజయం సంరంభంలో, తెలంగాణ జయాపజయాలు పెద్దగా చర్చల్లోకి రాలేదు. కార్పెట్ కిందికి తోసేద్దామని ఓడిపోయినవాళ్లు అనుకుంటే సరే కానీ, నాలుగు సీట్లను రెట్టింపు చేసుకుని ఎనిమిది సీట్లు గెలిచిన బీజేపీ కూడా గెలుపు స్థాయికి తగ్గట్టు సంబరాలు చేసుకోలేదు. ఎనిమిది స్థానాల్లో గెలిచి, మరో ఏడు స్థానాల్లో రెండో స్థానంలో నిలవడం అంటే, ఆ పార్టీకి ఎంతటి పెద్ద గెంతు?

బహుశా, జాతీయస్థాయిలో పెద్ద గెలుపు దక్కలేదన్న నిరుత్సాహం తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో కూడా పనిచేసి ఉంటుంది. అదే సమయంలో, ఇప్పుడు దక్కిన ఓట్ల శాతం కానీ, సీట్లు కానీ ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే వచ్చాయని, వాటిని స్థిరపరచుకోవడానికి ఇంకా చాలా కష్టపడవలసి ఉంటుందని గ్రహించడం కూడా వారి ఆనందాన్ని నిగ్రహించి ఉండవచ్చు. మరి కాంగ్రెస్ పార్టీ ఎందుకు తన ఓటమిని మభ్యపరచాలని చూస్తున్నది? జాతీయస్థాయిలో ఓటమిలో వెలిగిన విజయంలో తలమునకలైనందునా? 2019లో గెలుచుకున్న 3 స్థానాలతో పోలిస్తే ఐదు అదనంగా గెలుచుకున్నామని, బీఆర్ఎస్ తన ఓట్లను బీజేపీకి బదలాయించినందు వల్లనే ఆ స్థానాలలో ఓడిపోయామని కాంగ్రెస్ ఎందుకు వివరణలు ఇస్తున్నది? కూడబలుక్కున్నట్టు వారూ వీరూ తమ గెలుపు ఓటములను గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు నిద్రపుచ్చుతున్నారు?

నిజానికి, కాంగ్రెస్ ఓట్లు 2019 సాధారణ ఎన్నికలతో కానీ, 2023 అసెంబ్లీ ఎన్నికలతో కానీ పోలిస్తే పెరిగాయి తప్ప తరగలేదు. కాకపోతే, పెరగవలసినంత పెరగలేదు. బీఆర్ఎస్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో సంపాదించుకున్న 37.35 శాతం ఓట్లు, ఇప్పటి లోక్‌సభ ఎన్నికల నాటికి 16.68 శాతానికి ఆవిరయ్యాయి. అసెంబ్లీ ఓటమి తరువాత బీఆర్ఎస్‌కు ప్రాసంగికత లేదని దాదాపు 20 శాతం ఓటర్లు భావించి ఉండవచ్చు. బీజేపీకి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఓట్ల శాతంలో పెరుగుదల సుమారు 20 శాతమే. సులువుగా లెక్కవేసుకోవడానికి వీలుగా, లోక్‌సభ ఎన్నికలలో ఆ 20 శాతమే బీజేపీకి అదనంగా వెళ్లాయని అనుకుందాం. ఎందుకు వెళ్లాయన్నది కదా ప్రశ్న? కాంగ్రెస్‌ను కాదని వాళ్లు బీజేపీని ఎందుకు ఎంచుకున్నారు? 2018 అసెంబ్లీ ఎన్నికలకు, 2019 లోక్‌సభ ఎన్నికలకు మధ్య కూడా బీజేపీ ఓట్లు 10 శాతం పెరిగాయి. పార్లమెంటు ఎన్నికలలో పెరగడానికి మోదీ ఆకర్షణ ఒక కారణం కావచ్చు. అసెంబ్లీ ఎన్నికలలో కూడా క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు 15 నియోజకవర్గాల్లో ప్రథమ లేదా ద్వితీయ స్థానంలో ఉన్న బీజేపీ, వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్ర అధికారానికి గురిపెట్టినట్టే కదా? ఇందులో వారి నిర్మాణ బలం, కృషి పాలు ఎంత? కాంగ్రెస్ వైఫల్యం ఎంత? పోనీ, వైఫల్యం కాదు అనుకుందాం.. కాంగ్రెస్‌కు పెరిగిన ప్రమాదం ఎంత? ఈ ప్రశ్నలను చర్చ నుంచి తప్పించలేము.

బీఆర్ఎస్ చెబితే తమ ఓట్లను బదలాయించే విధేయతలో ఆ పార్టీ ఓటర్లు లేరు. బదలాయింపు అన్నది రాజకీయమైన ఆరోపణ. కీలకమయిన స్థానాలలో కాంగ్రెస్ బలహీన అభ్యర్థులను నిలబెట్టి, బీజేపీకి సహకరించిందని బీఆర్ఎస్ కూడా ఆరోపించింది. కొందరు అభ్యర్థుల ఎంపిక విషయంలో ఇతరులు కూడా రకరకాల అనుమానాలు వ్యక్తం చేశారు. ఫలితాలు ఇట్లా వచ్చాక, తాము శంకించింది నిజమైందని వారు భుజాలు చరుచుకుంటున్నారు. రాజకీయ ఆరోపణల సంగతి పక్కనబెడితే, కనీసం నాలుగైదు సీట్లను కాంగ్రెస్ నష్టపోయిన మాట వాస్తవం. రేవంత్ రెడ్డి రూపొందించిన నినాదాలు దేశమంతా కాంగ్రెస్‌కు పనికి వచ్చాయి. మరి తెలంగాణలో ఎందుకు ప్రభావం వేయలేకపోయాయి? దేశమంతా తమకు దొరికిన విజయాలకు రాహుల్‌గాంధీ ఎంతో ఆనందంగా ఉన్నారు. కానీ, ఆయనకు తెలంగాణలో చెలామణీ లేకపోయిందా? బీజేపీ పని అయిపోయిందని ప్రకటనలు చేస్తున్నప్పుడు, తాము అధికారంలో ఉన్న ఒక రాష్ట్రంలో బీజేపీ తన భవిష్యత్ విజయానికి విత్తనం వేసిందని రాహుల్‌గాంధీ గ్రహించారా?

ఇప్పుడు 15 నియోజకవర్గాల్లో ప్రథమ లేదా ద్వితీయ స్థానంలో ఉన్న బీజేపీ, వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్ర అధికారానికి గురిపెట్టినట్టే కదా? ఇందులో వారి నిర్మాణ బలం, కృషి పాలు ఎంత? కాంగ్రెస్ వైఫల్యం ఎంత? పోనీ, వైఫల్యం కాదు అనుకుందాం... కాంగ్రెస్‌కు పెరిగిన ప్రమాదం ఎంత? ఈ ప్రశ్నలను చర్చ నుంచి తప్పించలేము.

అన్ని పార్టీలలోను, తన స్థితిగతులను బట్టి సహజమైన వ్యక్తీకరణలను ఇస్తున్నది ఇప్పుడు ఒక్క బీఆర్ఎస్సే కనిపిస్తున్నది. కిందపడ్డా తనదే పైచేయి అన్న ధోరణి అందరిలోనూ ఉండేదే. అసెంబ్లీ అపజయం తరువాత, లోక్‌సభ ఎన్నికల సన్నాహాలలో భాగంగా, ఆ పార్టీ నేతలు కొంత గాంభీర్యాన్ని ప్రకటించకతప్పలేదు. ఇప్పుడిక సున్నా విజయాలతో, చేతిలోని శాసనసభ్యులు కూడా ఎంతవరకు నిలబడతారో తెలియని స్థితిలో ఆ పార్టీ స్తబ్దుగా మారిపోతున్నది. బుకాయింపులకు దబాయింపులకు అసలే ఆస్కారం లేని స్థితి. ఉనికిని చాటుకునే చిటపటలు మాత్రం కొన్ని వినిపిస్తున్నాయి. బహుశా, ఇది ఆ పార్టీకి ఆత్మవిమర్శో అంతర్ధానమో తేల్చుకోవలసిన సమయం.

పీడకల నుంచి తేరుకున్నది అమరావతి!

ఆంధ్రదేశం ఊపిరి పీల్చుకుంది. అమరావతి ఊపిరి పోసుకుంది. అరాచకం, అవినీతి రెండు చక్రాలుగా సాగిన రథం చివరికి రాజకీయ రణభూమిలో సొంతం దిగబడిపోయింది. 'అరయంగా కర్ణుడీల్గె ఆర్వుర చేతన్' అంటారు. కాని గత ప్రభుత్వ పతనానికి 60 కారణాలు తేలిగ్గా చెప్పవచ్చు. ఆ పతనం అమరావతి ఆడబిడ్డల రొమ్ముల మీద బూటు కాళ్ల ముద్రలు పడ్డప్పుడే ప్రారంభమైంది. అప్పటికే జరిగిన వేలకోట్ల విలువైన నిర్మాణాల్ని గ్రాఫిక్స్ అన్నారు, వల్లమాలిన చమత్కారంతో అమరావతిని 'భ్రమరావతి' అన్నారు, ఈ దళిత నియోజకవర్గంలో 18శాతం ఉన్న ఒక సామాజికవర్గంపై అకారణ ద్వేషంతో 'కమ్మరావతి' అన్నారు. నూరు సంవత్సరాల్లో ఎన్నడూ వరదలెరగని ప్రదేశాన్ని ముంపు ప్రాంతం అన్నారు. ఆపైన అడవి, శ్మశానం లాంటి బిరుదులు తగిలించారు. భూములిచ్చిన 29 వేల మంది రైతులు పెత్తందార్లు కాదు, నూటికి ఎనభై మంది అన్ని కులాల సన్నకారు జీవాలే.

అమరావతి ఉద్యమం సంఘటితం కాకూడదనే ఉద్దేశంతో గ్రామానికి గ్రామానికి మధ్య ఇనప ముళ్ల కంచెలు వేసి, మా రాకపోకల్ని కూడా నిరోధించినప్పుడు నియంతల కాలంలో ఉన్నామని అర్థమైంది. ఆడబిడ్డలు తమ ఉద్యమంలో భాగంగా దుర్గ గుడికి వెళుతుంటే జుట్టు పట్టి ఈడ్చి బూతులు తిట్టినప్పుడు కౌరవ సభ గుర్తుకొచ్చింది. దళిత రైతుల మీద కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన విచిత్ర ఘనత గత ప్రభుత్వానిదే. ఐదేళ్లపాటు అది అప్రకటిత కల్లోల ప్రాంతం. కృష్ణానది ఒడ్డున వైకుంఠపురం, భైరవ కొండ పక్కనే అంతటి ఇసుక కొండ కనపడుతుంది. 'తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు' అన్న కవి ఇప్పుడైతే సవరించి 'కరెన్సీ తీయవచ్చు'నని రాసేవాడు. అన్ని తావులా గంజాయి అందించవచ్చు అని కూడా రాసేవాడు. ఒక వైపు రాజధాని గ్రామాల మధ్య చిట్టడవులు పెంచుతూ, ఊరేగే దారుల పక్కన పచ్చని చెట్లని పరిమార్చటం గమ్మత్తైన విరోధాభాస (paradox) కదా? చిత్రాతిచిత్రం ఏమంటే అమరావతి రాజధాని ప్రదేశం గుంటూరు జిల్లాలో ఉంది. గుంటూరుకు అమరావతి పట్టణం 35కి.మీ. దూరం. ఇప్పుడు రాజధానికి మకుటంగా చరిత్ర ప్రసిద్ధి గల అమరావతిని తీసుకెళ్లి 75 కి.మీ. దూరంగా పల్నాడు జిల్లాలో కలిపారు. అమరావతిని అమరావతి నుంచి వేరు చేసే కుతంత్రం కదా!

అమరావతి ఉద్యమం సంఘటితం కాకూడదనే ఉద్దేశంతో గ్రామానికి గ్రామానికి మధ్య ఇనప ముళ్ల కంచెలు వేసి, మా రాకపోకల్ని కూడా నిరోధించినప్పుడు నియంతల కాలంలో ఉన్నామని అర్థమైంది. ఆడబిడ్డలు తమ ఉద్యమంలో భాగంగా దుర్గ గుడికి వెళుతుంటే జుట్టు పట్టి ఈడ్చి బూతులు తిట్టినప్పుడు కౌరవ సభ గుర్తుకొచ్చింది. దళిత రైతుల మీద కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన విచిత్ర ఘనత గత ప్రభుత్వానిదే. ఐదేళ్లపాటు అది అప్రకటిత కల్లోల ప్రాంతం.



రాజధాని రైతులు రకరకాల కష్టనష్టాలకు, అవమానాలకు, అగచాట్లకు ఎదురొడ్డి, 1630 రోజులపాటు శాంతియుత పోరాటం సాగించారు. ఎక్కడా ఆవేశాలకు లోనై అదుపు తప్పలేదు. అయినా ప్రశాంతమైన పల్లెల్లో వందల మంది పోలీసుల కవాతులు. అక్రమ కేసులతో వందల మంది జైళ్లపాలు. మనోవేదనతో 260 మంది రైతుల మరణం. దెబ్బతిన్న విద్యార్థుల చదువులు. నిద్ర లేని రాత్రులు. భీతి గొలిపే పీడ కలలు. ఈ సందర్భంలో 'అమరావతి జాయింట్ యాక్షన్ కమిటీ', 'అమరావతి పరిరక్షణ సమితి' అలుపెరుగని కృషి చేశాయి. అలాగే పవన జవనాశ్వం. ఇక్కడ అత్యంత క్లిష్ట సమయంలో ఊగిసలాట లేకుండా తెలుగుదేశానికి తోడుగా నిబ్బరంగా నిలిచి అమరావతికి నైతిక బలం ఇచ్చాడు.

ఒక సమాజం సంక్షోభంలో ఉన్నప్పుడు రచయితలు, మేధావుల పాత్ర ఏమిటి అనే ప్రశ్న ఉదయిస్తుంది. రచనల ప్రాసంగికతే (relevance) కాదు, రచయితల ప్రాసంగికత కూడా ఉంటుంది. ఉత్తరాది రైతుల సమస్యల మీద కవి సమ్మేళనాలు, సదస్సులు నిర్వహించిన జాతీయ రచయితల సంఘాలు, వేదికల్ని ఇక్కడి రైతుల కడగండ్ల మాటేమిటని ప్రశ్నించాల్సి వచ్చింది. కుల ద్వేషాల మాటున ఇప్పటికీ సన్నాయి నొక్కులు నొక్కుతున్న సోకాల్డ్ మేధావులు, రచయితల్ని చూస్తుంటే వీళ్లకన్న గొడ్లు కాసుకొనే పామరులు మేలు గదా అన్నాడొక మిత్రుడు.

ఇప్పుడు జరగాల్సిందేమిటి? 1. పెట్టుబడులు, ఉపాధి కల్పన దిశగా రాజధాని పునర్నిర్మాణం. కాలయాపన లేకుండా పని కానిచ్చి, తక్కిన ప్రాంతాల (ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర) సమాన సమగ్రాభివృద్ధినీ సాగించాలి. అమరావతిని తిరిగి రాజధానిలో, గుంటూరు జిల్లాలో కలపాలి. 2. రైతులతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం వాళ్లు వదులుకున్న భూములకు పదేళ్ల పాటు కౌలు చెల్లించాల్సి ఉంది. అయితే మూడేళ్లుగా కొంతమంది రైతులకు, రెండేళ్లుగా అంతమంది రైతులకూ కక్షతో కౌలు చెల్లించటం లేదు. వెంటనే బకాయిలు చెల్లించి వాళ్లని ఆదుకోవాలి. ఇప్పటిదాకా పాడుపెట్టిన ప్రాంతాల్ని అభివృద్ధి చెయ్యాలి. 3. రైతుల మీద అన్యాయంగా పెట్టిన కేసులు ఎత్తివెయ్యాలి. 4. ఇవాళ గంజాయి దొరకని ప్రదేశం లేదు రాష్ట్రంలో. (అది పదో రత్నం!) నేర ప్రవృత్తిని ప్రేరేపించే ఈ విషవ్యాప్తిని ఎంత తొందరగా అంతం చేస్తే అంత మేలు. 5. మద్యపానం అనారోగ్యకర వ్యసనం స్థితి దాటి రాష్ట్ర ఆదాయసాధనమై కూర్చుంది. దాన్ని అదుపు చేసే మార్గం ఆలోచించాలి. 6. సచివుడు అంటే మంత్రి. సచివాలయం అంటే మంత్రులు, అధికారుల కార్యాలయం. మరి గ్రామ సచివాలయం ఏమిటో అర్థం కాదు. గ్రామ సహాయ కార్యాలయం అనవచ్చు. అలాగే వలంటీర్ అంటే జీతభత్యాలు లేకుండా పని చేసే స్వయంసేవకుడు అని కదా? అంతో ఇంతో జీతాలు తీసుకొనేవాళ్లు వలంటీర్లు ఎలా అవుతారు? వెంటనే ఆయా పేర్ల మార్పుతో పాటు ఆ సమాంతర గ్రామ వ్యవస్థల అవసరాన్ని కూడా పునస్సమీక్షించాలి. 7. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజల సొమ్ముతోనే సాగేవి కాబట్టి వాటికి వ్యక్తుల పేర్లు మంచిది కాదు. ప్రభుత్వ పథకాలుగానే వాటి పేర్లు ఉండాలి. ఇక మా భూమి హక్కు పత్రాల మీద మరెవ్వరి వదనారవిందాలూ చిరునవ్వులు రువ్వరాదు. 8. కొద్ది కాలంలో నదీగర్భాలు, పర్వత గర్భాలు డొల్లలై పొయ్యాయి. ఇక్కడ గుంటూరు–అమరావతి దారిలో లాంకొండ శిథిలమైంది. మా ఊరు నెక్కల్లు–అనంతవరం మధ్య ముచ్చబోడు మాయమైంది. అనంతవరం వెంకన్న కొండను క్షమించి, దానికి ఆనుకున్న కొండల్ని తవ్వేస్తున్నారు. ఇప్పటికైనా పర్యావరణ పరిరక్షణ గురించి పట్టించుకోవాలి. ఇసుక ఉచితంగా ఇవ్వనవసరం లేదు. కనీస ధర ఉంటేనే విచ్చలవిడితనం, దుర్వినియోగం తగ్గి, ప్రభుత్వానికి కొంత ఆదాయమూ సమకూరుతుంది. 9. నూతన ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అనే జోడు గుర్రాల స్వారీ చెయ్యాల్సి ఉంది. A country is poor because it is poor అన్నాడు ఆర్థిక శాస్త్రవేత్త Ragnar Nurkse. తక్కువ ఆదాయం నుంచి, తక్కువ ఉత్పాదకత నుంచి, తిరిగి తక్కువ ఆదాయం దాకా ఒక ప్రమాద వలయం (vicious circle) సాగుతుందన్నాడు. సంక్షేమ పథకం అనేది మౌలికంగా సమాజ ఆర్థికాభివృద్ధి లోపానికి సంకేతం. రాజకీయ పక్షాలు పోటీలు పడి తక్షణ సహాయాలు ప్రకటించి ఖర్చు చేసే కొద్దీ ఆర్థికం లోటు పెరుగుతుంది. (వాటి వల్ల ఎలాగూ ఓట్లు రాలవని తేలిపోయింది.) ఎంత మేరకు ఉచితంగా అందుతాయో అంత మేరకు శ్రమ, ఉత్పాదకత తగ్గుతాయి. తిరిగి తక్కువ ఆదాయం. తిరిగి ఉచితాలు. అది నిరంతర వ్యయం (sustained expenditure) గనుక వాటి కొనసాగింపు కోసం అప్పులు, తిప్పలు. ఇదే ప్రమాద వలయం. గ్రీకు పురాణ కథల్లో సిసిఫస్ అనే వ్యక్తి మోయలేని కొండరాయిని నిరంతరం కొండపైకి నెడుతున్నట్టు అప్పుల బరువు నిరంతరం మోస్తూనే ఉండాలి. కాగా ఉచితాలు పొందటం మెల్లగా హక్కుగా మారుతుంది. అవసరం తీరినవాళ్లకి కూడా వాటిని తీసెయ్యలేం. అయితే ముఖ్యంగా విద్యా వైద్యరంగాల్లో ప్రభుత్వ సహాయం అవసరం. అందుకు ఆర్థిక ప్రాతిపదిక తప్ప వయస్సు, వర్గం సరైన ప్రమాణాలు కావని నా అభిప్రాయం. (గుంటూరులో ఖరీదైన అపార్ట్‌మెంట్లలో ఉంటూ రేషన్ కోసం నిలబడేవాళ్లున్నారు.) ఉచిత పథకాలు అందుకొనే వాళ్లనుంచి అందుకు బదులుగా చిన్న చిన్న వృత్తుల్లో శిక్షణతో ఉత్పత్తి రాబట్టే వీలుంటుందేమో చూడాలి. ఆదాయాన్ని మించిన ప్రజాకర్షక పథకాలు క్రమంగా అభివృద్ధిని మందగింపజేస్తాయి. సుస్థిర ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల సృష్టి ప్రధానమని నూతన ప్రభుత్వం గుర్తించి జాగ్రత్తపడుతుందని ఆశిద్దాం.

▪ డాక్టర్ పాపినేని శివశంకర్
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత


ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఇస్తున్న చంద్రబాబు, పవన్


ప్రమాణస్వీకారానికి వి చ్చేసిన అశేష అభిమానులు

పండుగలా పట్టాభిషేకం


ప్రమాణస్వీకారం అనంతరం విజయోత్సాహంతో..

మన మంత్రివర్యులు



వేధింపుల నుంచి విజయం దిశగా..

- రెండోసారి మంత్రిగా కొల్లు రవీంద్ర ప్రమాణస్వీకారం
- నూజివీడు నుంచి గెలిచి మంత్రిగా పార్థసారథి



- 6లో..

అట్టహాసంగా టీడీపీ కూటమి ప్రమాణస్వీకారం

జనం జనం కలిసి ప్రభంజనమైనట్టు.. ప్రమాణస్వీకార మహోత్సవం మహాపట్టాభిషేకాన్ని తలపించింది. ప్రజాతీర్పునకు పట్టంకడుతూ అతిరథ మహారథులు కదలివచ్చారు. అటు కేసరపల్లిలోని సభా ప్రాంగణం.. ఇటు జాతీయ రహదారి.. గన్నవరం విమానాశ్రయం కోలాహలంగా మారాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్‌షా, ఎన్వీ రమణ, వెంకయ్యనాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ సహా సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి, బాలకృష్ణ తదితరులు వేదికపై ముందు వరుసలో నిలిచారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, అచ్చెన్నాయుడు.. ఇతర మంత్రివర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. నారా, నందమూరి, కొణిదెల కుటుంబాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, రాష్ట్ర నలుదిక్కుల నుంచి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు 'వి జయీభవ..' అంటూ నూతన ప్రభుత్వానికి ఆశీస్సులు అందజేశారు.

- కొలువుదీరిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహా మంత్రివర్గం
- హాజరైన ప్రధాని మోదీ, అమిత్‌షా, ఎన్వీ రమణ, వెంకయ్యనాయుడు
- ప్రత్యేక ఆకర్షణగా సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి
- రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు
- కిక్కిరిసిన కేసరపల్లి.. కిటకిటలాడిన జాతీయ రహదారి
- అతిరథులకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : ప్రమాణస్వీకార మహోత్సవానికి ఊరూవాడా కేసరపల్లివైపు కదిలింది. అటు శ్రీకాకుళం, ఇటు రాయలసీమ జిల్లాల నుంచి భారీగా కదలివచ్చారు. తొక్కిసలాటలకు ఆస్కారం లేకుండా జాతీయ రహదారిపై అక్కడక్కడ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి నిలువరించే ప్రయత్నం చేసినా, వాటిని తోసుకుని మరీ కార్యకర్తలు తరలివచ్చారు. ఎవరికి వారు సొంతంగా బస్సులు మాట్లాడుకుని, వాహనాల్లో రావడం విశేషం. టీడీపీ, జనసేన కార్యకర్తలతో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో రావడంతో కేసరపల్లి కిటకిటలాడింది. 50వేల మందికి మాత్రమే గ్యాలరీలు ఏర్పాటు చేయగా, మరో లక్షమంది అదనంగా వచ్చారు. దీంతో జాతీయ రహదారి రద్దీగా మారిపోయింది. బుధవారం ఉదయం 5 గంటల నుంచే జన కోలాహలం మొదలైంది. భారీగా చేరుకున్న కార్యకర్తలు బారికేడ్లను తోసుకుని లోపలికి వెళ్లిపోయారు. పోలీసులు నియంత్రించే పరిస్థితులు లేకపోవడంతో కార్యకర్తలు గ్యాలరీల్లోకి వెళ్లిపోయారు. సగం గ్యాలరీలు కార్యకర్తలతో నిండిపోయాయి. ఇక పాస్‌లు అందుకున్న వీవీఐపీలు, వీఐపీలు 9 నుంచి 10 గంటల మధ్యలో వచ్చారు. వీరంతా గ్యాలరీలకు చేరుకునేసరికి కొంతసమయం పట్టింది. వీఐపీలకు కూర్చునే అవకాశమే దక్కలేదు. నిలబడి ఎల్‌ఈడీ స్క్రీన్లపై వీక్షించారు. వీఐపీలంతా కేసరపల్లి మేధ ఐటీ పార్క్ రోడ్డు నుంచి వెటర్నరీ కాలేజీ వెనకగా సభాస్థలికి వెళ్లాల్సి వచ్చింది. ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ, తిరువూరు నుంచి వచ్చిన వారంతా ఎయిర్‌పోర్టుకు అభిముఖంగా ఉన్న ఎంట్రీ పాయింట్‌కు చేరుకున్నారు. వారందరినీ పోలీసులు నిలుపుదల చేశారు. లోపలికి పంపించాలని కార్యకర్తలు గొడవ చేయటంతో పోలీసులు లోపలికి వదిలారు. దీంతో కార్యకర్తలంతా పరుగులు పెట్టుకుంటూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

ఎల్‌ఈడీ స్క్రీన్లపై వీక్షణ

ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షించటం సాధ్యం కాని వారంతా జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్లను ఆశ్రయించారు. అక్కడే కూర్చుని ప్రమాణ స్వీకారాన్ని చూశారు. అభిమాన నేత ప్రమాణం చేస్తున్నప్పుడు హర్షధ్వానాలు వి న్పించాయి.


రజనీకాంత్, చంద్రబాబు ఆత్మీయ ఆలింగనం

చక్రబంధం

నగరంలో భారీగా ట్రాఫిక్ స్తంభన

- గ్రీన్‌ఛానల్‌గా జాతీయ రహదారి
- ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేత
- వీఐపీ కాన్వాయ్‌లకు ప్రాధాన్యం
- 15 కిలోమీటర్ల మేర ఆగిపోయిన వాహనాలు
- బెంజిసర్కిల్ నుంచి వారధి వరకూ జామ్
- బందరురోడ్డు పొడువునా వాహనాలే
- అనుబంధ రహదారుల్లోనూ ఇదే పరిస్థితి
- ట్రాఫిక్‌లోనే ఇరుక్కుపోయిన చాలామంది టీడీపీ కార్యకర్తలు


జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : టీడీపీ కూటమి ప్రమాణ స్వీకార ప్రభావం నగరంపై తీవ్రంగా పడింది. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ పోలీసులకు ఊపిరాడలేదు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి పాసులున్న వాహనాలనే అనుమతిస్తామని పోలీసులు ముందే ప్రకటించారు. కేసరపల్లివైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జాతీయ రహదారిని మూసేసి గ్రీన్‌చానల్‌గా ఉపయోగించడంతో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. పాసులు లేని వాహనాలూ ప్రమాణస్వీకార కార్యక్రమానికి రావడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. విజయవాడ చుట్టుపక్కల 10-15 కిలోమీటర్ల మేర నిలిచిపోయింది.

బెంజిసర్కిల్‌లో ఉక్కిరిబిక్కిరి

ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరైన వీఐపీలు జాతీయ రహదారికి పక్కనే ఉన్న నోవాటెల్ హోటల్‌లో బస చేశారు. దీంతో పోలీసులు జాతీయ రహదారిని మొత్తం వీఐపీ మార్గంగా ఉపయోగించారు. బెంజిసర్కిల్ వద్ద ఉన్న జాతీయ రహదారిని పోలీసులు పూర్తిగా మూసేశారు. ఏఏఏ, వీఐపీ పాసులున్న వాహనాలను చెరోపక్క నుంచి పంపించారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి వస్తున్న ట్రాఫిక్‌ను, ఆర్టీసీ బస్సులను బందరు రోడ్డులోకి మళ్లించారు. ఏలూరు, విశాఖ వైపు బస్సులను, హనుమాన్ జంక్షన్‌వైపు మళ్లించారు. ఎన్టీఆర్ జంక్షన్ నుంచి ఎంజీ రోడ్డులోకి వెళ్లే ట్రాఫిక్‌ను బెంజిసర్కిల్‌లోని సర్వీసు రోడ్డు, జాతీయ రహదారి మీదుగా స్క్రూబ్రిడ్జి వైపునకు మళ్లించారు. స్క్రూబ్రిడ్జి వైపు నుంచి వచ్చే వాహనాలను వదిలాక ఎన్టీఆర్ జంక్షన్ వైపు వాహనాలు వదిలారు. దీంతో అటు ఎన్టీఆర్ కూడలి మార్గంలోనూ, ఇటు జాతీయ రహదారిపైన వాహనాలు భారీగా నిలిచిపోయాయి. గుంటూరు వైపు నుంచి విజయవాడలోకి వచ్చే వాహనాలను బెంజిసర్కిల్ వద్ద నెమ్మదిగా వదలడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వారధి మొత్తం వాహనాలతో నిండిపోయింది. రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు, గుంటూరు నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఈ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు.

పాస్‌లున్నా చేరుకోలేకపోయారు

ప్రభుత్వం జారీ చేసిన పాసులున్నా కొంతమంది సభా ప్రాంగణానికి చేరుకోలేకపోయారు. ఆలస్యంగా బయల్దేరడం ఒక కారణమైతే, ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం రెండో కారణం. చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షించడానికి వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు బుధవారం ఉదయం 6 ఆరు గంటల నుంచే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దూరప్రాంతాల్లో ఉన్నవారు సొంత వాహనాల్లో విజయవాడకు చేరుకున్నారు. కొంతమందిని ఆర్టీసీ బస్సుల్లో తీసుకొచ్చారు. ఈ వాహనాలు సరిగ్గా వీఐపీలు, చంద్రబాబు కాన్వాయ్‌లు బయల్దేరే సమయానికి బెంజిసర్కిల్ వద్దకు చేరుకున్నాయి. వీఐపీ కాన్వాయ్‌లు వెళ్లే సమయం కావడంతో పాసులు ఉన్న వాహనాలను ఇక్కడి నుంచి బందరు రోడ్డులోకి మళ్లించారు. పాస్‌లున్నా తమను ఎందుకు అనుమతించడం లేదని పలువురు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాన్వాయ్‌లన్నీ సభాప్రాంగణానికి చేరుకున్నాక ట్రాఫిక్‌కు అంతరాయం కలగలేదు.

అకుంఠిత దీక్షతో..

ఐదేళ్ల విధ్వంసం తర్వాత అమరావతికి ఊపిరి

- మూడేళ్లలో రాజధాని గాడిన పడుతుంది
- రెండేళ్లలోనే అందరికీ అభివృద్ధి ఫలాలు
- మహిళా సాధికారత దిశగా అడుగులు
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ శ్రేణుల అంతరంగం



- 6లో..

నేడే బడి

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- జగనన్న విద్యాకానుక స్థానంలో 'స్టూడెంట్ కిట్స్'
- పూర్తిగా అందుబాటులోకి రాని పాఠ్యపుస్తకాలు



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బడిగంట మోగింది. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో బుధవారం నుంచే పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉండగా, కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని ఒకరోజు ఆలస్యంగా తెరవాలని నిర్ణయించారు.

నేడు స్టూడెంట్ కిట్‌ల అందజేత

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పాఠశాలల పునఃప్రారంభం రోజే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'స్టూడెంట్ కిట్స్' పేరిట పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, సాక్సులు, బూట్లు, యూనిఫాం తదితరాలను ఇవ్వాలని విద్యాశాఖ ఉన్నతాధి కారులు ఎంఈవోలను ఆదేశించారు. ప్రస్తుతం మండల కేంద్రాల్లోని ఎంఆర్‌సీలలో పాఠ్యపుస్తకాలు, కిట్‌లు ఉన్నాయి. వీటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే, అన్ని తరగతులకు సంబంధించి పాఠ్య పుస్తకాలు రాలేదని టీచర్లు చెబుతున్నారు. కృష్ణాజిల్లాకు సంబంధించి 8,32,606 పుస్తకాలు రావాల్సి ఉండగా, 7,74,774 వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 8,85,466 పుస్తకాలు రావాల్సి ఉండగా, 7,75,036 వచ్చాయి. ఏడో తరగతికి సంబంధించి పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదని టీచర్లు చెబుతుండగా, రెండు రోజుల్లో వాటిని కూడా ఎంఆర్‌సీ పాయింట్లకు పంపుతామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు జగనన్న విద్యాకానుక పేరుతో పాఠ్యపుస్తకాలు, ఇతరత్రాలు అందించేవారు. బ్యాగులపై వైఎస్ జగన్ ఫొటో ఉండేది. ఈసారి అవి కొంతమేర వచ్చినా నిలిపివేశారు. జగనన్న వి ద్యాకానుక పేరుతో కాకుండా స్టూడెంట్ కిట్ పేరుతో రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా అందజేస్తున్నారు.

నత్తనడకన నాడు-నేడు పనులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,086 పాఠశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయి. రెండో వి డతలో రూ.437 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం, పాఠశాలల వద్ద తాగునీరు, వి ద్యుత్ సౌకర్యం, ఇతరత్రా సౌకర్యాలను కల్పించే పనులు జరుగుతున్నట్లు చెబుతున్నారు. అయితే, ఈ పనులు పూర్తిస్థాయిలో జరగట్లేదు. విద్యా కమిటీలు, ప్రధానోపాధ్యాయులు అంతగా ఈ పనులు చేసేందుకు ఆసక్తి కనబరచకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపో యాయి. కొన్నిచోట్ల నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులను ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించి, ఆ బాధ్యతల నుంచి తమను తప్పించాలని పాఠశాలల హెచ్‌ఎంలు డిమాండ్ చేస్తున్నారు.



చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..



వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



కూటమి పార్టీల స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

వేధింపుల నుంచి విజయం దిశగా..

- రెండోసారి మంత్రిగా కొల్లు రవీంద్ర ప్రమాణస్వీకారం
- ఐదేళ్లు వైసీపీ నేత పేర్ని నాని టార్గెట్‌గా రవీంద్ర
- రాజకీయంగా ఎదుర్కోలేక కేసులతో వేధింపులు
- సౌమ్యుడిగా పేరున్న రవీంద్రపై హత్యాయత్నం కేసు



(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

అధికార మదం తలకెక్కితే.. ప్రత్యర్థిని రాజకీయంగా ఎదుర్కోలేనని తేలిపోతే.. వేధింపులు.. బెదిరింపులే అస్త్రాలవుతాయి. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల ప్రతిపక్ష టీడీపీ నేతలకు అడుగడుగునా అవమానాలు.. వేధింపులు.. బెదిరింపులే ఎదురయ్యాయి. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2019లో వైసీపీ ఎమ్మెల్యేగా ఎన్నికై.. ఆ తర్వాత మంత్రి అయిన పేర్ని నాని కూడా తన ప్రత్యర్థి, మాజీ మంత్రి కొల్లు రవీంద్రను రాజకీయంగా ఎదుర్కోలేక వేధింపుల అస్త్రాన్నే నమ్ముకున్నారు. కానీ ఆయన అస్త్రం బెడిసికొట్టింది. సౌమ్యుడు.. వివాదరహితుడిగా పేరున్న రవీంద్రపై వేధింపులను.. ఆయనపై మోపిన హత్యాయత్నం కేసును ప్రజలు నమ్మలేదు. ఓటు అస్త్రాన్ని ప్రయోగించి పేర్నినానిని మట్టికరిపించారు. మచిలీపట్నం నియోజకవర్గ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో 50వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో కొల్లు రవీంద్రకు పట్టం కట్టారు. పార్టీ అధినేత చంద్రబాబు సైతం రవీంద్ర విధేయతను.. కష్టాలను గుర్తించారు. రెండోసారి మంత్రి పదవి కట్టబెట్టి గౌరవం కల్పించారు. బుధవారం కేసరపల్లి వద్ద జరిగిన కార్యక్రమంలో రవీంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

బనాయించిన కేసులో 53 రోజులపాటు జైలులో..

మత్స్యకార సామాజికవర్గానికి చెందిన రవీంద్రను 2019లో వైసీపీ గెలిచిన మరుసటి రోజు నుంచి వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. 2020 జూన్ 29న అప్పటి మంత్రి పేర్ని నాని సన్నిహితుడు, వైసీపీ నేత మోకా భాస్కర్‌రావును వ్యక్తిగత కక్షలతో కొందరు హత్య చేస్తే ఆ కేసును రవీంద్రపై బనాయించారు. కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో జూలై 4న రవీంద్రను అరెస్టు చేసి జైలుకు పంపారు. రాజమహేంద్రవరం జైలులో రిమాండ్ ఖైదీగా 53 రోజులు ఉన్న రవీంద్ర ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. వాస్తవానికి ఈ కేసులో నిందితులు హత్య జరిగిన మరుసటి రోజే జూన్ 30న లొంగిపోయారు. కానీ వారితో బలవంతంగా రవీంద్ర పేరు చెప్పించేందుకు జూలై 2 వరకు అరెస్టు చూపకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు. రవీంద్రను ఈ కేసులో ఇరికించేందుకే పోలీసులు ఇలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. రవీంద్ర అనుచరుల విషయంలోనూ పేర్ని నాని అదే విధంగా వ్యవహరించారు. మున్సిపల్ అధికారులను చెప్పుచేతల్లో ఉంచుకుని ఎప్పుడో కట్టుకున్న ఇళ్లకు ప్లాన్లు సరిగా లేవంటూ కూల్చేసేందుకూ సిద్ధమయ్యారు. ఈ వేధింపులన్నింటినీ ఎదుర్కొంటూ.. అనుచరుల్లో ధైర్యాన్ని నింపుతూ కొల్లు రవీంద్ర పెద్ద పోరాటమే చేశారు. వీటన్నింటిపైనా కొల్లు రవీంద్ర న్యాయపరంగా పోరాడి విజయం సాధించారు. ఆయన పోరాటాలకు ఎట్టకేలకు గుర్తింపు లభించింది. ఎట్టలకే ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించడమే కాకుండా రెండోసారి మంత్రిగా పదవి చేపట్టారు.

అంచెలంచెలుగా ఎదుగుతూ..

మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు రాజకీయ వారసుడిగా వచ్చిన కొల్లు రవీంద్ర తన స్వశక్తితో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. 2005లో ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడిగా.. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా.. పనిచేసిన ఆయన ప్రస్తుతం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడి స్థాయికి ఎదిగారు. టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. కొల్లు ఫౌండేషన్ ద్వారా మచిలీపట్నం నియోజకవర్గంలో ప్రజలకు సేవలందిస్తున్నారు. 2009 నుంచి వరుసగా మచిలీపట్నం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఆయన రెండుసార్లు ఓటమిని రెండు సార్లు గెలుపును సొంతం చేసుకున్నారు. 2009, 2019లో ఆయన ఓటమి చెందగా 2014, 2024లో విజయం సాధించారు.

మంత్రిగా కొలుసు పార్థసారథి ప్రమాణ స్వీకారం..

ఏలూరుజిల్లా నూజివీడు నియోజకవర్గం నుంచి గెలుపొందిన కొలుసు పార్థసారథిని మంత్రి పదవి వరించింది. ఆయన 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఉయ్యూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా, 2009, 2019లలో పెనమలూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2009 నుంచి 2010 వరకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో పార్థసారథి పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, పాడి పరిశ్రమశాఖ అభివృద్ధి మంత్రిగా, 2010 నుంచి 2014 వరకు మాధ్యమిక విద్యాశాఖా మంత్రిగా విధులు నిర్వహించారు. 2024లో ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా గెలుపొందారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ గన్నవరం/ఉంగుటూరు)

అకుంఠిత దీక్షతో..



- ఐదేళ్ల విధ్వంసం తర్వాత.. అమరావతికి ఊపిరి
- మూడేళ్లలో గాడిన పడుతుంది
- రెండేళ్లలోనే అభివృద్ధి ఫలాలు
- మహిళా సాధికారత దిశగా అడుగులు
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- 'ఆంధ్రజ్యోతి'తో టీడీపీ శ్రేణుల అంతరంగం

బాబు 4.0

'రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన నవ్యాంధ్రను చంటిబిడ్డలా కాపాడుకోవాల్సిన పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని 'మూడు ముక్కల'తో సర్వనాశనం చేసింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల అరాచక, నియంతృత్వ పాలనకు ప్రజలు ఎట్టకేలకు చరమగీతం పాడారు.. గతి తప్పిన రాష్ట్రాన్ని పునర్నిర్మించుకునేందుకు తెలుగుదేశం పార్టీకి మరోమారు సువర్ణ అవకాశాన్ని కల్పిస్తూ ఈ ఎన్నికల్లో సంచలన తీర్పు ఇచ్చారు.. ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు పని చేస్తారనటంలో ఎలాంటి సందేహం లేదు.. అమరావతి రాజధాని నిర్మాణంలో నష్టపోయిన ఐదేళ్లను భర్తీ చేయటంతో పాటు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకువెళ్లే గురుతర బాధ్యతను కూటమి ప్రభుత్వం తప్పకుండా పూర్తిచేస్తుంది'.. అని సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రమాణస్వీకారోత్సవానికి వచ్చిన పలువురిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా.. తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వారి మాటల్లోనే..

రాజధాని పునర్నిర్మాణానికి అడుగులు..


లెంకా బంగారునాయుడు(విజయనగరం)



ఐదేళ్ల వైసీపీ పాలనలో నవ్యాంధ్ర రాజధాని అమరావతిని విధ్వంసం చేశారు. ప్రజల కలలు సమిధలయ్యాయి. అమరావతి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు విస్పష్టమైన తీర్పు ద్వారా వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు. మళ్లీ చంద్రబాబు కావాలన్న ఆకాంక్షతో తిరుగులేని మెజారిటీ ఇచ్చారు. అమరావతి పునర్నిర్మాణం కష్టతరమైనప్పటికీ అది చంద్రబాబు వల్లనే సాధ్యమౌతుంది. ఖచ్చితంగా మూడేళ్లలో అమరావతి వైభవం కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తుంది. ప్రజలంతా ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం విస్పష్ట తీర్పు..

పాట్నూరు అప్పలరామ్, మండపేట



రాష్ట్రం వైసీపీ ప్రభుత్వ కబంధ హస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడిపోయింది. గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడం కోసమే ప్రజలు సంచలన తీర్పు ఇచ్చారు. చంద్రబాబు మంచి పరిపాలకుడు. ఈసారి ఆయన సత్తా ఏమిటో ఏపీ ప్రజలు చూస్తారు. రాబోయే రెండేళ్లలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి చంద్రబాబు తీసుకువెళ్లగలరన్న నమ్మకం ఉంది.

కేంద్రంలో చంద్రబాబు చక్రం తిప్పుతారు

జి.గోవిందరావు (తుమ్మకాపల్లి)



రాష్ట్రంలో మంచి మెజారిటీ సాధించిన కూటమి ప్రభుత్వం.. కేంద్రంలోనూ చంద్రబాబు చక్రం తిప్పే పరిస్థితుల్లో ఉన్నారు. ఇది మంచి తరుణం. కేంద్రం ద్వారా రాష్ట్రానికి కావాల్సిన అన్నింటినీ సాధించుకోగలిగే అవకాశం ఉంది. గాడి తప్పిన రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలంటే ఇదే మంచి తరుణం. చంద్రబాబుపై రాష్ట్రం ప్రజలందరికీ మంచి అభిప్రాయం ఉంది. సంపద సృష్టించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించబోతున్నారు. గత ఎన్నికల్లో కూడా ప్రజలు ఆశీర్వదించి ఉంటే ఈ పాటికి పరిపూర్ణత వచ్చి ఉండేది.

పారిశ్రామికవిప్లవం రాబోతోంది..

అప్పలనాయుడు(ఇంగుమండం)



రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం రాబోతోంది. 2014-19లో చంద్రబాబు పాలనలో పారిశ్రామిక రంగానికి పెద్ద పీట వేశారు. ఎన్నో భారీ పరిశ్రమలు వచ్చాయి. అదేస్థాయిలో పెట్టుబడులు వచ్చాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో పరిశ్రమల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. మళ్లీ చంద్రబాబు పరిశ్రమలను తీసుకువస్తారు. ఈసారి పూర్తి స్థాయిలో ఖచ్చితంగా అమలు చేస్తారు.

పర్యాటకానికి నవశకం..

భూపతిరాజు సత్యనారాయణరాజు (భీమవరం)



టీడీపీ హయాంలో పర్యాటక శోభ కనిపించేది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రమోషన్స్ నిర్వహించేవారు. విజయవాడ వేదికగా మెగా ఈవెంట్లు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం పర్యాటకరంగాన్ని నాశనం చేసింది. భవానీ ద్వీపాన్ని టీడీపీ ప్రభుత్వం అభివృద్ధిచేస్తే.. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసింది. పవిత్ర సంగమం, కృష్ణా హారతులను పక్కన పెట్టారు. గాడి తప్పిన పర్యాటకాన్ని పునరుద్ధరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రజల ఆకాంక్షలతో.. పరిపాలన

వడ్లమూడి మాధవరావు, తిరువూరు (7895)

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగుతుందని చంద్రబాబే చెబుతున్నారు. ఈసారి



టీడీపీ పాలన వినూత్నంగా ఉంటుంది. ప్రజలు కూడా బాధ్యతలను విస్మరించవద్దని చంద్రబాబు చెబుతున్నారు. ప్రజల భాగస్వామ్యంతో పరిపాలన సాగించడమన్నది మంచి విషయం. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

ప్రకృతి వనరుల లూటీ ఉండదు..

గూడవల్లి భవానీ సూర్య ప్రసాద్ (బుద్ధవరం)



వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా కొల్లగొట్టారు. యథేచ్ఛగా కాలువలు, చెరువులు, గట్లు తవ్వేశారు. టీడీపీ ప్రభుత్వం వీటిపై చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నా. కొత్త ప్రభుత్వంలో తవ్వకాలకు అక్రమ అనుమతులు ఇచ్చే ప్రశ్న ఉండదు. ఈ విషయంలో పూర్తి నమ్మకం ఉంది.

మహిళలకు సాధికారత..

కంబంపాటి లక్ష్మి, బుద్ధవరం



వైసీపీ పాలనలో మహిళలకు తీవ్ర అన్యాయం జరిగింది. మహిళలకు పథకాలు ఇస్తున్నట్టుగా నయవంచన చేశారు. టీడీపీ ప్రభుత్వం మహిళల కోసం ఇప్పటికే సూపర్‌సిక్స్‌లో పథకాలను ప్రకటించడం జరిగింది. వీటన్నింటినీ అమలు చేయటం ద్వారా సాధికారత పెరుగుతుంది.

బ్యాటరీ వాహన సేవలు ..

కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సభా ప్రాంగణానికి రెండు, మూడు కిలోమీటర్ల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు నడిచి వస్తున్న క్రమంలో వృద్ధులను తరలించేందుకు వీలుగా ఆచార్య నాగార్జునా యూనివర్శిటీ బ్యాటరీ వాహనాలను ఏర్పాటు చేసింది. ఈ వాహనాలు నిరంతరాయంగా సేవ చేశాయి.



హీరోరామ్‌చరణ్ సందడి ..

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక అతిథిగా వచ్చిన మెగాస్టార్ చిరంజీవి తనయుడు రామ్ చరణ్ గన్నవరంలోని ఏటీ కన్వెన్షన్‌లో సందడి చేశారు. నిర్మాత కిలారు సతీశ్ సోదరుడు కిలారు సురేశ్, కాంట్రాక్టర్ ప్రత్తిపాటి శ్రీనివాసరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. గన్నవరం ప్రాంతానికి చెందిన కిలారు సతీష్ హీరో రామ్‌చరణ్‌తో సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు రామచరణ్‌తో ముచ్చటించారు.



ట్రాఫిక్ వలయంలో ఐటీ పార్క్..

మేథ ఐటీపార్కు రోడ్డు రద్దీగా మారింది. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా వీవీఐపీ, వీఐపీలు వారికి నిర్దేశించిన గ్యాలరీలకు వెళ్లేందుకు ఐటీ పార్క్ రోడ్డును కేటాయించారు. ఈ రోడ్డునే కిలోమీటరున్నర పొడవున ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులను ఏసీ బస్సుల్లో సభాస్థలికి తరలించారు. వీవీఐపీల కాన్వాయ్‌లు కూడా ఈ రోడ్డు మార్గం నుంచే బయలుదేరాయి. డైరెక్టర్ బోయపాటి, సెలబ్రిటీల కార్ల కాన్వాయ్, వివిధ దేశాలకు చెందిన దౌత్యవేత్తల కార్ల కాన్వాయ్ కూడా ఇదే మార్గంలో వెళ్లాయి. దీంతో మేధా ఐటీ పార్కు రోడ్డు వాహనాలతో రద్దీగా మారిపోయింది.



ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్ చేదు అనుభవం

సీనియర్ ఐఏఎస్ అధికారి, జగన్ పేషీలో ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ప్రవీణ్ ప్రకాష్‌కు విజయవాడలో చేదు అనుభవం ఎదురైంది. ఆయన విమానాశ్రయం వైపు నుంచి విజయవాడకు వస్తుండగా గన్నవరం వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. అది గమనించిన గుంటూరు జిల్లాకు చెందిన సత్యం అనే యువకుడు ద్విచక్రవాహనంపై ప్రత్యామ్నాయ మార్గాల్లో తీసుకువెళ్లి ఆయన ఇంటి వద్ద దింపారు. తర్వాత సత్యంను ప్రవీణ్ ప్రకాశ్ సత్కరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	146, 155, 166
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

దుర్గగుడిలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



వన్‌టౌన్, జూన్ 12: ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జ్యేష్ఠ శుద్ధ షష్ఠి తిథిని పురస్కరించుకుని బుధవారం వల్లీ దేవ సేన సుబ్రహ్మణ్యస్వామి లీలా కల్యాణ వేడుకను ఆర్జిత సేవ కింద నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్త విధానంలో కల్యాణోత్సవ ప్రక్రియను నిర్వహించారు. వివిధ ఉపచారాల అనంతరం మంగళ సూత్రధారణ, తలంబ్రాల సమర్పణ అనంతరం వేదశాంతి పలికి హారతులు ఇచ్చారు. ఈవో రామారావు , అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.





స్వీట్లు పంపిణీ చేస్తున్న మహమ్మద్ ఫతావుల్లా , గన్నె వెంకట నారాయణ ప్రసాద్ తదితరులు, టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో కేక్ తినిపిస్తున్న నవనీతం




సత్యం హోటల్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న బొప్పన భవకుమార్, కల్పన ప్రింట్స్ రోడ్డు సెంటర్‌లో జనసేన నాయకులు

కూటమి శ్రేణుల ఆనందోత్సాహాలు

● నగరంలో పలుచోట్ల బాణాసంచా కాల్చి సంబరాలు, స్వీట్లు పంపిణీ ● ప్రమాణస్వీకారం వీక్షించేందుకు వీలుగా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు

వన్‌టౌన్, జూన్ 12: కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. ఎక్కడికక్కడ కార్యకర్తలకు, నాయకులకు స్వీట్లు పంచడంతో పాటు కేక్‌లు కట్ చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. వన్‌టౌన్‌లో మహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. గణపతిరావు రోడ్డులోని ఆయన కార్యాలయం వద్ద 54, 55 డివిజన్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. షేక్ ఆశా, తమీమ్ అన్సార్, జాహీద్, ఖయ్యాం, అబ్దుల్ హదీ, షేక్ గౌస్, షేక్ శిలార్ పాల్గొన్నారు.

● హనుమాన్‌పేటలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకటనారాయణ ప్రసాద్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

● 52వ డివిజన్ మల్లిఖార్జునపేటలో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

● 38వ డివిజన్ పరిధిలోని గుప్తాసెంటర్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు వేమూరి మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.

సెంట్రల్ కార్యాలయంలో

అజిత్‌సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నేతలు సంబరాలు చేశారు. పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు కేక్ కట్ చేశారు. నేతలు రాజశేఖర్, సురేష్, చంటి, అనిల్ యాదవ్, రఘు, మారుతి పాల్గొన్నారు.

కృష్ణలంకలో ఫ్లెక్సీలు, భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్లు

కృష్ణలంక: కృష్ణలంకలోని పలు ప్రాంతాల్లో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన అభిమానులు వీధుల్లో భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్లు పెట్టారు. కేక్ కట్ చేసి అభిమానులు ఒకరినొకరు తినిపించుకొన్నారు. కృష్ణలంక కల్పన ప్రింట్స్ రోడ్డు సెంటర్‌లో జనసేన నాయకులు కొవ్వూరి కిరణ్‌బాబు ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్ర్కీన్ పెట్టించారు. కేక్ కట్ చేశారు.

● వల్లూరి వారి వీధిలో టీడీపీ నాయకుడు ఘంటా శోభన్‌బాబు ఆధ్వర్యంలో భారీ ఎల్‌ఈడీ వాల్ స్ర్కీన్ , డీజే సౌండ్ సిస్టంతో ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి పంచారు.

● కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్‌లో టీడీపీ నాయకుడు గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, తెలుగు యువత నాయకులు పోడూరి పవన్‌కుమార్, తవ్వా ప్రకాష్, వెచ్చా రవి ఆధ్వర్యంలో సర్వీసు రోడ్డులో 30 అడుగుల భారీ ఎల్‌ఈడీ వాల్ స్ర్కీన్‌ను డీజే సౌండ్ సిస్టమ్‌తో ఏర్పాటు చేశారు. బొప్పన భవకుమార్ చేత కేక్ కట్ చేయించి ఒకరినొకరు తినిపించుకొన్నారు. టీడీపీ నాయకులు పెరుమాళ్ల గురునాథం, చందన సురేష్, కొర్రా అప్పన్న, షేక్ షాబు, కేశనం భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కృష్ణలంక ఎస్‌బీఐ సెంటర్‌లో నాయుడుపేట ఫ్రెండ్ సర్కిల్ నాయకుడు చల్లా గణేష్ ఆధ్వర్యంలో జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొన్నారు.

భారతీనగర్: నాలుగో డివిజన్‌లో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో రమేష్‌బాబు ఆసుపత్రి సెంటర్‌లోని డివిజన్ పార్టీ కార్యాలయంలో బుధవారం సంబరాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గన్నవరం సమీపంలో జరిగిన ప్రమాణ స్వీకారానికి ర్యాలీగా తరలివెళ్లారు.

భవానీపురం: సీనియర్ టీడీపీ నాయకుడు గంగవరపు మురళీ ఆధ్వర్యంలో సితార సెంటర్‌లో ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. పదవీ స్వీకారం పూర్తి కాగానే స్వీట్లు పంచుకుని, బాణాసంచా కాల్చి నృత్యాలు చేశారు. ● నాలుగు స్థంభాల సెంటర్, చెరువు సెంటర్, కుమ్మరి పాలెం, స్వాతి, భవానీపురం, క్రాంబ్వేరోడ్లపై నేతలు, కార్యకర్తలు బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

చిట్టినగర్: 46వ డివిజన్‌లో టీడీపీ నేతలు ఫైర్ స్టేషన్ వద్ద పార్టీ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేశారు. నాయకులు గుర్రం కొండ, ప్రభుదాస్, ధనల శ్రీనివాస్, అమర్ బాబు, లోకేష్, హరిబాబు, దాసు తదితరులు పాల్గొన్నారు.



నాలుగో డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద సంబరాలు



46వ డివిజన్‌లో..



సితార సెంటర్‌లో ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై తిలకిస్తున్న..




కేక్ కట్ చేస్తున్న యలమంచిలి రవి, జనసేన నాయకులు, మధురానగర్‌లో జనసేన సంబరాలు

పటమట రామాలయం సెంటర్లో..

పటమట : కూటమి విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్‌లు బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని పటమట రామాలయం సెంటర్లో పెరుమాళ్ల చందు, బాలరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. 11, 12, 13, 14 డివిజన్లకు చెందిన జనసేన నాయకులు పాశం సుజాత, మాకినేని నీరజ, యడ్లపల్లి శివనాగరాజు, రామాయణపు కోటి, సాంబయ్యలు పాల్గొన్నారు.

మధురానగర్: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మధురానగర్ డివిజన్ జనసేన అధ్యక్షుడు కెంబూరి కృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. బుధవారం ఉదయం 12 గంటలకు గద్దె బాబురావు రోడ్డులో కేక్ కట్ చేశారు. కెంబూరి భవానీ, అడపా కోటేశ్వరరావు, కిరణ్, మౌనిక, శ్రీను, రవి, సీతయ్య , స్వప్నశ్రీ, జనార్దన్, రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మంచి ఆరోగ్యం అందించాలని కోరుతూ

కొబ్బరికాయల సమర్పణ



వన్‌టౌన్, జూన్ 12: 42వ డివిజన్ టీడీపీ కార్యాలయ కమిటీ సభ్యుడు మైనవరపు శివ బుధవారం దుర్గగుడి ఘాట్‌రోడ్డు వద్ద ఉన్న కామధేను అమ్మవారి ఆలయం వద్ద 101 టెంకాయలను సమర్పించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంలో ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, అదే సమయంలో మంచి పరిపాలన సాగించేలా ఆశీర్వదించాలని దుర్గమ్మను కోరుకున్నట్లు శివ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా రజక సంఘం అధ్యక్షుడు ముదిగొండ శివ, మైనారిటీ నాయకుడు రెహమాన్, పశ్చిమ టీఎన్‌టీయూసీ నాయకుడు హనుమంతరావు, ఆర్‌టీఎస్ కో ఆర్డినేటర్ కోడిబోయిన స్రవంతి, కేశన రమేష్, బొరిగర్ల వెంకట్రావ్, మాతంగి రాజు, ఉంగరాల సత్యనారాయణ, జశ్వంత్, పవన్, ప్రణీత్, బాజీ పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు కొండారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం



నివాళులర్పించిన నాయకులు, కార్మికులు

విద్యాధరపురం, జూన్ 12: కార్మిక నాయకుడు జంగా మాలా కొండారెడ్డి సేవలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహరావు అన్నారు. ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పశ్చిమ సిటీ గౌరవ అధ్యక్షుడు జంగా మాలా కొండారెడ్డి సంస్మరణ సభ బుధవారం భవానీపురంలోని ఆయన నివాసం వద్ద జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పిల్లి నరసింహరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కార్పొరేటర్ బోయి సత్యబాబు తదితరులు కొండారెడ్డి చిత్రపటానికి పూలవాలలు వేసి ఘనంగా నివాళులు సమర్పించారు. సీఐటీయూ నాయకులు ఎస్.సుబ్బారెడ్డి, ఈవీ నారాయణ, కె.సూరిబాబు, వెంకట్రావు(చౌదరి), అంబులు, కొండారెడ్డి అభిమానులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థలో సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ



మొగల్రాజపురం, జూన్ 12: అత్యవసర ప్రమాద సమయంలో ప్రథమ చికిత్స చేసి ప్రాణాలు కాపాడే విధానం (సీపీఆర్)పై పీబీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. యంగ్ (సీఐఐ) ఇండియన్స్, (వైఐ) అమరావతి చాప్టర్ , జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ హైదరాబాద్, సిద్ధార్థ హెల్త్ క్లబ్‌లు సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి. యంగ్ (సీఐఐ) ఇండియన్స్, (వైఐ) అమరావతి చాప్టర్ చైర్ డాక్టర్ వై. భవన్ చంద్ మాట్లాడుతూ అకస్మాత్తుగా గుండెకు సంబంధించిన సమస్యలు వచ్చినపుడు మరణబారిన పడకుండా ప్రథమ చికిత్స చేసే విధానంపై అవగాహన ఉంటే మనిషి ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ అధ్యక్షత వహించారు. ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ బోధకులు అరవింద, పార్వతి తదితరులు అత్యవసరమైన చికిత్సలో సీపీఆర్, ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్స్, పరికరాలు వాడటంలో శిక్షణ ఇచ్చారు. ఎన్‌సీసీ అధికారులు వెంకటేష్, కుసుమ, బాలాజీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌లు సుభాకర్, శ్రీనివాసరెడ్డి , వెంకట రమణ, హెల్త్ క్లబ్ ఇన్‌చార్జి కెప్టెన్ విజయ్, క్యాడెట్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

పరసా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

పటమట, జూన్ 12 : సీఐటీయూ విజయవాడ ఈస్ట్ సిటీ ఆధ్వర్యంలో పటమట భవన నిర్మాణ కార్మికుల పెయింటర్స్ అడ్డా వద్ద బుధవారం కార్మిక నేత పరసా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలు కరపత్రాలను ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా విజయవాడ తూర్పు సిటీ అధ్యక్షుడు వీబీ.రాజు మాట్లాడుతూ ఈనెల 14న సాయంత్రం 6 గంటలకు మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రం వద్ద పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ప్రసంగిస్తారని తెలిపారు. పి.రాజు, సాంబయ్య, కె.నాగేంద్ర, పి.కుమార్, పి. సీతయ్య, ఎస్.బాబు పాల్గొన్నారు.

చీడపురుగు 'సజ్జల'

● జాతీయ బీసీ సంఘం నేత ఉదయ్ కిరణ్

గవర్నర్‌పేట, జూన్ 12: రాష్ట్రానికి, వైసీపీకి పట్టిన చీడపురుగు సజ్జల రామకృష్ణారెడ్డి అని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్ అన్నారు. 4వసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

బుధవారం స్థానిక హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అధికారాన్ని తన ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేసి, అక్రమ మార్గాల ద్వారా సజ్జల కోట్లాది రూపాయలు కూడబెట్టారని, సజ్జల అక్రమాలపై సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలని, దోచుకున్న ప్రజాధనాన్ని కక్కించాలని నూతన ప్రభుత్వాన్ని కోరారు.

మెగా జాబ్‌మేళా రేపు

కృష్ణలంక, జూన్ 12: జిల్లా ఉపాధి కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 14న నగరంలోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని టెన్త్, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్లలోపు నిరుద్యోగుల పూర్తి బయోడేటా ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఆసక్తి గలవారు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8142416211 సంప్రదించాలని కోరారు.

సెంట్రల్ జోన్ క్రికెట్‌లో గుంటూరు జయభేరి



సెంచరీ చేసిన వసంత వర్ధన్

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 12: మూలపాడు వేదికగా జరుగుతున్న ఏసీఏ సెంట్రల్ జోన్ పురుషుల అంతర్ జిల్లాల అండర్-23 వన్డే క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ప్రకాశంపై గుంటూరు 22పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు 47.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది.

బ్యాటర్స్ డి.వసంత్ వర్ధన్ సెంచరీ (131)తో కదం తొక్కగా, ప్రకాశం బౌలర్లలో కె.సాత్విక్ 5 వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం బరిలో దిగిన ప్రకాశం 47.3 ఓవర్లలో పోరాడి 266 పరుగులకు ఆలౌటయ్యింది.



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రావడంతో నిర్మలా కాన్వెంట్ రోడ్డులో నిలిచిన ట్రాఫిక్.

-భారతీనగర్



విదేశీ ప్రతినిధులతో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెడ్ జె. స్నేహజ

బాబు ప్రమాణ స్వీకారానికి
ప్రత్యేక అతిథులుగా దౌత్యాధికారులు

అమరావతి/హైదరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు వివిధ దేశాలకు చెందిన దౌత్యాధికారుల నుంచి కూడా అభినందనలు అందాయి. రాజధాని అమరావతికి తమ సహకారం ఉంటుందని తెలిపారు. బుధవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల్లోని విదేశీ కాన్సులేట్ కార్యాలయాల ప్రతినిధులు(దౌత్యాధికారులు), ఇతర ఉన్నతస్థాయి అధికారులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. సాధారణంగా ప్రధానుల ప్రమాణ స్వీకారోత్సవానికి వీరు హాజరవుతుంటారు. ముఖ్యమంత్రుల ప్రమాణానికి విదేశీ ప్రతినిధులు, కాన్సుల్ అధికారులు కనిపించడం అరుదు. కానీ, చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి 10 దేశాలకు చెందిన కాన్సుల్ జనరల్ అధికారులు, విదేశీ ప్రతినిధులు తరలివచ్చారు. సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్, ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలాయ్ జాకి, దక్షిణ కొరియా కాన్సుల్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, జపాన్ కాన్సుల్ జనరల్ తకహాషి మునియో, బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ గారెథ్ విన్ ఓవెన్, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ థియెర్రీ బెర్థిలాట్, బంగ్లాదేశ్ యాక్టింగ్ డిప్యూటీ హై కమిషనర్ ఎండీ ఆరిఫర్ రెహ్మాన్, నెదర్లాండ్స్ కాన్సుల్ జనరల్ ఏవోట్ డీ విట్, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ ఆడ్రియానా లార్సన్, శ్రీలంక ఈస్ట్రన్ ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండమాన్‌లు పాల్గొన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్ మహదీ షారోఖీ కూడా హాజరయ్యారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి సహకరిస్తామని దౌత్యాధికారులు తెలిపారు. కొత్తగా ఏర్పడిన ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కాగా, భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెడ్ జొన్నలగడ్డ స్నేహజ విదేశీ ప్రతినిధులను సమన్వయం చేశారు.

కూటమి జెండాలతో పడవల ర్యాలీ



చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా కృష్ణానదిలో కూటమి జెండాలతో ఇసుక పడవల ర్యాలీ

తాడేపల్లి టౌన్, జూన్ 12: ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ కృష్ణానదిలో పడవలు ర్యాలీ నిర్వహించాయి. అమరావతి ఇసుక పడవల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో మంతెన ఆశ్రమం నుంచి ప్రకాశం బ్యారేజి వరకు ర్యాలీ కొనసాగింది. పడవలపై చంద్రబాబు భారీ కటౌట్, పవన్ కల్యాణ్, లోకేశ్ బ్యానర్లు, కూటమి పార్టీల జెండాలను రెపరెపలాడించారు. రాజధాని అమరావతి పాటలు, జై చంద్రబాబు నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా అమరావతి ఇసుక పడవల సంఘం నాయకులు దేవినేని సదాశివరావు, కేళి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ వైసీపీ హయాంలో స్థానికంగా బోట్ల యజమానులు, కార్మికులను కాదని ప్రభుత్వ పెద్దలకు లబ్ధి చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకుని తమ పొట్ట కొట్టారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు రాకతో అమరావతి అభివృద్ధితోపాటు అందరికీ ఉపాధి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తొలి సంతకాలు నేడే

(మొదటి పేజీ తరువాయి)

ఐదు అంశాలపై ఆయన తన తొలి సంతకాలు చేయనున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహణపై మొదటి సంతకం చేస్తానని ఎన్నికల ప్రచార సమయంలో చంద్రబాబు ప్రకటించారు. ఆ మాట నిలబెట్టుకోనున్నారు. రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ చట్టం ఉపసంహరణపై చేయననున్నారు. దానిపైనా ఆయన, జనసేనాని పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. వృద్ధులు, ఒంటరి మహిళలకు ఇస్తున్న సామాజిక పింఛన్లను ఇప్పుడున్న రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచే ఫైలుపై మూడో సంతకం చేస్తారు. ఉపాధి కల్పనకు సంబంధించి వివిధ స్కిల్స్ ఉన్న వారి వివరాల సేకరణకు సంబంధించిన స్కిల్ సెన్సస్ నిర్వహణపై నాలుగో సంతకం, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై ఐదో సంతకం ఆయన చేస్తారని టీడీపీ వర్గాలు వివరించాయి. వీటికి సంబంధించిన వివరాలు సేకరించి ఫైళ్లను ఆయన సంతకం కోసం సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇప్పటికే ఆదేశాలు పంపారు. బుధవారం తిరుమలలో శ్రీవారి దర్శనానికి వెళ్లిన చంద్రబాబు గురువారం మధ్యాహ్నానికి అమరావతి చేరుకుంటారు.



అమరావతిలోని సచివాలయ భవనాలకు విద్యుద్దీపాలంకరణ

శాఖలవారీగా శ్వేతపత్రాలు

శాఖలవారీగా గత ప్రభుత్వంలో ఏం జరిగిందీ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఏమిటి.. పనుల పురోగతి.. ఆయా శాఖల్లో పురోగమనమా లేక తిరోగమనమా అన్నదానిపై శ్వేతపత్రాలు సిద్ధం చేయాలని చంద్రబాబు మంత్రులను ఆదేశించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన తర్వాత బుధవారం సాయంత్రం మంత్రులందరూ ఇక్కడి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆయనతో కొంతసేపు భేటీ అయ్యారు. వాటిని ప్రజల ముందు పెట్టి గత ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో వివరిద్దామని ఆయన చెప్పారు. జగన్ ప్రభుత్వ హయాంలో నాశనమైన వ్యవస్థలను ప్రక్షాళన చేసి రాష్ట్రాన్ని పునర్నిర్మించడంలో మంత్రులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. 'ప్రజల సంతృప్తే మనకు కొలబద్ద. మనపై వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మనం వాటిని నిలుపుకోవాలి. మంత్రి పదవిని ఆషామాషీగా తీసుకోవద్దు. మీ మీ శాఖల్లో ఫలితం చూపించేలా పనిచేయండి. మీమీ శాఖల కార్యదర్శులను కలుపుకొని పనిచేయండి. ఎవరికి వారుగా కాకుండా అందరూ టీమ్‌వర్క్‌తో పనిచేయండి. క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతోందో నాకు ఫీడ్ బ్యాక్ ఇవ్వండి. అందరం కలిసి మంచి నిర్ణయాలు తీసుకుందాం. ప్రభావవంతంగా అమలయ్యేలా పర్యవేక్షిద్దాం' అని ఆయన వారితో అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో మంత్రుల పేషీల్లో పనిచేసిన సిబ్బందిని ఎవరినీ తీసుకోవద్దని గట్టిగా చెప్పారు. 'గత ప్రభుత్వంలో అనేక మంది మంత్రులు కళంకితులుగా ముద్ర వేసుకున్నారు. వారివద్ద పనిచేసిన వారు ఇప్పుడు మీ వద్ద దూరే ప్రయత్నం చేస్తారు. వారిని రానివ్వకండి. కొత్త వారిని తీసుకోండి' అన్నారు. తాను గతంలో సీఎంగా ఉన్నప్పుడు ఏం జరిగిందీ.. ఇప్పటి పరిస్థితులెలా ఉన్నాయో ఆయన విశ్లేషించారు. మంత్రులకు శాఖలను గురువారం కేటాయిస్తానని చెప్పారు. మంత్రుల అభీష్టం, సమర్థతను బట్టి శాఖల కేటాయింపు ఉంటుందని సూచనప్రాయంగా తెలిపారు.

తిరుమలకు చంద్రబాబు

- నేడు శ్రీవారి దర్శనం
- అలవాటు ప్రకారం పరదాలు కట్టిన అధికారులు
- పద్ధతి మారాలని లోకేశ్ సూచన

తిరుమల (ఆంధ్రజ్యోతి), గన్నవరం, జూన్ 12: ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం ఉండవల్లి నివాసం నుంచి రోడ్డు మార్గాన గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి పయనమయ్యారు. బుధవారం రాత్రి 8.54 గంటలకు సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్‌లతో కలిసి చంద్రబాబు తిరుమలలోని గాయత్రి నిలయం అతిథిగృహానికి చేరుకున్నారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిశోర్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలో బస చేసిన చంద్రబాబు గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా, తిరుమలలో టీడీపీ కార్యకర్తలను చంద్రబాబు పలకరించారు. అతిథి గృహం వద్ద వర్షం పడుతున్నా కారు దిగి కార్యకర్తల వద్దకు వెళ్లి చిరునవ్వుతో మాట్లాడారు. కాగా,



తిరుమలలో కార్యకర్తలతో మాట్లాడుతున్న బాబు

చంద్రబాబుకు స్వాగత విషయంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదనే విమర్శలు వినిపించాయి. అతిథిగృహం ముందు కారు దిగిన సీఎంకు టీటీడీ అధికారులు పుష్పగుచ్ఛం అందించకుండా అతిథి గృహం లోపల ఇవ్వడంపై విమర్శలు రేగాయి.

ఇంకా ఎందుకీ పరదాలు: లోకేశ్

మాజీ సీఎం జగన్ పర్యటనలో పరదాలు కట్టడం అలవాటైన అధికారులు తాజాగా సీఎం చంద్రబాబు పర్యటనలోనూ తిరుమలలో అతిథి గృహం వద్ద పరదాలు కట్టారు. వాటిని చూసిన లోకేశ్ అధికారులను ప్రశ్నించారు. 'ఏం ఇంకా పోలీసులు పరదాలు కట్టారు. అలవాటైపోయింది వాళ్లకి. కట్టొద్దంటే కడుతున్నారు. ముందు ఈ అలవాటు మార్చాలి. అంతా సెట్ కావాలి. ఫ్లైఓవర్‌పై మొదటి సారి పోలీసులను చూశాను' అంటూ నవ్వారు.



నెల్లూరు జిల్లా మొగిలిచెర్ల గ్రామంలో ఘర్షణ పడుతున్న టీడీపీ, వైసీపీ వర్గాలు

మొగిలిచెర్లలో ఉద్రిక్తత

- టీడీపీ, వైసీపీ శ్రేణుల ఘర్షణ
- లాఠీచార్జి చేసి చెదరగొట్టిన పోలీసులు

లింగసముద్రం, జూన్ 12 టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరగడంతో నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం మొగిలిచెర్ల గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణ సంచా కాలుస్తూ వేడుకలు జరుపుకొన్నారు. అయితే, తన ఇంటివద్ద బాణసంచా కాల్చవద్దంటూ వైసీపీ నాయకుడు కొలికి కొండలరావు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు రాళ్లతో దాడి చేసుకున్నాయి. దీంతో లింగసముద్రం, వలేటివారిపాళెం ఎస్ఐలు బాజీబాబు, మహేంద్రనాయక్ తమ సిబ్బందితో హుటాహుటిన గ్రామానికి చేరుకొన్నారు. స్పెషల్ పోలీసులనూ రంగంలోకి దించారు. లాఠీచార్జి చేసి పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇరుపార్టీల్లోనూ కొందరికి, ఒకరిద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. కందుకూరు డీఎస్పీ ఎ.శ్రీనివాస్, గుడ్లూరు సీఐ బీవీ సుబ్బారావు, గుడ్లూరు ఎస్సై లక్ష్మణరావు, కందుకూరు రూరల్ ఎస్సై రమణయ్య కూడా గ్రామానికి చేరుకొని శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

బాబు ప్రిన్సిపల్ సెక్రటరీగా ముద్దాడ

- ఉత్తర్వులు జారీ చేసిన నీరబ్ కుమార్

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5నే ముద్దాడను ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించాలని చంద్రబాబు ఆదేశించారు. కానీ, ప్రమాణ స్వీకారం కాకపోవడంతో ఆయనకు ఆదేశాలు ఇవ్వలేదు. బుధవారం ప్రమాణస్వీకార ఘట్టం పూర్తి కావడంతో సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ముద్దాడ వెంటనే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మాపైనా మీరు ఆధారపడాల్సిందే!

- బిల్లులు పాస్ కావాలంటే.. రాజ్యసభలో మీకు మేం అవసరం!
- బీజేపీ గుర్తుపెట్టుకోవాలని విజయసాయిరెడ్డి హెచ్చరిక
- దాడులపై రాష్ట్రపతి, ప్రధానికి ఫిర్యాదు

న్యూఢిల్లీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో బీజేపీకి తమ అసవరం ఉంటుందని, ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ ప్రభుత్వాన్ని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)కి వైసీపీ ఎంపీలు బుధవారమిక్కడ ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాము అధికారం కోల్పోయినా.. పార్లమెంటు ఉభయసభల్లో కలిపి తమకు 15 మంది



ఎంపీలున్నారని గుర్తుచేశారు. లోక్‌సభలో మాత్రమే టీడీపీకి 16 మంది ఎంపీలున్నారని, అదే తమకు రాజ్యసభలో 11 మంది, లోక్‌సభలో నలుగురు ఎంపీలు ఉన్నారని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామి అయినా, రాజ్యసభలో మాత్రం బీజేపీకి తమ అవసరం ఉంటుందని చెప్పారు. ఆ సభలో ఏదైనా బిల్లు ఆమోదం పొందాలంటే తమ మద్దతు తప్పనిసరని.. బీజేపీ పార్లమెంటులో టీడీపీపై ఎంత ఆధారపడి ఉందో, వైసీపీ పైనా అంతే ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి టీడీపీ తమ కార్యకర్తలపై దాడులు చేస్తోందని ఆరోపించారు. ఇప్పటి వరకు సుమారు 27 సంఘటనలు జరిగాయని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను రాష్ట్రపతి, ప్రధాని, హోంమంత్రి, ఎన్‌హెచ్‌ఆర్‌సీకి చేసిన ఫిర్యాదులకు జత చేశామని చెప్పారు. రాష్ట్రంలో దాడులకు టీడీపీ, జనసేన, బీజేపీ బాధ్యత వహించాలన్నారు. దేశంలో ఎన్డీయే ప్రభుత్వమే ఉన్నందున కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతికి రాసిన లేఖలో మాత్రం బీజేపీపై విమర్శలు చేయకపోవడం గమనార్హం. సమావేశంలో ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మోపిదేవి వెంకటరమణ, మిథున్‌రెడ్డి, గురుమూర్తి, మస్తాన్‌రావు, తనూజారాణి ఉన్నారు.

మనోళ్లు సూపర్

టీమిండియాకు సూపర్-8 బెర్త్

- అమెరికాపై ఏడు వికెట్ల విజయం
- సత్తా చాటిన అర్ష్‌దీప్, సూర్యకుమార్



అర్ష్‌దీప్ (4-0-9-4)



సూర్యకుమార్ (50 నాటౌట్)

న్యూయార్క్: వందకుపైగా లక్ష్యాన్ని ఛేదించడానికి టీమిండియా ఆపసోపాలు పడినా.. సూపర్-8కు చేరుకొంది. సూర్యకుమార్ (49 బంతుల్లో 50 నాటౌట్) సమయోచిత అర్ధ శతకంతో.. గ్రూప్-ఎలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో పసికూన అమెరికాపై గెలిచింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన రోహిత్ సేన మొత్తం ఆరు పాయింట్లతో తర్వాతి దశకు అర్హత సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్‌దీప్ (4-0-9-4) కెరీర్ బెస్ట్ ప్రదర్శనతో చెలరేగడంతో.. తొలుత అమెరికా 20 ఓవర్లలో 110/8 స్కోరు చేసింది. నితీష్ కుమార్ (27), స్టీవెన్ టేలర్ (24), కోరె అండర్సన్ (15) ఆదుకొన్నారు. హార్దిక్ పాండ్యా 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో భారత్ 18.2 ఓవర్లలో 3 వికెట్లకు 111 పరుగులు చేసి గెలిచింది. దూబే (31 నాటౌట్), రిషభ్ పంత్ (18) రాణించారు. సౌరభ్ నేత్రావల్కర్ 2 వికెట్లు పడగొట్టాడు.

తడబడి.. నిలబడి: లక్ష్య ఛేదనలో సూర్య, దూబే నాలుగో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యంతో టీమిండియాను గట్టెక్కించారు. నేత్రావల్కర్ దెబ్బకు 10 పరుగులకే ఓపెనర్లు కోహ్లీ (0), రోహిత్ శర్మ (3)ను కోల్పోయిన టీమిండియాను తొలుత పంత్, సూర్య ఆదుకొన్నారు. ఐదో ఓవర్‌లో సౌరభ్ బౌలింగ్‌లో సూర్య సిక్స్ బాదగా.. ఆ తర్వాతి ఓవర్‌లో పంత్ సిక్స్ సాధించాడు. దీంతో పవర్‌ప్లేలో భారత్ 33/2తో మెరుగ్గా కనిపించింది. అయితే, దూకుడుగా ఆడుతున్న పంత్‌ను అలీ బౌల్డ్ చేయడంతో.. మూడో వికెట్‌కు 29 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో పేలవ ఫామ్‌లో ఉన్న దూబే క్రీజులోకి రావడంతో మధ్య ఓవర్లలో స్కోరు వేగం మందగించింది. మరోవైపు సూర్య కూడా ఆచితూచి ఆడడంతో 10 ఓవర్లకు భారత్ 47/3 స్కోరు చేసింది. కాగా, 22 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద షాడ్లీ బౌలింగ్‌లో సూర్య ఇచ్చిన క్యాచ్‌ను నేత్రావల్కర్ చేజార్చడంతో బతికిపోయాడు. మరోవైపు దూబే సిక్స్‌తో గేర్ మార్చడంతో.. లక్ష్యం చివరి 30 బంతుల్లో 35 పరుగులుగా మారింది. **కాగా, ఓవర్‌కు ఓవర్‌కు మధ్య 'వన్ మినిట్' నిబంధనను యూఎస్ మూడోసారి ఉల్లంఘించడంతో ఐదు పరుగుల పెనాల్టీ విధించారు. దీంతో 16వ ఓవర్‌లో మొత్తం 11 రన్స్ లభించాయి.** ఆ తర్వాతి ఓవర్‌లో సూర్య 6,4తో 15 పరుగులు పిండుకోవడంతో.. టార్గెట్ 18 బంతుల్లో 9 రన్స్‌కు దిగివచ్చింది. సూర్య సింగిల్‌తో అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. దూబే మరో 10 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

ఎదురునిలిచిన నితీష్: అర్ష్‌దీప్ నిప్పులు చెరిగినా.. నితీష్ ఆదుకోవడంతో అమెరికా పోరాడగలిగే స్కోరు చేసింది. టేలర్‌తో కలసి మూడో వికెట్‌కు 31 పరుగులు జోడించిన నితీష్.. అండర్సన్‌తో ఐదో వికెట్‌కు 25 రన్స్ భాగస్వామ్యం నెలకొల్పాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఎస్‌ను అర్ష్‌దీప్ భయపెట్టాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ జహంగీర్ (0), ఆండ్రెస్ గౌస్ (2)ను అవుట్ చేయడంతో.. పవర్‌ప్లేలో అమెరికా 18/2తో నిలిచింది. జోరుమీదున్న ఆరోన్ జోన్స్ (11)ను బోల్తా కొట్టించిన పాండ్యా.. ప్రత్యర్థిని పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాడు. ఈ దశలో మరో ఓపెనర్ టేలర్‌కు జత కలసిన నితీష్ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టేందుకు యత్నించాడు. సిక్స్‌తో గేర్ మార్చే ప్రయత్నం చేస్తున్న టేలర్‌ను అక్షర్ బౌల్డ్ చేశాడు. కానీ, అండర్సన్‌తో జత కలసి నితీష్ ఎదురుదాడి చేశాడు. పాండ్యా వేసిన 13వ ఓవర్‌లో నితీష్ 6,4తో 12 పరుగులు పిండుకొన్నాడు. మరోవైపు అండర్సన్ కూడా సిక్స్‌తో టచ్‌లోకి వచ్చాడు. అయితే, ధాటిగా ఆడుతున్న నితీష్‌ను అవుట్ చేసిన అర్ష్‌దీప్ మళ్లీ దెబ్బకొట్టాడు. కానీ, 16వ ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో అండర్సన్ ఫోర్ కొట్టగా.. హర్మీత్ (10) సిక్స్ బాదడంతో మొత్తం 14 పరుగులు లభించాయి. అండర్సన్‌ను పాండ్యా, హర్మీత్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేశారు. షాడ్లీ వాన్ (11 నాటౌట్), జస్‌దీప్ (2) జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు.

స్కోరుబోర్డు

యూఎస్ఏ: షయన్ జహంగీర్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 0, స్టీవెన్ టేలర్ (బి) అక్షర్ 24, గౌస్ (సి) హార్దిక్ (బి) అర్ష్‌దీప్ 2, ఆరోన్ జోన్స్ (సి) సిరాజ్ (బి) హార్దిక్ 11, నితీష్ (సి) సిరాజ్ (బి) అర్ష్‌దీప్ 27, అండర్సన్ (సి) పంత్ (బి) హార్దిక్ 15, హర్మీత్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 10, షాడ్లీ వాన్ (నాటౌట్) 11, జస్దీప్ సింగ్ (రనౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 110/8; వికెట్ల పతనం:** 1-0, 2-3, 3-25, 4-56, 5-81, 6-96, 7-98, 8-110; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-9-4, సిరాజ్ 4-0-25-0, బుమ్రా 4-0-25-0, హార్దిక్ 4-1-14-2, దూబే 1-0-11-0, అక్షర్ 3-0-25-1.

భారత్: రోహిత్ (సి) హర్మీత్ (బి) నేత్రావల్కర్ 3, కోహ్లీ (సి) గౌస్ (బి) నేత్రావల్కర్ 0, పంత్ (బి) అలీఖాన్ 18, సూర్యకుమార్ (నాటౌట్) 50, దూబే (నాటౌట్) 31; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 18.2 ఓవర్లలో 111/3; వికెట్ల పతనం:** 1-6, 2-15, 3-44; **బౌలింగ్:** నేత్రావల్కర్ 4-0-18-2, అలీఖాన్ 3.2-0-21-1, జస్దీప్ 4-0-24-0, షాడ్లీ వాన్ 4-0-25-0, కోరే అండర్సన్ 3-0-17-0.

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జటు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	3	3	0	0	6	1.137
అమెరికా	3	2	1	0	4	0.127
పాకిస్థాన్	3	1	2	0	2	0.191
కెనడా	3	1	2	0	2	-0.493
ఐర్లాండ్	2	0	2	0	0	-1.712

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

పాయింట్ల పట్టిక — గ్రూప్-డి

జటు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
దక్షిణాఫ్రికా	3	3	0	0	6	0.603
బంగ్లాదేశ్	2	1	1	0	2	0.075
నెదర్లాండ్స్	2	1	1	0	2	0.024
నేపాల్	2	0	1	1	1	-0.539
శ్రీలంక	3	0	2	1	1	-0.777

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

వెస్టిండీస్ x న్యూజిలాండ్ (ఉ.6. గం.)
బంగ్లాదేశ్ x నెదర్లాండ్స్ (రా.8. గం.)
ఇంగ్లండ్ x ఒమన్ (రా.12.30. గం.)

లంక, నేపాల్ అవుట్!

వర్షంతో ఇరుజట్ల మ్యాచ్ రద్దు
సూపర్-8కు సౌతాఫ్రికా

లాడర్‌హిల్: భారీ వర్షం కారణంగా గ్రూప్-డిలో శ్రీలంక, నేపాల్ మధ్య బుధవారం జరగాల్సిన మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో ఇరు జట్లకూ చెరో పాయింట్ లభించినా.. టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, ఆడిన మూడు మ్యాచుల్లోనూ నెగ్గి 6 పాయింట్లు సాధించిన సౌతాఫ్రికా సూపర్-8కు దూసుకెళ్లింది. లంకతో మ్యాచ్ రద్దు కాకముందు నేపాల్‌కు కూడా టాప్-2లో నిలిచే అవకాశం ఉండడంతో సఫారీలు సూపర్-8కు చేరుకోవడంపై అప్పుడు స్పష్టత రాలేదు. ప్రస్తుతం రెండు మ్యాచ్‌ల నుంచి ఒక పాయింటే సాధించిన నేపాల్.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో బలమైన సౌతాఫ్రికా, బంగ్లాదేశ్‌లతో ఆడాల్సి ఉంది. ఇక, శ్రీలంకకు ఒక్క మ్యాచే మిగిలుండడంతో ఆ జట్టు తర్వాతి దశకు చేరడం అసాధ్యమే. గ్రూప్‌లో మిగిలిన రెండో బెర్త్ కోసం బంగ్లా, నెదర్లాండ్స్ పోటీపడుతున్నాయి. అయితే, డచ్ జట్టు కంటే బంగ్లా మెరుగైన రన్‌రేట్‌తో ఉండడం కలిసొచ్చే అంశం.



1 — టీ20లలో 100 వికెట్లు సాధించిన తొలి ఆస్ట్రేలియా పురుష బౌలర్ ఆడమ్ జంపా

సూపర్-8కు ఆస్ట్రేలియా

9 వికెట్లతో నమీబియాపై గెలుపు

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): బలమైన ఆస్ట్రేలియా ధాటికి పసికూన నమీబియా చిగురుటాకులా వణికింది. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా తొమ్మిది వికెట్లతో నమీబియాను చిత్తు చేసి సూపర్-8లోకి అడుగుపెట్టింది. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన నమీబియా ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 17 ఓవర్లలో 72 పరుగులకే చేతులెత్తేసింది. కెప్టెన్ గెరార్డ్ ఎరాస్మస్ (43 బంతుల్లో 36) ఆదుకోకుంటే ఆ జట్టు పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఎదుర్కొన్న 17వ బంతికి కానీ తొలి పరుగు చేయని ఎరాస్మస్ 43/8తో దయనీయ స్థితిలో ఉన్న జట్టు స్కోరును తన బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ దాటించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జంపా (4/12) నమీబియాను ఉక్కిరిబిక్కిరి చేశాడు. హాజెల్‌వుడ్, స్టొయినిస్ కూడా ప్రత్యర్థి పతనంలో తమవంతు పాత్ర పోషించారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 5.4 ఓవర్లలోనే 74/1 స్కోరుతో ఛేదించింది. వరుసగా 3 విజయాలు సాధించిన ఆసీస్ తదుపరి దశకు చేరింది. మరోవైపు 3 మ్యాచ్‌ల్లో రెండింటిలో ఓడిన నమీబియా సూపర్-8 రేస్‌నుంచి అవుటైంది.

సంక్షిప్తస్కోరు:
నమీబియా: 17 ఓవర్లలో 72 ఆలౌట్ (ఎరాస్మస్ 36, లింగెన్ 10, జంపా 4/12, స్టొయినిస్ 2/9, హాజెల్‌వుడ్ 2/18); **ఆస్ట్రేలియా:** 5.4 ఓవర్లలో 74/1 (హెడ్ 34 నాటౌట్, వార్నర్ 20, మార్ష్ 18 నాటౌట్, వీజ్ 1/15).

పాయింట్ల పట్టిక — గ్రూప్-బి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఆస్ట్రేలియా	3	3	0	0	6	3.580
స్కాట్లాండ్	3	2	0	1	5	2.164
నమీబియా	3	1	2	0	2	-2.098
ఇంగ్లండ్	2	0	1	1	1	-1.800
ఒమన్	3	0	3	0	0	-1.613

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సిక్కి జోడీ శుభారంభం

సిడ్నీ: తెలుగు షట్లర్లు సిక్కి రెడ్డి, సుమిత్ రెడ్డి జంట ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రణయ్, సిరిల్ వర్మ, కిరణ్, ఆకర్షి కశ్యప్ ముందంజ వేశారు. బుధవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి-సుమిత్ జోడీ 21-17, 21-19తో వాంగ్ టైన్ సి-లిమ్ చివ్ (మలేసియా) జంటపై గెలిచింది. ప్రణయ్ 21-10, 23-21తో డి ఒలివెరా (బ్రెజిల్)పై, సిరిల్ 21-10, 21-10తో టాంగ్ (ఆస్ట్రేలియా)పై, కిరణ్ జార్జ్ 21-17, 21-10తో షెంగ్ (కెనడా)పై, ఆకర్షి 21-14, 21-11తో పొలినా (ఉక్రెయిన్)పై, మాళవిక 21-10, 21-8తో కియోరాపై నెగ్గారు. శ్రీకృష్ణప్రియ-వెంకట్ ద్వయం తొలి రౌండ్లోనే ఓడింది.

నిత్య, జ్యోతికకు స్వర్ణాలు



జ్యోతికశ్రీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఇండియన్ గ్రాండ్ ప్రీ-3లో తెలుగు అథ్లెట్లు నిత్య, జ్యోతికశ్రీ స్వర్ణాలతో మెరిశారు. బెంగళూరులో బుధవారం జరిగిన 200 మీటర్ల రేసును నిత్య 24.23 సెకన్లలో పూర్తిచేసి విజేతగా నిలిచింది. ఇక, 400 మీటర్ల రేసులో తణుకు అమ్మాయి జ్యోతికశ్రీ 51.53 సెకన్లలో గమ్యాన్ని చేరుకొని ప్రథమస్థానంలో నిలిచింది.



నిత్య

క్వార్టర్స్‌లో సుమిత్



పెరూగియా (ఇటలీ): సుమిత్ నగల్ తన సూపర్ ఫామ్ కొనసాగిస్తున్నాడు. గతవారం జర్మనీలో ఏటీపీ చాలెంజర్ టైటిల్ నెగ్గిన సుమిత్.. పెరూగియా చాలెంజర్ టోర్నీలోనూ టైటిల్ దిశగా మరింత ముందుకెళ్లాడు. సింగిల్స్‌లో అతడు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. బుధవారం హోరాహోరీగా జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఆరోసీడ్ సుమిత్ 0-6, 7-5, 7-6(7-5)తో స్థానిక ఆటగాడు అలెగ్జాండ్రో గియానెస్సిని ఓడించాడు.

రూ. 1.35 లక్షల కోట్లు

ఐపీఎల్ విలువ ఇదీ

న్యూఢిల్లీ: గతేడాదితో పోలిస్తే ఐపీఎల్ వ్యాపార విలువ ఈ సంవత్సరం 6.5 శాతం పెరిగి రూ. 1.35 లక్షల కోట్లకు చేరినట్టు అమెరికాకు చెందిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హౌలిహన్ లోకీ ఇంక్ వెల్లడించింది. ఇక.నిరుటితో పోలిస్తే ఐపీఎల్ బ్రాండ్ వాల్యూ స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన 6.3 శాతం పెరిగి రూ. 28 వేల కోట్లకు చేరింది. ఈసారి టోర్నీలో నాకౌట్‌కు చేరకపోయినా..చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) అటు బ్రాండ్, ఇటు వ్యాపార విలువలో నెం.1 ఫ్రాంచైజీగా నిలిచింది. గత ఏడాది కంటే..ఈసారి ఆ జట్టు విలువ 9శాతం పెరిగి రూ. 1928 కోట్లకు చేరింది. బెంగళూరు రెండో (రూ. 1894 కోట్లు) స్థానంలో నిలిచింది. ఈ సీజన్ విజేత కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్రాండ్ వాల్యూలో (రూ. 1802 కోట్లు) ముంబై ఇండియన్స్ (రూ. 1702 కోట్లు)ను వెనక్కు నెట్టి మూడో స్థానం దక్కించుకుంది. రాజస్థాన్ రాయల్స్ (రూ.1110) ఐదో స్థానం, సన్‌రైజర్స్ (రూ.1101) ఆరో స్థానంలో నిలిచాయి.

బిజినెస్


జీవిత బీమా పాలసీలపై రుణ కల్పన తప్పనిసరి

పెన్షన్ పాలసీల నుంచి పాక్షికంగా పెట్టుబడులు వెనక్కి.. ఐఆర్‌డీఏఐ సర్క్యులర్ జారీ

న్యూఢిల్లీ: జీవిత బీమా పాలసీలకు సంబంధించి బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పాలసీలపై రుణ సదుపాయాన్ని ఇక నుంచి తప్పనిసరి చేసింది. దీనికి సంబంధించి బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు పాలసీలపై రుణం ఇవ్వడం అనేది సంబంధిత సంస్థ విచక్షణాధికారానికి లోబడి ఉండేది. పాలసీదారుల లిక్విడిటీ అవసరాలు పరిగణనలోకి తీసుకుని ఐఆర్‌డీఏఐ తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం ఇక నుంచి జీవితబీమా కంపెనీలన్నీ పాలసీదారులు కోరినట్టయితే పాలసీలోని సొమ్ముపై తప్పనిసరిగా రుణం అందించాల్సి ఉంటుంది. దీనికి తోడు పాలసీ తీసుకున్న అనంతరం అది తనకు సంతృప్తికరంగా లేకపోతే సరెండర్ చేయడానికి ఉద్దేశించిన ఫ్రీ లుక్ పీరియడ్‌ను ప్రస్తుత 15 రోజుల నుంచి నెల రోజులకు పెంచింది. దీని వల్ల పాలసీ తీసుకున్న వినియోగదారులు పాలసీ పత్రాలు సమగ్రంగా అధ్యయనం చేసేందుకు మరింత సమయం అందుబాటులోకి వస్తుంది. పాలసీలు సరెండర్ చేసే వారికి చెల్లించే మొత్తం, పాలసీల్లో కొనసాగేవారితో సమానంగా ఉండాలని కూడా ఐఆర్‌డీఏ స్పష్టం చేసింది.

పెన్షన్ పాలసీదారులకు ఊరట

పెన్షన్ పథకాల నుంచి పాలసీదారులు పాక్షికంగా పెట్టుబడులు వెనక్కి తీసుకునేందుకు కూడా ఐఆర్‌డీఏఐ ఆమోదం తెలిపింది. దీని వల్ల పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇల్లు/ఫ్లాట్ కొనుగోలు/నిర్మాణం, తీవ్ర అనారోగ్య సమస్యలకు అయ్యే చికిత్స వ్యయాలు వంటి అవసరాల కోసం తమ పెన్షన్ పాలసీల నుంచి కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకునే సౌలభ్యం పాలసీదారులకు ఏర్పడనుంది. బీమా అంబుడ్స్‌మన్ ఇచ్చే తీర్పులపై అప్పీల్‌కు వెళ్లకపోతే, బీమా సంస్థలు ఆ తీర్పులను నెల రోజుల్లో అమలు చేయాలని కూడా ఐఆర్‌డీఏ కోరింది. లేకపోతే బీమా సంస్థలు ఫిర్యాదుదారుడికి రోజుకి రూ.5,000 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.



అమెరికాలో వడ్డీరేట్లు యథాతథం

వాషింగ్టన్: వడ్డీరేట్లను ఇప్పుడున్న స్థాయిలోనే యథాతథంగా కొనసాగించాలని అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వు నిర్ణయించింది. దీంతో అక్కడ వడ్డీరేటు 5.25-5.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగుతుంది. ఫెడ్ ఛైర్మన్ జెరోం పోవెల్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అమెరికాలో మే నెల రిటైల్ ద్రవ్యోల్బణం 3.3 శాతానికి తగ్గింది. దీంతో ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లు కొద్దిగా తగ్గించే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమయ్యాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు (ఈసీబీ) ఇటీవల వడ్డీరేట్లు పావు శాతం తగ్గించడమూ ఈ అంచనాలకు తోడైంది. అయితే వడ్డీరేట్ల తగ్గింపునకు మరికొంత కాలం వేచి చూడాలని ఫెడ్ నిర్ణయించింది. ఈ ఏడాది చివరిలోగా ఒకసారి మాత్రమే వడ్డీరేటు తగ్గించే అవకాశం ఉందని పోవెల్ చెప్పారు. జూన్-ఆగస్టు మధ్య కూడా రిటైల్ ద్రవ్యోల్బణం ఇలానే తక్కువ స్థాయిలో కొనసాగితే, సెప్టెంబరు సమావేశంలో ఫెడ్ తప్పకుండా వడ్డీరేట్లు తగ్గించే అవకాశం ఉందని మార్కెట్ నిపుణుల అంచనా.

ఏడాది కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: ఆహార వస్తువుల ధరలు స్వల్పంగా తగ్గడంతో దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మే నెలలో ఏడాది కనిష్ఠ స్థాయి 4.75 శాతానికి దిగివచ్చింది. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గత ఏడాది మేలో నమోదైన 4.31 శాతం తర్వాత తిరిగి కనిష్ఠ స్థాయిని నమోదు చేయడం ఇదే ప్రథమం. గత నెలలో ఇది 4.83 శాతం ఉంది. ఆహార వస్తువుల విభాగంలో ధరలు ఏప్రిల్‌తో పోల్చితే 8.70 శాతం నుంచి 8.69 శాతానికి తగ్గాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో నమోదైన 5.1 శాతం నుంచి ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గుతూ వస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.5 శాతానికి తగ్గుతుందని ఆర్‌బీఐ అంచనా.

హైదరాబాద్‌లో ఒలింపస్ ఓడీసీ కేంద్రం

హైదరాబాద్: హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరనుంది. మెడికల్ టెక్నాలజీలో ప్రముఖ అంతర్జాతీయ సంస్థగా పేరొందిన ఒలింపస్ కార్పొరేషన్ హైదరాబాద్‌లో తన ఆర్ అండ్ డీ ఆఫ్‌షోర్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఓడీసీ) ఏర్పాటు చేయనుంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థతో కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా ఒలింపస్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రులు డీ శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట రెడ్డి సమక్షంలో ఒలింపస్ కార్పొరేషన్ గ్లోబల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆర్ అండ్ డీ) సయ్యద్ నవీద్ ఈ విషయం ప్రకటించారు. మరోవైపు ఈ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ హైదరాబాద్‌లో ఒలింపస్ కస్టమర్ల కోసం డెడికేటెడ్ ప్రొడక్ట్ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం వచ్చే నెలాఖరుకల్లా కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. ఈ కేంద్రం ద్వారా అమెరికా, యూరప్, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాల్లోని ఒలింపస్ కస్టమర్లకు అధునాతన వైద్య సేవలు అందిస్తారు.

నిఫ్టీ సరికొత్త రికార్డు

ముంబై: మార్కెట్ రెండు రోజుల వరుస నష్టాల నుంచి బయట పడింది. నిఫ్టీ సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. ఇంట్రాడేలో 177 పాయింట్లకు పైగా పెరిగి 23,441.95 పాయింట్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 58.10 పాయింట్ల లాభంతో 23,322.95 వద్ద మరో జీవితకాల గరిష్ఠ స్థాయిలో స్థిరపడింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 594 పాయింట్ల వరకు పెరిగి 77,050 వద్దకు ఎగబాకినప్పటికీ ఆఖరి గంటలో లాభాల స్వీకరణ కారణంగా వృద్ధిని 150 పాయింట్లకే పరిమితం చేసుకుని 76,606.57 వద్ద క్లోజైంది.

వచ్చే ఏడాది మార్కెట్ మహా పతనం?

యూఎస్ ఆర్థికవేత్త హ్యారీ డెంట్ హెచ్చరిక

వచ్చే ఏడాది అమెరికన్ స్టాక్ మార్కెట్ భారీగా పతనం కావచ్చని, అది 2008 ఆర్థిక సంక్షోభ సమయంలో జరిగిన మార్కెట్ క్రాష్ కంటే దారుణంగా ఉండవచ్చని ఆ దేశ ప్రముఖ ఆర్థికవేత్త, రచయిత హ్యారీ డెంట్ హెచ్చరించారు. ప్రస్తుతం యూఎస్ స్టాక్ మార్కెట్లో ఇదివరకెన్నడూ లేనంత పెద్ద బుడగ (బబుల్) ఏర్పడుతోందని, వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఎప్పుడైనా అది పేలవచ్చని ఫాక్స్ న్యూస్ డిజిటల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డెంట్ అభిప్రాయపడ్డారు. రాబోయే మార్కెట్ క్రాష్‌లో ఎస్ అండ్ పీ సూచీ 86 శాతం, నాస్‌డాక్ 92 శాతం మేర క్షీణించవచ్చని.. అమెరికన్ స్టాక్ మార్కెట్ కొత్త హీరోగా అవతరించిన ఎన్‌విడియా షేరు గరిష్ఠ స్థాయి నుంచి 98 శాతం మేర పతనం కావచ్చని డెంట్ అంచనా వేశారు. అమెరికా స్టాక్ సూచీలు కుప్పకూలితే భారత్ సహా ప్రపంచ మార్కెట్లూ భారీ పతనాన్ని చవిచూడాల్సి రావచ్చు.

ప్రపంచ టాప్-100 బ్రాండ్లలో నాలుగు భారత కంపెనీలు

- టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్‌లకు చోటు
- కాంటార్ బ్రాండ్జ్ రిపోర్టు వెల్లడి

న్యూఢిల్లీ: ప్రపంచంలోని అత్యంత విలువైన 100 బ్రాండ్ల జాబితాలో భారత్ నుంచి నాలుగు కంపెనీలకు చోటు దక్కింది. దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ 46వ స్థానంలో నిలవగా ప్రైవేట్ బ్యాంకింగ్ సేవల దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 47వ స్థానంలో ఉంది. టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్ 73వ స్థానంలో, ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ 74వ స్థానంలో ఉన్నాయి. అంతేకాదు, అత్యంత విలువైన గ్లోబల్ బీ2బీ టెక్నాలజీ బ్రాండ్ల లిస్ట్‌లో ఇన్ఫీ 20వ స్థానాన్ని దక్కించుకుంది. అంతర్జాతీయ మార్కెటింగ్ డేటా అండ్ అనలిటిక్స్ కంపెనీ కాంటార్ బ్రాండ్జ్ ఈ ఏడాదికిగాను విడుదల చేసిన మోస్ట్ వేల్యువబుల్ గ్లోబల్ బ్రాండ్స్ రిపోర్టు ఈ విషయాన్ని వెల్లడించింది.

కంపెనీ	బ్రాండ్ విలువ (కోట్ల డాలర్లు)
టీసీఎస్	4,479.0
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	4,326.0
ఎయిర్‌టెల్	2,526.3
ఇన్ఫోసిస్	2,468.6



ట్రిలియన్ డాలర్ బ్రాండ్ యాపిల్

ప్రపంచంలోని అత్యంత విలువైన బ్రాండ్‌గా అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం, ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ అగ్రస్థానంలో నిలిచింది. అంతేకాదు, ప్రపంచంలో లక్ష కోట్ల డాలర్ల బ్రాండ్ విలువ కలిగిన తొలి సంస్థగా యాపిల్ మరో రికార్డును సైతం సృష్టించింది. కాంటార్ రిపోర్టు ప్రకారం.. యాపిల్ బ్రాండ్ వేల్యూ 1,01,590 కోట్ల డాలర్లుగా నమోదైంది. కాగా గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెక్‌డొనాల్డ్స్ టాప్ 5 స్థానాల్లో ఉన్నాయి.

Infosys | HDFC BANK We understand your world | airtel

ప్రపంచంలో అత్యంత బలమైన హోటల్ బ్రాండ్ తాజ్

ఆతిథ్య రంగానికి చెందిన తాజ్ బ్రాండ్.. ప్రపంచంలోనే అత్యంత బలమైన హోటల్ బ్రాండ్‌గా నిలిచింది. మార్కెట్ రీసెర్చ్ కంపెనీ బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన 'హోటల్స్ 50 : 2024' జాబితా ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ రిపోర్టు ప్రకారం.. తాజ్ బ్రాండ్ విలువ వార్షిక ప్రాతిపదికన 45 శాతం పెరిగి 54.5 కోట్ల డాలర్లకు చేరుకుంది. బ్రాండ్ శక్తి సూచీలో తాజ్‌కు 100కు 92.9 పాయింట్లు లభించాయి. అంతేకాదు, అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న హోటల్స్ బ్రాండ్లలో తాజ్ రెండో స్థానంలో నిలిచిందని బ్రాండ్ ఫైనాన్స్ తెలిపింది.

డిపాజిట్ రేట్లు తగ్గాల్సిందే : ఖారా

న్యూఢిల్లీ: దేశంలో డిపాజిట్లపై వడ్డీరేట్లు ఇప్పటికే పతాక స్థాయికి చేరాయని, మధ్యకాలికంగా తగ్గుముఖం పట్టక తప్పదని ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ కుమార్ ఖారా అన్నారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నుంచి ఆర్‌బీఐ రెపోరేట్ల తగ్గింపు ప్రారంభించవచ్చునని ఆయన జోస్యం చెప్పారు. అప్పటికి ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ కట్టడి పరిధిలో కనిష్ఠ స్థాయి 4 శాతానికి చేరువ కావచ్చునని ఆయన అన్నారు. గత నెలలో కొన్ని మెచ్యూరిటీలపై ఎఫ్‌డీ రేట్లను ఎస్‌బీఐ 0.75 శాతం మేరకు పెంచింది.

● ఇన్‌జెనస్‌తో డాక్టర్ రెడ్డీస్ టై అప్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పని చేసే డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ అమెరికా మార్కెట్‌లో కొత్త కేన్సర్ ఔషధాన్ని మార్కెట్ చేయనుంది. ఇందుకోసం కంపెనీ అమెరికా అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఇంక్, ఇన్‌జెనస్ ఫార్మాస్యూటికల్స్ ఎల్ఎల్‌సీ అనే కంపెనీతో ఒక లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఇన్‌జెనస్ ఫార్మా తయారు చేసే సైక్లోఫాస్ఫామైడ్ అనే ఇంజెక్షన్‌ను డాక్టర్ రెడ్డీస్ అమెరికాలో మార్కెట్ చేస్తుంది. డాక్టర్ రెడ్డీస్ ఈ అమ్మకాలపై వచ్చే లాభంలో 50 శాతాన్ని ఇన్‌జెనస్ ఫార్మా కంపెనీకి రాయల్టీగా చెల్లిస్తుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,160 ▲	66,150 ▲	95,800 ▲
ముంబై	71,580 ▲	65,570 ▲	88,190 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ

హైదరాబాద్	530	విజయవాడ	530
వరంగల్	532	గోదావరి	525
చిత్తూరు	593	విశాఖపట్నం	530

డజను గుడ్లు రూ. 72



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	133	గోదావరి	139
వరంగల్	133	విజయవాడ	139
కరీంనగర్	133	గుంటూరు	141
మహబూబ్‌నగర్	133	ఒంగోలు	141
కర్నూలు	133	చిత్తూరు	145
విశాఖపట్నం	133		





ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత ప్రధాని మోదీ, గవర్నర్ నజీర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల గ్రూప్ ఫొటో

కొలువుతీరిన కొత్త మంత్రులు

కొణిదెల పవన్ కల్యాణ్

పిఠాపురం



సినిమాల్లో ఎంత బిజీగా ఉన్నా తనకు ఉన్న రాజకీయ ఆసక్తిని ఎక్కడా దాచుకోని పవర్ స్టార్.. పవన్ కల్యాణ్. 2009లో అన్న చిరంజీవి ప్రజా రాజ్యం స్థాపించినప్పుడు, యువరాజ్యం బాధ్యతలు తీసుకున్నారు. 2014లో జనసే నను స్థాపించారు. ఆ ఎన్నికల్లో పోటీచేయకుండా టీడీపీ కూటమికి మద్దతు ఇచ్చారు. 2019లో పోటీచేసిన భీమవరం, గాజువాకల్లో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో జనసేనకు ఒక సీటు దక్కింది. అయినా... ఆయన తన పోరాటం ఆపలేదు. 2024 జగన్ వ్యతిరేక ఓటు చీలనివ్వను అని చెప్పి మరీ కూటమి కట్టారు. 21 అసెంబ్లీ, 2 ఎంపీ సీట్లను వందశాతం స్ట్రైక్ రేట్‌తో గెలుచుకున్నారు. పవన్ కల్యాణ్ మంత్రిగా తొలిసారి ప్రమాణం చేశారు.

కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి



అన్నయ్య మాటే అచ్చెన్నకు వేదం. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని బీఎస్సీని మధ్యలో ఆపివేసి 1995లో రాజకీయాల్లోకి వచ్చారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత ఎర్రన్నాయుడు తమ్ముడిగా టీడీపీలోకి వచ్చిన ఆయనను చంద్రబాబు ప్రోత్సహించారు. ఎర్రన్నాయుడు మరణం తర్వాత పార్టీ, ప్రభుత్వంలో అచ్చెన్నకు ప్రాధాన్యం పెంచారు. టీడీపీ ప్రభుత్వంలో రవాణా, కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు. వైసీపీ ప్రభుత్వంలో అక్రమకేసులను ధైర్యంగా ఎదుర్కొంటూ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా పార్టీని నిలబెట్టారు. అచ్చెన్నను మరోసారి తన కేబినెట్‌లోకి చంద్రబాబు తీసుకున్నారు. అచ్చెన్నాయుడుకు భార్య విజయమాధవి, కుమారులు కృష్ణమోహన్, తనూజ్ ఉన్నారు.

నారా లోకేశ్

మంగళగిరి



టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ వారసుడిగా నారా లోకేశ్ రాజకీయాల్లోకి వచ్చారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ చదివారు. ఉమ్మడి గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రిగా పనిచేశారు. మంగళగిరిలో ఐటీ పార్కును ఏర్పాటు చేయించి పలు ఐటీ కంపెనీలను ఈ ప్రాంతానికి తీసుకొచ్చారు. మంగళగిరిని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేశారు. 2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసి లోకేశ్ ఓడిపోయారు. తాజా ఎన్నికల్లో 91,500 ఓట్ల రికార్డు మెజారిటీతో ఘనవిజయం సాధించారు.

కొల్లు రవీంద్ర

మచిలీపట్నం



మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావుకు కొల్లు రవీంద్ర అల్లుడు. బీఏ, ఎల్‌ఎల్‌బీ చదివారు. 2005లో టీడీపీ డివిజన్ అధ్యక్షుడిగా రాజకీయ ప్రవేశం చేశారు. 2007లో కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో మచిలీపట్నం నుంచి గెలుపొందారు. చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2019లో మచిలీపట్నం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తాజా ఎన్నికల్లో మచిలీపట్నం నుంచే టీడీపీ అభ్యర్థిగా 50,242 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. టీడీపీ బీసీ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

నాదెండ్ల మనోహర్

తెనాలి



నాదెండ్ల మనోహర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసన సభ స్పీకర్‌గా పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కుమారుడు. 2004లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. తొలిసారిగా 2004 ఎన్నికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తెనాలి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. 2009లోనూ విజయాన్ని దక్కించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా పనిచేశారు. 2019 ఎన్నికలకు ముందు జనసేనలో చేరారు. 2019లో తెనాలి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. తాజా ఎన్నికల్లో తెనాలి నుంచి జనసేన తరఫున విజయం సాధించారు. తెనాలి ఎన్నికల చరిత్రలో ఎవరికీ దక్కనంతగా 48,112 ఓట్ల మెజారిటీ సాధించారు.

పి.నారాయణ

నెల్లూరు సిటీ



నెల్లూరు నగర ఎమ్మెల్యేగా గెలిచిన పొంగూరు నారాయణ రాజకీయాల్లోకి రాకముందు లెక్చరర్‌గా పనిచేశారు. నారాయణ విద్యా సంస్థల చైర్మన్‌గా ఎదిగారు. టీడీపీతో సుదీర్ఘకాలం అనుబంధం ఉంది. 2014కు ముందు తెరవెనుక ఉంటూ పార్టీ నిర్మాణంలో, ఎన్నికల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారు. చంద్రబాబుకు అత్యంత విశ్వసనీయుడిగా, పార్టీకి తలలో నాలుకలా గుర్తింపు పొందారు. 2014లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టి చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. శాసనమండలికి ప్రాతినిధ్యం వహించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖతో పాటు సీఆర్‌డీఏ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

వంగలపూడి అనిత

పాయకరావుపేట



ఒకప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయిని. రాజకీయాలపై ఆసక్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి 2013లో టీడీపీలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి మంత్రి అయ్యారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఏకైక మంత్రిగా పాయకరావుపేట ఎమ్మెల్యే, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత స్థానం దక్కించుకున్నారు. 2014 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో కొవ్వూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత నుంచి పాయకరావుపేట ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా వెరవకుండా సమస్యలపై పోరాడారు.

సత్యకుమార్ యాదవ్

ధర్మవరం



సత్యకుమార్ యాదవ్ తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రి పదవి దక్కించుకున్నారు. మదురై కామరాజ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. చెన్నైలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశారు. ప్రస్తుతం వెంకటేశ్వర యూనివర్సిటీలో లా కోర్సు చేస్తున్నారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో పనిచేశారు. అనంతరం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వద్ద కార్యదర్శిగా పనిచేశారు. 2018లో బీజేపీ జాతీయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బీజేపీ వ్యవహారాల సహ ఇన్‌చార్జిగా, అండమాన్ నికోబార్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ధర్మవరం నుంచి బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు.

నిమ్మల రామానాయుడు

పాలకొల్లు



అలుపెరగని పోరాటాలు.. ప్రజల మనిషిగా పొదిగి, ఎదిగిన తీరు నిమ్మల రామానాయుడును మంత్రిని చేశాయి. నరసాపురం వైఎన్ కళాశాలలో అధ్యాపకునిగా ఉండగా 2012లో రామానాయుడు టీడీపీలో చేరారు. 2014, 2019, 2024లో పాలకొల్లు నుంచి టీడీపీ టికెట్‌పై పోటీచేసి గెలిచారు. టీడీపీ హయాంలో రూ.600 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు. వైసీపీ పాలనలో రాజకీయంగా ఎదురీదారు. అయినా ప్రజల్లో తెచ్చుకున్న గుర్తింపుతో అన్ని సవాళ్లూ ఆయన అధిగమించగలిగారు. పాలకొల్లును టీడీపీ కంచుకోటలా మార్చారు. చంద్రబాబు కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు.

ఎన్.ఎమ్.డి.ఫరూక్

నంద్యాల



ఎన్ఎండీ (నస్యం మహమ్మద్) ఫరూక్ టీడీపీ సీనియర్ నేత. పార్టీకి వీరవిధేయుడు. టీడీపీ ఆవిర్భావ సమయంలో ఎన్టీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. నాటి నుంచి ఇప్పటి వరకు పార్టీలోనే కొనసాగుతున్నారు. 1981లో కౌన్సిలర్‌గా గెలిచి నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. 1985 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించి మంత్రిగా పనిచేశారు. 1994, 1999 ఎన్నికల్లో నంద్యాల నుంచి గెలిచిన ఫరూక్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా పనిచేశారు. 2017లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి దక్కించుకోవటమే కాకుండా మండలి చైర్మన్ పదవి చేపట్టారు. 2018 నవంబరులో మరోసారి మంత్రి పదవి వరించింది. తాజా కేబినెట్‌లో చోటు దక్కింది.

ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు



నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి విజయం సాధించిన ఆనం రామనారాయణరెడ్డి ఆరోసారి మంత్రి పదవి దక్కించుకున్నారు. 1983లో ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1983, 1985, 1999, 2004, 2009, 2019, 2024లో నెల్లూరు సిటీ, రాపూరు, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1985లో ఎన్టీఆర్ కేబినెట్‌లో రహదారులు, భవనాల శాఖా మంత్రిగా పనిచేశారు. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. 2009లోనూ మంత్రి పదవి దక్కించుకున్నారు. 2012లో ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

పయ్యావుల కేశవ్

ఉరవకొండ



అనంతపురం జిల్లా ఉరవకొండలో గెలిచిన పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాబోదనే అభిప్రాయం ఉంది. దీనిని బ్రేక్ చేసి ఉరవకొండలో గెలవడమే కాకుండా, మంత్రివర్గంలోనూ పయ్యావుల కేశవ్ చోటు దక్కించుకున్నారు. ఎన్టీఆర్ పిలుపుతో కేశవ్ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1994, 2004, 2009 ఎన్నికల్లో ఉరవకొండ నుంచి వరుస విజయాలు అందుకున్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఓడారు. 2015లో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా ఎన్నికై, ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేశారు. 2019, 2024 ఎన్నికల్లో వరుస విజయాలను అందుకున్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన పయ్యావులకు తొలిసారి మంత్రి పదవి దక్కింది.

అనగాని సత్యప్రసాద్

రేపల్లె



అనగాని సత్యప్రసాద్ టీడీపీ తరఫున ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె నుంచి 2014, 2019, 2024లో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. మాజీ మంత్రి అనగాని భగవంతరావు సోదరుడు అనగాని రంగారావు కుమారుడు. బీఎస్సీ కంప్యూటర్స్ చదివారు. గతంలో 2009 ఎన్నికల్లో టీడీపీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి మోపిదేవి వెంకటరమణారావు చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత మూడు ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. వెనుకబడిన వర్గాలకు చెందిన అనగాని సత్యప్రసాద్ చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం సంపాదించారు. రాజకీయాల్లోకి రాకముందు హోటళ్ల వ్యాపారం నిర్వహించేవారు.

కొలుసు పార్థసారథి

నూజివీడు



కృష్ణా జిల్లా మొవ్వ సమీపంలోని కారకంపాడు గ్రామంలో 1956 ఏప్రిల్ 18న సాధారణ రైతు కుటుంబంలో కొలుసు పార్థసారథి జన్మించారు. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించారు. ఆయన తండ్రి కేపీ రెడ్డయ్య. 1991 నుంచి 1996 వరకు మచిలీపట్నం ఎంపీగా రెడ్డయ్య బాధ్యతలు నిర్వహించారు. ఆయన వారసుడిగా పార్థసారథి 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు. 2009,2019లో పెనమలూరు నుంచి గెలుపొందారు. వైఎస్, కిరణ్ కుమార్ సర్కార్‌లలో మంత్రిగా పనిచేశారు. 2024లో వైసీపీ టికెట్ ఇవ్వకపోవడంతో తెలుగుదేశం పార్టీలో చేరి నూజివీడు నుంచి గెలిచి మళ్లీ మంత్రివర్గంలో చేరారు. ఆయనకు భార్య కమలలక్ష్మి, కుమారుడు నితిన్‌కృష్ణ ఉన్నారు.

డోలా బాలవీరాంజనేయస్వామి

కొండపి



ప్రభుత్వ వైద్యునిగా ఉన్న డోలా బాలవీరాంజనేయ స్వామికి అనూహ్యంగా రాజకీయ అవకాశం లభించింది. స్వామి కుటుంబం విధేయంగా ఉండే మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు పోటీచేస్తున్న కొండపిని 2009లో ఎస్సీ రిజర్వుడుగా ప్రకటించారు. అప్పటికే వైద్యునిగా పనిచేస్తున్న స్వామిని టీడీపీ అభ్యర్థిగా దామచర్ల కుటుంబం నిలిపింది. ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. అయినా.. రాజకీయాల నుంచి వెనక్కిపోలేదు. 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా గెలిచారు. వైసీపీ ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేసినా అసెంబ్లీలోనూ, బయట ధైర్యంగా నిలబడ్డారు. అందుకు కానుకగా మంత్రి పదవిని పొందారు.

గొట్టిపాటి రవి కుమార్

అద్దంకి



వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం... ఆర్థిక మూలాలపై జగన్ ఎంత దెబ్బకొట్టాలని చూసినా, రాజకీయంగా స్థిరంగా నిలబడిన తెగువ.. ఈ రెండే అర్హతలుగా చంద్రబాబు మంత్రివర్గంలో రవికుమార్ చేరారు. తండ్రి హనుమంతరావు వారసుడిగా 2004లో కాంగ్రెస్‌లో చేరారు. తొలుత మార్టూరు, ఆ తర్వాత నుంచి అద్దంకిలో గెలుస్తూ వస్తున్నారు. వైఎస్ మరణానంతరం జగన్ వెంట నడిచిన రవికుమార్ 2014లో వైసీపీ తరఫున పోటీచేసి గెలిచారు. మారిన రాజకీయ పరిణామాలతో 2015లో టీడీపీలో చేరి.. ఆ తర్వాత నుంచి ఆ పార్టీ తరఫునే గెలుస్తూ వస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో తొలిసారి మంత్రి పదవి వరించింది.

గుమ్మడి సంధ్యారాణి

సాలూరు



గుమ్మిడి సంధ్యారాణి గతంలో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఆమె తండ్రి జన్ని ముత్యాలు 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సాలూరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన రాజకీయ వారసురాలిగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1999లో ఉమ్మడి విజయనగరం జిల్లా సాలూరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తొలిప్రయత్నంలో ఓటమి చవిచూశారు. 2009లో టీడీపీలో చేరి సాలూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో అరకు ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 2015లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత పార్టీ పొలిట్‌బ్యూరోలో స్థానం దక్కింది. తాజా ఎన్నికల్లో సాలూరు నుంచి వైసీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొరపై విజయం సాధించారు.

బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె



ఉమ్మడి కర్నూలు జిల్లా బనగానపల్లెకు చెందిన బీసీ జనార్దన్‌రెడ్డి మొదట వ్యాపారవేత్త. స్థానిక నేత కాటసాని రామిరెడ్డి ఆగడాలకు చెక్ పెట్టేందుకు రాజకీయ రంగప్రవేశం చేశారు. 2011లో చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2014 ఎన్నికల్లో బనగానపల్లె నుంచి పోటీ చేసిన మొదటిసారే బలమైన ప్రత్యర్థి కాటసాని రామిరెడ్డిపై గెలిచారు. ఆ ఎన్నికల్లో నంద్యాల పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి కావడం విశేషం. 2019 ఎన్నికల్లో వైసీపీ గాలి వీయడంతో కాటసాని చేతిలో ఓటమి పాలయ్యారు. తాజా ఎన్నికల్లో చిరకాల ప్రత్యర్థి కాటసానిపై గెలుపొంది మంత్రి అయ్యారు.

కందుల దుర్గేశ్

నిడదవోలు



రాజమండ్రి రూరల్ నుంచి కందుల దుర్గేశ్‌ను జనసేన నిలపాలనుకుంది. పొత్తు ధర్మంలో భాగంగా నిడదవోలుకు ఆయన సీటు మారింది. అయినా.. మంచి మెజారిటీతో గెలిచిన దుర్గేశ్‌ను మంత్రి పదవి కూడా వరించింది. ఆయనకు బలమైన రాజకీయ నేపథ్యం ఉంది. తాత వీరభద్రరావు కాంగ్రెస్‌లో ఒక వెలుగు వెలిగారు. ఆయన వారసుడిగా దుర్గేశ్ 2007 నుంచి 2013 వరకూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీగా పనిచేశారు. 2018లో జనసేనలో చేరి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పార్టీ పట్ల వినమ్రత, అధినేత పట్ల విధేయతలకు గుర్తింపుగా మంత్రి పదవి దుర్గేశ్‌కు దక్కింది.

టీజీ భరత్

కర్నూలు



టీజీ భరత్ ఇంగ్లండ్‌లో ఎంబీఏ చేశారు. టీజీవీ గ్రూప్స్ జూనియర్ చైర్మన్‌గా, యువ పారిశ్రామికవేత్తగా, వ్యాపార రంగాల్లో చురుకైన పాత్ర పోషించారు. మాజీ మంత్రి టీజీ వెంకటేశ్ రాజకీయ వారసుడిగా 2019లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టి కర్నూలు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తాజా ఎన్నికల్లో కర్నూలు నుంచే పోటీ చేసి విజయం సాధించారు. చంద్రబాబు మంత్రి వర్గంలో స్థానం దక్కించుకున్నారు. కర్నూలు జిల్లా నుంచి ఇప్పటి వరకు మంత్రులుగా పని చేసిన వారిలో అతి చిన్న వయస్కుడు టీజీ భరత్ (48) కావడం విశేషం. తమ కంపెనీల తరఫున రూ.కోట్లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎస్.సవిత

పెనుకొండ



ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుకొండ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బీసీ కురుబ సామాజికవర్గానికి చెందిన సవిత తొలి ప్రయత్నంలోనే మంత్రి పదవి దక్కించుకున్నారు. తండ్రి రామచంద్రారెడ్డి మంత్రిగా పనిచేశారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పటి నుంచి ఆయన పార్టీలో ఉన్నారు. 1983లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పట్లో మంత్రిగా ఆయనకు ఏకంగా 14 శాఖలను కేటాయించారు. 1996లో హిందూపురం ఎంపీగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి సవిత టీడీపీలో చురుకైన కార్యకర్తగా వ్యవహరిస్తున్నారు. 2019లో ఆంధ్రప్రదేశ్ కురుబ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వాసంశెట్టి సుభాష్

రామచంద్రాపురం



శెట్టిబలిజ యువనేత వాసంశెట్టి సుభాష్. తన రాజకీయ గమనాన్ని మార్చుకుని కేవలం మూడు నెలల్లోనే ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగారు. జగన్ హయాంలో మంత్రిగా పని చేసిన పినిపే విశ్వరూప్ ప్రధాన అనుచరుల్లో సుభాష్ ఒకరిగా ఉండేవారు. అయితే, అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేరు మార్పు వ్యవహారం వారిద్దరి మధ్య స్పర్థలను పెంచింది. ఎన్నికలకు మూడు నెలల ముందే టీడీపీలో సుభాష్ చేరారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్‌పై పోటీచేసి అత్యధిక మెజారిటీతో గెలిచారు. చంద్రబాబు మంత్రివర్గంలో కోనసీమ నుంచి సుభాష్‌కు మాత్రమే స్థానం దక్కడం విశేషం. ఆయనకు భార్య లక్ష్మీసునీత, కవల పిల్లలు సత్య దివిత, సత్య దీక్షిత ఉన్నారు.

కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం



కొండపల్లి శ్రీనివాసరావు రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. అమెరికాలో కంప్యూటర్ సైన్స్‌లో పీజీ చేశారు. అక్కడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి, ఐదేళ్ల క్రితం తిరిగొచ్చారు. రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగంలో ఉన్నారు. పలు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టారు. తాత కొండపల్లి పైడితల్లినాయుడు విజయనగరం జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. బొబ్బిలి ఎంపీగా మూడు పర్యాయాలు టీడీపీ నుంచి గెలుపొందారు. తండ్రి కొండలరావు గంట్యాడ ఎంపీపీగా పనిచేశారు. వైసీపీలో ఉన్న కొండలరావు, శ్రీనివాసరావు ఎన్నికలకు మూడు నెలల ముందు టీడీపీలో చేరారు. గజపతినగరం నుంచి శ్రీనివాసరావు విజయం సాధించారు.

మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి



రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి యువనేతగా పేరు తెచ్చుకున్నారు. 2012 ఉపఎన్నికలో కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2014లో జై సమైక్యాంధ్ర తరఫున పోటీచేసినా విజయం దక్కలేదు. ఆ తర్వాత వైసీపీలో చేరి, 2019 ఎన్నికల్లో ఆ పార్టీ కోసం పనిచేశారు. రాజకీయంగా అక్కడ ఇమడలేక టీడీపీలో చేరారు. 2024 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డిని ఓడించి, తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. బోనస్‌గా ఆయనకు మంత్రి పదవి కూడా లభించింది. రాయచోటి చరిత్రలోనే తొలి మంత్రిగా రికార్డు సాధించారు. ఆయనకు భార్య హరిత, పిల్లలు నిశ్చల్ నాగిరెడ్డి, నాగ వైష్ణవిరెడ్డి ఉన్నారు.


ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న చంద్రబాబు, పక్కన పవన్


మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత తన తల్లి భువనేశ్వరికి పాదాభివందనం చేస్తున్న లోకేశ్




ప్రమాణ స్వీకార కార్యక్రమం తర్వాత మోదీకి నమస్కరిస్తున్న మంత్రులు లోకేశ్, నాదెండ్ల, అచ్చెన్న, అనిత తదితరులు

అంగరంగ వైభవంగా ప్రమాణం

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడి ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ సహా అనేక మంది ప్రముఖుల నడుమ కొత్త సర్కారు కొలువు తీరింది. గన్నవరం సమీపంలోని ఐటీ పార్క్ వద్ద ముఖ్యమంత్రి, మంత్రులచేత గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు ప్రమాణ స్వీకారం ముహూర్తం! కానీ... ఆరు నిమిషాలు ఆలస్యంగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాని మోదీ, జనసేన అధిపతి పవన్ కల్యాణ్ తదితర ప్రముఖులతో కలిసి చంద్రబాబు వేదిక పైకి వచ్చారు. నిబంధనల ప్రకారం ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ నిర్వహించారు. జాతీయ గీతాలాపన అనంతరం... చంద్రబాబుతో ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రారంభమైంది. "నారా చంద్రబాబు నాయుడు అనే నేను" అనగానే సభా ప్రాంగణం మొత్తం హర్షధ్వానాలతో దద్దరిల్లింది. అభిమానులు, ప్రజలు, కార్యకర్తలు కుర్చీల్లోంచి లేచి నిల్చుని చప్పట్లతో తమ ఆనందం వ్యక్తం చేశారు. ఆయన ప్రమాణ స్వీకారం పూర్తయేదాకా చప్పట్లు మోగుతూనే ఉన్నాయి. నందమూరి, నారా కుటుంబ సభ్యులు తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. నందమూరి రామకృష్ణ మరింత పిడికిలి బిగించిన చెయ్యి పైకెత్తి తన ఉద్వేగం, ఉత్సాహం ప్రదర్శించారు. చంద్రబాబు గంభీరమైన స్వరం, గర్జన తరహాలో ప్రమాణ పాఠాన్ని చదివారు. కొన్ని పదాలను ప్రత్యేకంగా నొక్కి పలికారు. ప్రమాణ స్వీకారం అనంతరం చంద్రబాబు నేరుగా నరేంద్ర మోదీ వద్దకు వెళ్లి అభివాదం చేశారు. మోదీ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని భుజం తట్టారు. ఆ సమయంలో ఇటు ప్రధాని, అటు చంద్రబాబులో హుషారు, ఆనందం తొణికిసలాడాయి. అనంతరం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులకు చంద్రబాబు నమస్కారం చేశారు. అక్కడ నుంచి నేరుగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు అమిత్ షా, నడ్డా, నితిన్ గడ్కరీ, చిరాగ్ పాశ్వాన్, అనుప్రియ పటేల్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, మెగాస్టార్ చిరంజీవి, తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ దంపతులు, ఇతర అతిథులకు అభివాదం చేశారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని ప్రతి ఒక్కరూ కళ్లు అర్పకుండా చూశారు. 'ఇదే కదా మేం కోరుకున్నది. ఈ క్షణం కోసమే వేచి ఉన్నది' అనే ఆనందం అందరిలో కనిపించింది.

పవన్ ప్రమాణం...

చంద్రబాబు అనంతరం ప్రాధాన్య క్రమంలో జనసేన అధిపతి పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేశారు. 'కొణిదెల పవన్ కల్యాణ్ అనే నేను' అంటూ పవన్ పలకగానే సభావేదిక మొత్తం ఒక్కసారిగా హోరెత్తింది. పదేళ్ల కష్టం, గత ఐదేళ్ల పోరాటానికి ఫలితం దక్కిందనే ఆనందం జనసైనికుల్లో తాండవించింది. కొన్ని నిమిషాలపాటు ఈలలు, కేరింతలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. ఆయన ప్రమాణ స్వీకారం పూర్తి చేసిన వెంటనే మోదీ వద్దకు వెళ్లి నమస్కారం చేశారు. అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు నమస్కారం చేశారు. పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. అక్కడ నుంచి పవన్ నేరుగా విశిష్ట అతిథుల వద్దకు వెళ్లి అభివాదం చేశారు. వేదికపైనే ఉన్న తన అన్నయ్య మెగాస్టార్ చిరంజీవికి పాదాభివందనం చేశారు. తమ్ముడిని అన్నయ్య ఆప్యాయ ఆలింగనం చేసుకున్నారు. సభా ప్రాంగణంలో ఆసీనులైన 'మెగా ఫ్యామిలీ' మొత్తం ఈ క్షణాలను ఆనందంగా ఆస్వాదించింది.

నారా లోకేశ్ అనే నేను...

చంద్రబాబు, పవన్ తర్వాత నారా లోకేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పోడియం వద్దకు రాగానే కార్యకర్తలు, నాయకులు హర్షధ్వానాలతో హోరెత్తించారు. ఆ సమయంలో లోకేశ్ సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. నందమూరి, నారా కుటుంబ సభ్యులు ఉద్వేగంగా కనిపించారు. లోకేశ్ తర్వాత కింజరాపు అచ్చెన్నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. కొల్లు రవీంద్ర ప్రమాణ స్వీకార సమయంలో కాస్త హడావిడిగా కనిపించారు. గవర్నర్‌తో సంబంధం లేకుండా ఆయన ముందుగానే రాజ్యాంగ ప్రమాణ పత్రాన్ని చదవడం ప్రారంభించారు. దీంతో వెంటనే మైక్ కట్ చేశారు. ఆ తర్వాత గవర్నర్ అనుమతితో ప్రమాణం పూర్తి చేశారు. అనంతరం జనసేన పార్టీ ఎమ్మెల్యేల నాదెండ్ల మనోహర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ప్రశాంతంగా ప్రమాణ పత్రాన్ని చదివారు. ఆ తర్వాత మోదీ, చంద్రబాబుకు నమస్కారం చేశారు. పవన్ కల్యాణ్ ఆయనను ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు. ఆ తర్వాత... నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత వరుసగా వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, ఎన్ఎండీ ఫరూక్, ఆనం రామనారాయణ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, డోల బాల వీరాంజనేయులు, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్దన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. వీరంతా తెలుగులో 'దేవుడి సాక్షిగా' ప్రమాణస్వీకారం చేశారు. ఫరూక్ 'అల్లా సాక్షి'గా అని ప్రమాణం చేశారు. కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ ఇంగ్లిష్‌లో ప్రమాణం చేశారు. అనంతరం సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రతి ఒక్కరూ ప్రమాణస్వీకారం అనంతరం మోదీ, చంద్రబాబు, గవర్నర్ ఆశీర్వాదాలు తీసుకున్నారు.



కొత్త మంత్రుల మాట..!

చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయను: నిమ్మల

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ప్రజల ఆశీస్సులతో వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తాను చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయలేదని, అదే రీతిలో మంత్రి బాధ్యతలు కూడా నిర్వర్తిస్తానని కొత్తగా మంత్రి పదవి దక్కించుకున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ సమష్టి కృషి వల్లే కూటమికి ఇంతటి ఘన విజయం దక్కిందన్నారు. చంద్రబాబు లాంటి పరిపాలన దక్షత కలిగిన వారి నాయకత్వంలో రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచేలా అందరం కృషి చేస్తామని చెప్పారు.

బాధ్యత మరింత పెరిగింది: పయ్యావుల కేశవ్

ప్రజలిచ్చిన తీర్పుతో పాటు టీడీపీ మరింత బాధ్యతను తనపై ఉంచిందని, చంద్రబాబు, ప్రజల నమ్మకాన్ని వమ్ముకానివ్వకుండా రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తానని ఉరవకొండ ఎమ్మెల్యే, నూతన మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. 30 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో తొలిసారి తనకు మంత్రి పదవి దక్కడం అనేది భావోద్వేగానికి సంబంధించిన అంశమన్నారు. ఉరవకొండ ప్రజలు, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీలో శ్రమకు తగ్గ ఫలితం ఉంటుంది: అనిత

టీడీపీలో శ్రమకు దగ్గ ఫలితం ఉంటుందని, ఇక్కడ పదవులకు పైరవీలు అవసరం లేదని.. పాయకరావుపేట ఎమ్మెల్యే, తొలిసారిగా మంత్రిగా ఎంపికైన వంగలపూడి అనిత అన్నారు. పేద, మధ్యతరగతికి చెందిన తమకు లభించిన పదవులే అందుకు తార్కాణమని చెప్పారు. నిజంగా తన కష్టానికి తగ్గ ఫలితం లభించిందని, ఇదే సమయంలో తమపై బాధ్యత కూడా పెరిగిందని అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. పాయకరావుపేటకు ఇప్పటి వరకు మంత్రి పదవి రాలేదని, ఇదే తొలిసారని చెప్పారు.

ఎన్ని జన్మలెత్తినా బాబు రుణం తీర్చుకోలేను: సంధ్యారాణి

వెనుకబడిన ప్రాంతానికి చెందిన ఒక గిరిజన మహిళకు మంత్రి పదవి ఇచ్చిన చంద్రబాబు రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేమని సాలూరు ఎమ్మెల్యే, నూతన మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. తమ నియోజకవర్గం పూర్తిగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతమని, ఇప్పటికీ అక్కడ ఆస్పత్రులు, తాగునీరు లేదని చెప్పారు. బాబు ఆశీస్సులతో గిరిజన ప్రాంతంలోని ఐదు ఎస్టీ నియోజకవర్గాలను కూటమి అభ్యర్థులు గెలుచుకున్నామన్నారు. పనిచేసే సత్తా ఉన్న చంద్రబాబు ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.

రాష్ట్రానికి చంద్రబాబు విజన్ అవసరం: పార్థసారథి

ఒక మంచి వ్యక్తి, విజన్‌తో రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచించే చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేయడం తన అదృష్టమని నూజివీడు ఎమ్మెల్యే, నూతన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబు విజన్, అనుభవం, పవన్ కల్యాణ్ చిత్తశుద్ధి, మోదీ సహాయ సహకారాలు కావాలనే ఉద్దేశంతో ప్రజలు ఓటేసి కూటమిని గెలిపించారని పేర్కొన్నారు. తనను ఆశీర్వదించి మంత్రి పదవి ఇవ్వడానికి సహకరించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి, లోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తా: రామ్‌ప్రసాద్‌రెడ్డి

చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం తనకు గర్వంగా ఉందని రాయచోటి ఎమ్మెల్యే, నూతన మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ అన్నారు. తనకు మంత్రి పదవి ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాను రాయచోటిలో శ్రీకాంత్‌రెడ్డి మీద కాకుండా.. జగన్ మీద గెలిచానన్నారు. తనపై గురుతరమైన బాధ్యతలు పెట్టిన రాయచోటి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తానన్నారు.

కొత్తతరానికి అందలం

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్, వాసంశెట్టి సుభాష్, ఎం.రాంప్రసాద్‌రెడ్డి, టీజీ భరత్, సవిత, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ చట్టసభలకు మొదటిసారి ఎన్నికయ్యారు. లోకేశ్, కందుల దుర్గేశ్, గుమ్మిడి సంధ్యారాణి గతంలో ఎమ్మెల్సీలుగా పనిచేశారు. ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలోకి అడుగు పెట్టడం మాత్రం ఇదే ప్రథమం. మరో 8 మంది మంత్రులు గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసినా అమాత్య పదవులు అందుకోవడం ఇదే మొదటిసారి. వీరిలో పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, నాదెండ్ల మనోహర్, గొట్టిపాటి రవి కుమార్, బీసీ జనార్దన్‌రెడ్డి గతంలో ఎమ్మెల్యేలుగా చేశారు గానీ.. మంత్రులు కాలేదు. నాదెండ్ల మనోహర్ ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా పనిచేశారు. వీరంతా ఇప్పుడు చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రులయ్యారు. ఇక కేబినెట్‌లో చోటు దక్కించుకున్న ఆనం రామనారాయణరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, పొంగూరు నారాయణ, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, లోకేశ్ గతంలోనూ మంత్రులుగా పనిచేశారు. ముఖ్యంగా ఆనం, కొలుసు గతంలో కాంగ్రెస్ మంత్రివర్గాల్లో ఉన్నారు. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న పార్టీకి భావి నాయకత్వాన్ని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా కొత్త తరానికి టీడీపీ అధినేత అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ప్రయత్నంలో కొందరు సీనియర్లు అవకాశం కోల్పోయారు. కేశవ్, గొట్టిపాటి రవికి చోటు దక్కడంతో అదే సామాజిక వర్గంలో సీనియర్ బుచ్చయ్య చౌదరికి చోటు దక్కలేదు. శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి యువ నేత సుభాష్‌కు చోటు దక్కడంతో సీనియర్ నేత పితాని సత్యనారాయణ అవకాశం కోల్పోయారు. యాదవ సామాజిక వర్గం నుంచి సుదీర్ఘ కాలంగా సీనియర్ నేత యనమల రామకృష్ణుడికి మంత్రివర్గంలో అవకాశం లభిస్తూ వస్తోంది. ఈసారి ఆ వర్గం నుంచి సత్య కుమార్, కొలుసు పార్థసారథికి చాన్సు రావడంతో యనమలకు చోటు దక్కలేదు. కొప్పుల వెలమ నుంచి కేంద్రంలో రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రంలో అచ్చెన్నాయుడికి అవకాశం ఇవ్వడంతో అదే వర్గానికి చెందిన మాజీ మంత్రి, సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడికి చాన్సు రాలేదు.

వేధింపులకు గురైన వారికి పదవులు

జగన్ ప్రభుత్వ హయాంలో వేధింపులకు గురై జైళ్లకు వెళ్లినవారు.. కేసుల్లో ఇరుక్కున్న బాధిత నేతలకు చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం లభించడం విశేషం. వీరిలో అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్దనరెడ్డి అరెస్టయి జైళ్లకు కూడా వెళ్లారు. నారాయణపై అనేక కేసులు నమోదైనా ఆయన అరెస్టు కాలేదు. న్యాయస్థానాల్లో ఆయనకు ఉపశమనం లభించింది. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత కూడా కేసుల్లో ఇరుక్కుని వేధింపులకు గురయ్యారు. రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డిపైనా పలు కేసులు బనాయించారు. ఇలా ప్రభుత్వ వేధింపులకు గురైన వారిలో కొంత మందికి చంద్రబాబు తన మంత్రివర్గంలో చోటిచ్చారు.

బడుగులకు పెద్ద పీట

చంద్రబాబు తన మంత్రివర్గంలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తం 24 మంది మంత్రుల్లో 8 మంది బీసీలే. అచ్చెన్నాయుడు (కొప్పుల వెలమ-టెక్కలి), కొండపల్లి శ్రీనివాస్ (తూర్పుకాపు-గజపతినగరం), అనగాని సత్యప్రసాద్ (గౌడ-రేపల్లె), కొలుసు పార్థసారథి (యాదవ-నూజివీడు), సత్యకుమార్ (యాదవ-ధర్మవరం-బీజేపీ), వాసంశెట్టి సుభాష్ (శెట్టి బలిజ-రామచంద్రాపురం), సవిత (కురబ-పెనుకొండ), కొల్లు రవీంద్ర (మత్స్యకార-మచిలీపట్నం)లకు అవకాశమిచ్చారు. ఎస్సీల నుంచి వంగలపూడి అనిత (మాదిగ-పాయకరావుపేట), డోలా బాలవీరాంజనేయస్వామి (మాల-కొండపి), ఎస్టీల నుంచి గుమ్మడి సంధ్యారాణి (సాలూరు), ముస్లింల నుంచి ఎన్ఎండీ ఫరూక్ (నంద్యాల)లకు చోటు దక్కింది. వీరితో కలిపి మొత్తం కేబినెట్‌లో సగం మంది బలహీన వర్గాలకు చెందిన వారే ఉండడం విశేషం.

కమ్మ, కాపు 4-రెడ్డి-3

కమ్మ సామాజిక వర్గం నుంచి నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. వీరిలో లోకేశ్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్ (టీడీపీ), నాదెండ్ల మనోహర్ (జనసేన) ఉన్నారు. కాపు సామాజిక వర్గం నుంచి నలుగురు.. నారాయణ, నిమ్మల రామానాయుడు (టీడీపీ), పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్ (జనసేన) ఉన్నారు. రెడ్డి సామాజికవర్గం నుంచి ముగ్గురు.. ఆనం రామనారాయణ రెడ్డి (ఆత్మకూరు), బీసీ జనార్దనరెడ్డి (బనగానపల్లె), ఎం.రాంప్రసాద్‌రెడ్డి (రాయచోటి) ఉన్నారు. జగన్మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఐదుగురు, కమ్మ సామాజికవర్గం నుంచి అప్పుడు ఒకరే ఉండేవారు. ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి కూడా రెండు ప్రభుత్వాల్లోనూ ఒకరు చొప్పునే ఉన్నారు.

మన మంత్రులు విద్యావంతులు!

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కొత్త మంత్రివర్గంలో ఎక్కువమంది ఉన్నత విద్యావంతులే ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా 11మంది మంత్రులు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, సత్యకుమార్, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్ పీజీ చేశారు. డోలా బాల వీరాంజనేయ స్వామి, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి వైద్యవిద్యను, ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ న్యాయ విద్యనభ్యసించారు. కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్ ఇంజనీరింగ్ చదివారు. కింజరాపు అచ్చెన్నాయుడు, ఎస్.సవిత, గుమ్మడి సంధ్యారాణి, అనగాని సత్యప్రసాద్ డిగ్రీ పూర్తిచేశారు. ఎన్ఎండీ ఫరూక్, కొణిదెల పవన్ కల్యాణ్ విద్యార్హత పదో తరగతి కాగా, బీసీ జనార్దనరెడ్డి 8వ తరగతి వరకు మాత్రమే చదివారు.

ట్రాఫిక్ టెర్రర్!


ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన గవర్నర్ వాహనం

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న డీజీపీ

కేసరపల్లి వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

చిక్కుకుపోయిన గవర్నర్ వాహనం

- ప్రమాణ స్వీకారం 6 నిమిషాలు ఆలస్యం
- గవర్నర్ కోసం ప్రధాని, ఇతరుల ఎదురుచూపులు
- డీజీపీ రంగంలోకి దిగాకే దొరికిన దారి
- సామాన్యులకు చుక్కలు చూపించి... అసలు సమయంలో చేతులెత్తేసిన పోలీసులు

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు ఘోరంగా విఫలమయ్యారు. స్వయంగా గవర్నర్ కాన్వాయ్ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. ముఖ్యమంత్రి, మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించాల్సిన గవర్నర్ అబ్దుల్ నజీర్ సమయానికి వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో కార్యక్రమం ఆరు నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. బుధవారం ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ప్రమాణం చేయాల్సి ఉంది. అయితే... మంగళవారం అర్ధరాత్రి నుంచే పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ పేరుతో సామాన్యులను నానా ఇక్కట్లు పెట్టారు. అవసరంలేని చోట్లా బారికేడ్లు పెట్టి ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రమాణ స్వీకారం జరిగే గన్నవరంతో సంబంధంలేని దారుల్లోకీ వాహనాలను వదల్లేదు. సామాన్యులను ఇంతలా ఇక్కట్లు పెట్టిన పోలీసులు... అసలు సమయం వచ్చేసరికి ఘోరంగా విఫలమయ్యారు. దీంతో... బుధవారం ఉదయం కేసరపల్లి ఫ్లైఓవర్‌పైన గవర్నర్ వాహనం చిక్కుకుపోయింది. ముందుకు కదల్లేని పరిస్థితి ఏర్పడింది. ప్రధానమంత్రి సరిగ్గా 11 గంటలకు విమానాశ్రయానికి వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో స్వాగతం పలకాల్సిన గవర్నర్ అక్కడికి చేరుకోలేకపోయారు. 11.10 గంటలకల్లా ప్రధాని మోదీ సహా ముఖ్యులంతా సభా వేదిక వద్దకు చేరుకున్నారు. అప్పటికీ గవర్నర్ రాలేదు. ఆయన రాక కోసం ప్రధాని వేచి చూడాల్సి వచ్చింది. గవర్నర్ వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుందని తెలిసి పోలీసు ఉన్నతాధికారులు నానా హైరానా పడ్డారు. డీజీపీ హరీశ్ గుప్తా స్వయంగా రంగంలోకి దిగి... ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఆ తర్వాత గవర్నర్ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దీని ఫలితంగా ఆరు నిమిషాలు ఆలస్యంగా కార్యక్రమం మొదలైంది.

అందరికీ చుక్కలే..

జాతీయ రహదారిపై వేల సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులూ ఇబ్బంది పడ్డారు. చివరికి లోకేశ్ వాహనం కూడా 15 నిమిషాలకు పైగా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. కార్యక్రమం పూర్తయిన తర్వాత తిరిగి వెళ్లేందుకు కొందరు ఐఏఎస్ అధికారులు గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. వాహనాలు ముందుకు వెళ్లే పరిస్థితి లేక...కొంతమంది ఉన్నతాధికారులు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి భారీగా జనం తరలి వస్తారని... సభా ప్రాంగణం జాతీయ రహదారి పక్కన ఉందని తెలిసీ పోలీసు ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోలేకపోయారు. 'ట్రాఫిక్ క్రమబద్ధీకరణ' అంటే ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి వాహనాలను అడ్డుకోవడం, సామాన్యులను ఇబ్బంది పెట్టడమే అని మరోసారి నిరూపించుకున్నారు.

కష్టాలు పడి.. కసిగా ఎగసి!

వైసీపీ వేధింపులు తట్టుకుని నిలబడిన గొట్టిపాటి

- ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు
- పార్టీ మారాలని జగన్ సర్కారు తీవ్ర ఒత్తిళ్లు
- క్వారీలపై దాడులు.. మూసివేతలు
- రూ.300 కోట్ల వరకు జరిమానాలు
- అయినా తొణకని రవికుమార్

(బాపట్ల-ఆంధ్రజ్యోతి)


చంద్రబాబుతో గొట్టిపాటి రవికుమార్

క్వారీలు మూయించారు.. వందల కోట్ల జరిమానాలు విధించారు.. పార్టీ మారాలని అనేక రకాలుగా ఒత్తిళ్లు తెచ్చారు.. ఆర్థికంగా నష్టపరిచారు.. అధికార యంత్రాంగాన్ని ప్రయోగించి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని చూశారు.. అనుచరుల ఫ్యాక్టరీల మీదకూ దండెత్తారు.. అయినా అన్నిటినీ భరించి వైసీపీని దీటుగా ఎదుర్కొన్నారు.. ఈ కష్టాలను గుర్తించిన టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు. కొత్తగా కొలువుదీరిన రాష్ట్ర మంత్రివర్గంలో బాపట్ల జిల్లా నుంచి ఈయనతోపాటు రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు అమాత్యయోగం వరించింది. వీరిద్దరూ తొలిసారి మంత్రి పదవి చేపట్టడం గమనార్హం. గొట్టిపాటి 2004లో ప్రకాశం జిల్లా మార్టూరు నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచి తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మార్టూరు స్థానం రద్దయింది. 2009 ఎన్నికల్లో గొట్టిపాటి అద్దంకి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి హ్యాట్రిక్ కొట్టారు. తర్వాతి పరిస్థితుల్లో టీడీపీలో చేరారు. 2019, 2024లో టీడీపీ నుంచి గెలుపొందారు. వరుసగా ఐదు సార్లు గెలుపొంది ఓటమెరుగని నేతగా గుర్తింపు పొందారు. 2019-24 మధ్య గొట్టిపాటే లక్ష్యంగా జగన్ సర్కారు పెద్ద ఎత్తున కక్షసాధింపులకు తెరలేపింది. పార్టీ మారాలని పై స్థాయిలో పెద్ద ఎత్తున ఒత్తిళ్లు వచ్చాయి. వేటికీ లొంగకపోవడంతో ఆయన ఆర్థికమూలాలను దెబ్బకొట్టేందుకు పథక రచన చేసి గనుల అధికారులను ఆయన ఫ్యాక్టరీల పైకి ఉసిగొల్పారు. దాదాపు రూ.300 కోట్ల మేర జరిమానాలను విధించారు. క్వారీలు మూయించారు. కేసులు పెట్టించారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు ఆయన బంధువుల గ్రానైట్ క్వారీల్లో తనిఖీల పరంపరకు వైసీపీ తెరలేపింది. అయినా గొట్టిపాటి చలించలేదు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అన్నిటినీ తట్టుకుని నిలబడడం వల్లే తొలిసారి మంత్రివర్గంలో చోటు దక్కించుకోగలిగారు. ఈసారి ఎలాగైనా గొట్టిపాటిని ఓడించాలని జగన్మోహన్‌రెడ్డి బాబాయి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సిఫారసు మేరకు పల్నాడు జిల్లాకు చెందిన పాణెం హనిమిరెడ్డిని అద్దంకి వైసీపీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. వలంటీర్లను రెచ్చగొట్టడం మొదలుకుని జగన్ సిద్ధం సభకు సైతం అద్దంకి నియోజకవర్గాన్నే వేదికగా ఎంచుకుని కవ్వింపు చర్యలకు దిగారు. రవికుమార్ వాటిని తిప్పికొట్టి ఎమ్మెల్యేగా వరుసగా ఐదోసారి విజయం సాధించడమే కాకుండా మంత్రి పదవి సాధించారు.



బాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా తుళ్లూరులో నృత్యం చేస్తున్న మహిళలు

రాజధాని గ్రామాల్లో మిన్నంటిన సంబరాలు

తుళ్లూరు, జూన్ 12: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో అమరావతి రాజధాని గ్రామాల్లో రైతులు, మహిళలు, రైతు కూలీల సంబరాలు అంబరాన్ని అంటాయి. తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రమాణస్వీకార మహోత్సవాన్ని వీక్షించారు. పసుపు బెలూన్‌లు ఎగర వేసి సంబరాలు చేసుకున్నారు. మహిళలు రోడ్డు మీదకు వచ్చి నృత్యాలు చేశారు. స్వీట్లు పంచుకున్నారు. తుళ్లూరులో తెలుగు యువత అధ్యక్షుడు మూల్పూరు నరేశ్ ఆధ్వర్యంలో పది చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

బాబు, పవన్‌కు బిహార్, అసోం సీఎంల శుభాకాంక్షలు

గువాహటి, పాట్నా, జూన్ 12: సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబుకు బిహార్ సీఎం నితీశ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. బాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని పేర్కొన్నారు. ఈమేరకు సీఎంఓ ఓ ప్రకటన చేసింది. నితీశ్ ఫోన్‌లో చంద్రబాబుతో మాట్లాడారని ఆ ప్రకటన వివరించింది. 'సీఎంగా, ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు నా హార్దిక శుభాకాంక్షలు. మంత్రివర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన అందరికీ నా అభినందనలు' అని అసోం సీఎం హేమంత్ ట్వీట్ చేశారు.

రాష్ట్ర అభివృద్ధిలో తోడుంటాం: నారాయణ

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాజకీయ శాడిజంపై అలుపెరగని పోరాటం చేసి తెలుగు ప్రజలను విముక్తి చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు విజయాభినందనలు అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధిలో వారికి సీపీఐ తోడుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబుకి, నూతన మంత్రివర్గ సభ్యులకు బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అభినందనలు తెలిపారు.

మీ ప్రతిష్ఠకు, పాలనకు మచ్చ రాకూడదు

- సీఎం చంద్రబాబుకు షర్మిల బహిరంగ లేఖ

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశయాలకు, నమ్మకాలకు అనుగుణంగా నూతన ప్రభుత్వం పనిచేయాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆకాంక్షించారు. సీఎంగా, డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు షర్మిల బుధవారం ఓ బహిరంగ లేఖ రాశారు. 'గడచిన ఐదేళ్లలో జరిగిన విశృంఖల పాలన, దానివలన అన్ని విధాలుగా నాశనమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలోపెట్టి ముందుకు తీసుకొని వెళతారని ప్రజలు మీకు ఈ తీర్పు ఇచ్చారు. దానికి అనుగుణంగా నడుచుకొని, వైఎస్సార్ విగ్రహాల మీద దాడులు, ప్రతిపక్షాల మీద ప్రతీకార చర్యలు ఇకపై జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నా. ప్రతీకార రాజకీయాలు, సంస్కారం, విచక్షణకు తావులేని చేష్టలతో మీ పేరుకు, ప్రతిష్ఠకు, పాలనకు మచ్చ రాకూడదని కోరుకుంటున్నా' అని షర్మిల అన్నారు.

నూతన ప్రభుత్వ ఏర్పాటును స్వాగతిస్తున్నాం: ఏపీజేఏసీ

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నూతన సీఎంగా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్.. వారి నేతృత్వంలో ఏర్పాటయిన నూతన ప్రభుత్వాన్ని స్వాగతిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ శివారెడ్డి, సెక్రటరీ జనరల్ హృదయరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'బుధవారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నాం. గత ప్రభుత్వంలో కోల్పోయిన హక్కులు, ప్రయోజనాలను పునరుద్ధరించాలి. 12వ పీఆర్సీ అమలుకు ముందే ఐఆర్ ప్రకటించాలి. రూ.25 వేల కోట్ల బకాయిల చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. సీపీఎస్ రద్దు దిశగా దృష్టి సారించాలి. మెగా డీఎస్సీ నిర్వహించాలి. విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేస్తున్న 117 జీవోను రద్దు చేయాలి. ఉద్యోగుల సమస్యలపై కొత్త ప్రభుత్వం ఏపీ జేఏసీ నాయకత్వంతో చర్చించి తగు పరిష్కారాలు చేయాలి' అని వారు కోరారు.

మీ తమ్ముడు గట్టివాడు!

- పవన్ గురించి చిరంజీవితో ప్రధాని మోదీ
- మురిసిపోయిన అన్నయ్య
- వేదికపై బాలయ్య సందడి
- పాదాభివందనం వద్దని లోకేశ్‌ను వారించిన ప్రధాని



మెగా సోదరులు చిరంజీవి, పవన్‌తో ప్రధాని మోదీ సరదా సంభాషణ

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): "మీ తమ్ముడు గట్టివాడు" అంటూ ప్రధాని నరేంద్ర మోదీ.. జనసేనాని పవన్ కల్యాణ్ గురించి మెగాస్టార్ చిరంజీవితో వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి ప్రధాని మోదీకి జ్ఞాపికను అందజేశారు. ఆ వెంటనే మోదీ ఇద్దరినీ అభినందించారు. ఇదే సమయంలో పవన్ కళ్యాణ్.. ప్రధాని మోదీని తన అన్నయ్య చిరంజీవి వద్దకు తీసుకువెళ్లారు. చిరంజీవిని చూడగానే మోదీ ఆప్యాయంగా పలకించారు. ఇద్దరినీ వేదిక ముందుకు తీసుకువచ్చి, ఇద్దరి చేతులు పైకి ఎత్తి అందరికీ అభివాదం చేశారు. పవన్ కల్యాణ్ గురించి చిరంజీవికి వివరిస్తూ "మీ తమ్ముడు గట్టివాడు" అని మోదీ వ్యాఖ్యానించారు. ఇది విన్న చిరంజీవి వెంటనే తన తమ్ముడు గడ్డాన్ని ఆప్యాయంగా నిమిరి మురిసిపోయారు. ఈ సంఘటన చూసిన మెగా కుటుంబ సభ్యులు, అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇదిలావుంటే, ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రులుగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇతర నేతలు ప్రమాణస్వీకారం చేసిన కార్యక్రమంలో పలు ఆసక్తికర ఘట్టాలు చోటు చేసుకున్నాయి. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సరదా సరదాగా గడిపారు. సభా వేదికపైకి వచ్చే ప్రముఖులకు స్వాగతం పలికే బాధ్యత తీసుకున్న బాలయ్య.. వేదికపై కూర్చున్న తన చెల్లెలు భువనేశ్వరి భుజంపై వెనుక నుంచి తట్టడంతో ఆమె ఉలిక్కి పడ్డారు. వెంటనే భువనేశ్వరి నుదుటిపై ముద్దు పెట్టి ఆశీర్వదించారు.

- 'నారా చంద్రబాబునాయుడు అనే నేను...' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం మొదలు పెట్టగానే సభికుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఆయన ఎంత బిగ్గరగా ప్రమాణం చేస్తున్నా అభిమానుల కేకలు, ఈలల మధ్య ఆయన మాటలు కొద్దిసేపు వినిపించలేదు. మరోవైపు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో వైకల్యంతో బాధ పడుతున్న ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ కుడిచేయి పిడికిలి బిగించి భావోద్వేగానికి లోనయ్యారు.
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంత్రిగా ప్రమాణం చేస్తున్నప్పుడు కూడా పెద్ద ఎత్తున అభిమానుల నుంచి స్పందన వచ్చింది. మరోవైపు పవన్ సతీమణి అన్నా జనసేనాని ప్రమాణ స్వీకార ఘట్టాన్ని తన సెల్ ఫోన్‌లో చిత్రీకరించారు.
- టీడీపీ యువ నాయకుడు నారా లోకేశ్ ప్రమాణం చేస్తున్నప్పుడు భార్య బ్రాహ్మణి సంతోషం వ్యక్తం చేస్తూ 'నాన్నను చూడు' అంటూ కుమారుడు దేవాన్ష్‌కు ప్రోత్సహించారు. ప్రమాణ స్వీకారం అనంతరం నారా లోకేశ్ తన తండ్రి చంద్రబాబు పాదాలకు నమస్కరించారు. ఆ వెంటనే వేదికపై ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ పాదాలకు నమస్కారం చేసేందుకు ప్రయత్నించగా ఆయన వద్దంటూ లోకేశ్ చేతులు పట్టుకుని వారించారు.



- మంత్రిగా ప్రమాణం చేసే ముందు టీడీపీ నేత కొల్లు రవీంద్ర తొందర పడ్డారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆయనను ఆహ్వానించగానే గవర్నర్ 'నేను..' అనే లోపే.. 'కొల్లు రవీంద్ర అనే నేను' అని మొదలు పెట్టారు. తర్వాత గవర్నర్ వైపు చూసి మరోసారి మొదలు పెట్టారు.
- సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ మంత్రివర్గ సభ్యులందరినీ ప్రమాణ స్వీకారానికి తెలుగులోనే ఆహ్వానించారు. అయితే, కొన్ని సందర్భాల్లో ఆయన తెలుగు పలికేందుకు ఇబ్బంది పడ్డారు.
- మంత్రుల్లో కొందరు చిన్న చిన్న తప్పులు పలికినా రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి మాత్రం ఎక్కువగా తప్పులు పలికారు. అనంతరం ఆయన పట్టుబట్టి మరీ చంద్రబాబు పాదాలకు నమస్కరించారు.
- పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో ఆయన అన్నయ్య చిరంజీవి మురిసిపోయారు. చిరునవ్వులు చిందిస్తూ తమ్ముడి గురించి పక్కనే ఉన్న తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌కు ఏదో చెబుతున్న దృశ్యం అందరినీ ఆకర్షించింది.
- చంద్రబాబు, పవన్ సహా ఒకరు మినహా అందరూ తెలుగులో 'దేవుడి సాక్షిగా' ప్రమాణం చేశారు.
- కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్ మాత్రం ఆంగ్లలో ప్రమాణం చేశారు. నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్ 'అల్లా సాక్షిగా' ప్రమాణం చేశారు.
- నలుగురు టీడీపీ సభ్యులు పసుపు రంగు దుస్తుల్లోనే వచ్చి ప్రమాణ స్వీకారం చేశారు. కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు పసుపు చొక్కాలు ధరించి ప్రమాణస్వీకారం చేశారు. వంగలపూడి అనిత పసుపు రంగు చీర ధరించి ప్రమాణ స్వీకారం చేశారు.
- చిరంజీవి, రజనీకాంత్, బాలయ్య వేదిక కుడివైపు ముందు వరుసలో కూర్చుని ముచ్చటించుకున్నారు.
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, అథావలే, అనుప్రియ పటేల్, చిరాగ్ పాశ్వాన్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే తదితరులు ప్రమాణ స్వీకార ఘట్టాన్ని ఆసక్తిగా పరిశీలించారు.
- వేదికపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై తదితరులు వేదికకు మరోవైపు కూర్చున్నారు.
- ఎన్టీఆర్ కుమార్తెలు పురందేశ్వరి, భువనేశ్వరి వేదిక పైకి ఒకేసారి కలిసి వచ్చారు. మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సభ్యులందరూ ఒకేసారి చేరుకున్నారు.
- కార్యక్రమం ముగిసిన తర్వాత చిరంజీవి, రజనీకాంత్, వెంకయ్యనాయుడు, జస్టిస్ ఎన్వీ రమణ తదితర ప్రముఖులను చంద్రబాబు వారి కారు దాకా వెళ్లి వీడ్కోలు పలికారు.
- ప్రధానికి వీడ్కోలు పలికేందుకు మోదీ కాన్వాయ్‌లో వెళ్లాలన్న ఉద్దేశంతో గవర్నర్ అబ్దుల్ నజీర్ తన కాన్వాయ్‌ని ముందుగానే విమానాశ్రయానికి పంపారు. అయితే, తనకు వీడ్కోలు పలికేందుకు ఎవరూ అవసరం లేదని మోదీ చెప్పడంతో అందరూ ఆగిపోయారు. దీంతో తన కాన్వాయ్ తిరిగి వచ్చేదాకా అక్కడి గ్రీన్ రూమ్‌లో గవర్నర్ చాలా సేపు వేచి ఉన్నారు.

నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు

చంద్రబాబు మొదటిసారి 1995లో, తర్వాత 1999లో రెండోసారి, 2014లో మూడోసారి, ఇప్పుడు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేశారు. 1978లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఆయన తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు 1989లో అదే జిల్లాలోని కుప్పం నియోజకవర్గానికి మారారు. అప్పటి నుంచి ఆయన కుప్పంలో విజయ ఢంకా మోగిస్తూనే ఉన్నారు.

మోదీ.. బాబు ఉల్లాసంగా కబుర్లు

మంత్రివర్గ ప్రమాణ స్వీకార వేదికపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఉల్లాసంగా కబుర్లు చెప్పుకొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపై మోదీ, చంద్రబాబు ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే సమయంలో సుమారు ముప్పావు గంటపాటు ఇరువురూ మాట్లాడుకుంటూనే ఉన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తన కుటుంబంతో కలిసి చంద్రబాబు ప్రధానితో గ్రూప్ ఫొటో దిగారు.



చిరంజీవితో చంద్రబాబు ఆలింగనం

గతంలో చూడని అభివృద్ధిని చూస్తారు

- ఈ ప్రభుత్వంపై నాకు నమ్మకం ఉంది: చిరంజీవి

విజయవాడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): 'గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని ఈ రాష్ట్ర ప్రజలు చూస్తారని నేను సవినయంగా తెలియజేస్తున్నా. ఈ ప్రభుత్వంపై నాకు నమ్మకం ఉంది' అని ప్రముఖ నటుడు చిరంజీవి వ్యాఖ్యానించారు. చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరైన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రానికి 4వ సారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పవన్‌కల్యాణ్, ఇతర మంత్రివర్గ సభ్యులకు నా హార్దిక శుభాకాంక్షలు. గుండెల నిండా సంతోషంగా ఉంది. కొత్త, పాత మంత్రుల కలయిక చాలా బాగుంది. పవన్ కల్యాణ్ మంత్రి కావడం నాకు గర్వంగా అనిపిస్తోంది. తను సమర్థవంతంగా పాలన చేయగలడు. మంత్రి పదవికి న్యాయం చేయగలడు' అని చిరంజీవి పేర్కొన్నారు. రామ్‌చరణ్ సైతం బాబాయ్ పవన్ కల్యాణ్‌కు మంత్రి పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.


రాష్ట్రంలో కొత్త శకం ప్రారంభం

- సత్యకుమార్ బీజేపీ సైనికుడు: పురందేశ్వరి



బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి నమస్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి దశాబ్దాల పాటు సత్య కుమార్ పార్టీకి చేసిన సేవకు గుర్తింపే మంత్రి పదవి అంటూ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సత్య కుమార్‌ను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సంఘ్ పరివార్ ద్వారా కార్యక్షేత్రంలో పని చేయడం నుంచి అనేక రచనల ద్వారా సమాజాన్ని మేల్కొలిపిన సత్య కుమార్ బీజేపీలో బలమైన సైనికుడని అన్నారు. అనంతరం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... 'కూటమి విజయం ఒక హెచ్చరిక లాంటిది. గత ప్రభుత్వం అవినీతి, అరాచకాలతోనే ప్రజల్లో కనుమరుగైంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు రావాల్సిన బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వంపై ఉంది. రాష్ట్రంలో కొత్త శకం ప్రారంభమైంది. నిజమైన సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తూ పార్టీని అభివృద్ధి చేసుకోవాలి' అని అన్నారు. అనంతరం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌ను ఘనంగా సత్కరించారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



నాగలి గుర్తు చూపిస్తున్న ఓ రైతు



జనసైనికుల ఆనందోత్సాహం

అభిమానం పోటెత్తింది... ఉత్సాహం ఉరకలేసింది. తమ ప్రియతమ నేత ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఎలాగైనా చూడాలనే వారి ఆశ, ఆశయం ముందు పోలీసుల బలం చిన్నబోయింది. గన్నవరంలోని మేథాటవర్స్‌లో జరిగిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి హాజరయ్యేందుకు రాష్ట్రం, దేశ విదేశాల నుంచి నేతలు, కార్యకర్తలు, అభిమానులు గన్నవరానికి క్యూ కట్టారు. దీంతో అడుగడుగునా ట్రాఫిక్‌జామ్ అయింది. దీంతో పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు ఆంక్షలు విధించారు కానీ వీరి అభిమానం ముందు ఆ ఆంక్షలన్నీ చిన్నబోయాయి. తమకున్న అవకాశాలతో వారు ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై కనులారా తిలకించారు.



బాబు ప్రమాణస్వీకారానికి నేను సైతం..



సీఎం ప్రమాణస్వీకారానికి ఎన్‌ఆర్‌ఐలు



మేం బాబుగారి తాలూకా అంటూ ఓ కార్యకర్త వినూత్న ప్రదర్శన

పోటెత్తిన అభిమానం

- ఉక్కిరి బిక్కిరైన పోలీసు యంత్రాంగం
- కాలినడకన సభాస్థలికి ప్రజానీకం





పోలీసులతో వాగ్వాదం



పొలాల్లోంచి నడక



కాలినడకన సభా ప్రాంగణానికి..

హనుమాన్‌జంక్షన్, ఉంగుటూరు, జూన్ 12: కేసరపల్లిలోని మేథా టవర్స్‌లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడి ప్రమాణ స్వీకారోత్సవ సభకు అభిమానుల పోటెత్తటంతో పోలీస్ యంత్రాంగం ఉక్కిరి బిక్కిరయ్యింది. మేథాటవర్ సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ ఎత్తున వాహనాల్లో తరలివచ్చారు. ప్రమాణ స్వీకారోత్సవం 11.20 గంటలకు కాగా అప్పటికే సభా ప్రాంగణం నిండిపోవడంతో పోలీసులకు ఏం చేయాలో పాలుపోక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వస్తున్న అభిమాన సంద్రాన్ని ఎక్కడికక్కడే నిలిపే ప్రయత్నం చేశారు. వాహనాలను సభావేదిక సమీపానికి పంపిస్తే ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతుందని భావించిన పోలీసులు హనుమాన్‌జంక్షన్, అంపాపురం, తేలప్రోలు, పొట్టిపాడు టోల్‌ప్లాజాల వద్దే వాహనాలను నిలిపేశారు. కేవలం పాస్ ఉన్న వాహనాలనే పంపించారు. వీవీపీ పాస్‌లు ఉన్న వాహనాలను సైతం నిలిపేసే ప్రయత్నం చేశారు. వాహనాలను అనుమతిలేదని కాలినడకన వెళ్లాలని విజ్ఞప్తి చేయాల్సి వచ్చింది. దీంతో పొట్టిపాడు వద్ద పోలీసులకు ప్రజలకు వాగ్వాదం జరిగింది. వాహనాలకు దారివ్వకుండా బారికేడ్లతో నిలిపేయడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. 15 కి.మీ దూరంలోని సభాస్థలికి కాలినడకన ఎలా వెళతామని పాస్‌లున్నా అభ్యంతరం పెట్టడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బారికేడ్లను రోడ్డు మార్జిన్‌లోకి తోసేసి కొన్ని వాహనాలు ముందుకెళ్లాయి. ఆయా వాహనాలను వాహనాలను ఆత్కూరు, చిన్న అవుటపల్లి సిద్ధార్థ పిన్నమనేని వైద్య కళాశాల వద్ద నిలిపేశారు. ఏదో విధంగా గన్నవరం చేరుకున్న ద్విచక్రవాహనాలను సైతం ఎయిర్‌పోర్ట్ సమీపంలోని కొత్తపేట జంక్షన్ వద్ద ద్విచక్రవాహనాలను కూడా నిలువరించారు. అధికారులు, సమాచార శాఖాధికారులు, మీడియాను వదలని పరిస్థితి. ఊహించని విధంగా ప్రజానీకం తరలి రావడంతో పోలీసులు ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఎక్కడికక్కడ కట్టుదిట్టం చేశారు. అయినాసరే ప్రమాణ స్వీకారం చూడాలన్న అభిమానంతో కాలినడకన వేదిక వద్దకు వెళ్లగలిగారు. మరి కొంతమంది ఎయిర్ పోర్టు వద్ద, గన్నవరం ఊరు చివర ఏర్పాటు చేసిన లైవ్ ప్రసార టీవీల వద్ద ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు.



పొట్టిపాడు టోల్‌ప్లాజా సమీపంలో ప్రజల ఒత్తిడితో వాహనాలకు దారిచ్చిన పోలీసులు



బండి సంజయ్, కందుల దుర్గేష్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మ సన్నిధిలో బండి సంజయ్, కందుల దుర్గేష్

వన్‌టౌన్, జూన్ 12: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను బుధవారం కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయమర్యాదలు అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఈవో రామరావు వారికి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం ఇవ్వగా పండితులు ఆశీస్సులందజేశారు.

రైల్వే సీనియర్ డివిజన్ ఆపరేషన్స్ (జనరల్)

మేనేజర్‌గా సత్యస్వరూప్



రైల్వేస్టేషన్, జూన్ 12: రైల్వే సీనియర్ డివిజన్ ఆపరేషన్స్ (జనరల్) మేనేజర్‌గా పి సత్యస్వరూప్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. 2015 ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసెస్ బ్యాచ్‌కు చెందిన ఆయన దక్షిణ మధ్య రైల్వేలో డివిజనల్ రైల్వేమేనేజర్‌గా పనిచేశారు. 2019-2021 మధ్య తూర్పు రైల్వేలో షీల్డా డివిజన్‌లోని చిట్‌పూర్‌లో ఏరియా ఆఫీసర్‌గా రైల్వేలో చేరారు. హౌరా డివిజన్‌లో గూడ్స్ డీవోఎంగా పనిచేశారు. జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్‌కు పదోన్నతి పొందిన తరువాత తొలిగా విజయవాడ డివిజన్‌కు నియామకమయ్యారు.

ఎస్కార్ట్ జీపు బోల్తా, తప్పిన ప్రాణాపాయం

డ్రైవర్, సిబ్బందికి స్వల్ప గాయాలు



డివైడర్ ఎక్కిన ఎస్కార్ట్ వాహనం

విజయవాడ, గుణదల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి హాజరయ్యే వీవీపీలకు ఇచ్చిన ఎస్కార్ట్‌ల్లో ఓ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన బుధవారం ఉదయం విజయవాడలోని జాతీయ రహదారిపై జరిగింది. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కేసరపల్లికి బయలుదేరగా ఏఆర్ పోలీసులు జీపులో ఎస్కార్ట్ ఇచ్చారు. ఆమెను కేసరపల్లి వద్దకు చేర్చి తిరిగి వస్తోంది. కరెన్సీనగర్ వద్దకు వచ్చేసరికి జీపునకు ముందు వెళ్తున్న వాహనం హఠాత్తుగా బ్రేక్ వేయడంతో ఈ వాహనం డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో జీపు జాతీయ రహదారికి పక్కన ఉన్న ఇనుప కంచెపైకి తిరగబడిపోయింది. వాహనంలోని సిబ్బంది స్వల్పగాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. వాహనానికి పైభాగం, ఒకవైపు భాగం పూర్తి దెబ్బతింది.



ఆర్ సింధు సిరి 484, ఎ. మధు మేఘన 543, యస్.సంగీతలక్ష్మి 588, వి.తోరణ్ కార్తీక్ 1058, ఎ.సంపత్ 1065, ఎ. సంజయ్ 1070

శారదా విద్యాసంస్థలకు అత్యుత్తమ ర్యాంకులు

మొగల్రాజపురం, జూన్ 12: ఈ ఏడాది ఈఏపీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మొగల్రాజపురం శారద విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదా దేవి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ సింధు సిరి (4 84), ఎస్ సంగీత లక్ష్మి (588), యం.నాగలక్ష్మీదేవి (536), వి. తోరణ కార్తీక్(1058), ఎ. సంపత్ (1065), ఎ సంజయ్ (1070), ఎం.లావణ్య (1 160), ఎం.శర్వాణి (1270), సీహెచ్ సిద్ధార్థ (2109) సాధించి డేస్కాలర్స్‌లో కళాశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు.జేఈఈ, ఎంసెట్‌లోనూ తమ విద్యార్థులు ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. 120మంది విద్యార్థులు ఈఏపీసెట్‌లో 10వేల లోపు ర్యాంకులు సాధించారన్నారు. ఎంసెట్‌లో 850 మంది విద్యార్థుల్లో సగం మందికి పైగా అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఒత్తిడి లేని విద్య, క్రమశిక్షణ, అధ్యాపకుల సలహాలు, సూచనలు ప్రశాంత వాతావరణం, ఆన్ లైన్ పరీక్ష ప్రణాళిక, విద్యార్థుల శ్రద్ధ, తల్లిదండ్రుల సహకారం కారణ మని అడ్వైజర్ ఈఎస్ఆర్కే ప్రసాద్, జీఎం జీవీ రావు చెప్పారు.

ఘనంగా రంగా వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

అమరావతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం బుధవారం లాంఫాం ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్లలో రంగా వర్సిటీ సాధించిన ప్రగతిని ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మి వివరించారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీకి జాతీయ స్థాయిలో 16 అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. అనంతరం వ్యవసాయ రంగంలో కృషి చేసిన శాస్త్రవేత్తలు హేమలత, రామలక్ష్మి, రవికుమార్, కిశోర్‌వర్మ, సతీష్, శ్రీదేవి, అభ్యుదయ రైతులు దుర్గారావు, సంజీవరెడ్డి, పిచ్చయ్య, కృష్ణకు బంగారు పతకాలు అందజేశారు.

నటుడు పృథ్వీరాజ్‌కు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్

విజయవాడ లీగల్, జూన్ 12: సినీనటుడు, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్‌కు స్థానిక ఫ్యామిలీ కోర్టు బుధవారం నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. పృథ్వీపై అతడి భార్య బలిరెడ్డి శ్రీలక్ష్మి ఫ్యామిలీ కోర్టులో మనోవర్తి చెల్లించాలని కేసు వేయడంతో ఆమెకు నెలకు రూ.8 లక్షలు చెల్లించాలని ఫ్యామిలీ కోర్టు గతంలో ఆదేశించింది. ఆ ఉత్తర్వులపై పృథ్వీ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు తాత్కాలికంగా అతడి భార్యకు నెలకు రూ.22వేల చొప్పున చెల్లించాలని, అప్పటి వరకు ఉన్న బకాయిలు మొత్తం చెల్లించాలని ఆదేశించింది. కానీ పృథ్వీ హైకోర్టు ఆదేశాలను కూడా అమలు జరపకపోవడంతో అతడి భార్య శ్రీలక్ష్మి తన న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, సప్పా రమేష్, సీహెచ్.వడ్డీకాసులు ద్వారా ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పృథ్వీ న్యాయస్థానం ముందు హాజరుకాకుండా ఓ దినపత్రికలో కేసు విషయమై ప్రకటన చేసి, న్యాయస్థానం ముందు గైర్హాజరవుతున్నట్లు న్యాయవాదులు ఆ పిటీషన్‌లో పేర్కొన్నారు. పిటీషన్‌ను పరిశీలించిన ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి బుధవారం ఆయనకు నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కేంద్రమంత్రులు, మహారాష్ట్ర సీఎంకు

కేశినేని చిన్ని సాదర స్వాగతం



కేంద్రమంత్రులు, మహారాష్ట్ర సీఎంకు చిన్ని స్వాగతం

వన్‌టౌన్, జూన్ 12: కేసరపల్లిలో బుధవారం జరిగిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రులు, మహరాష్ట్ర ముఖ్యమంత్రికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సాదర స్వాగతం పలికారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, చిరాగ్ పాశ్వాన్, సీఎం ఏక్‌నాథ్ షిండే, రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ల పటేల్‌కు ఆయన గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్, మాధుర్ తదితరులు శివనాథ్ వెంట ఉండి అతిథులకు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికి ప్రత్యేక వాహనాల్లో వేదిక వద్దకు పంపించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన

అందరి బాధ్యత: కలెక్టర్ ఢిల్లీరావు



పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జూన్ 12: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయన తన చాంబర్‌లో కార్మిక, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్, సంయుక్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరిలో అవగాహన చైతన్యం కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) సంయుక్త ఆధ్వర్యంలో 2002 నుంచి ప్రతి ఏడాది ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణకు కలిసి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ అరవ రమేష్, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెలగా జోషి, కార్మిక శాఖ అధికారులు శ్రీనివాసరావు, మహేశ్వరరెడ్డి, రత్నకుమారి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు ఎం.రాజేశ్వరరావు, కిరణ్‌కుమార్, శారద, రాణి, బర్ఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కోటి ప్రకాష్ కుమార్, బచ్‌పన్ బచావో ఆందోళన్ (బీబీఏ) కో-ఆర్డినేటర్ కె.శ్రీకాంత్, వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు హృదయరాజు, మోహనకృష్ణ, సునీల్, సంయుక్త ప్రతినిధులున్నారు.

కర్ణాటకలోని అరేబియా సముద్రంలో పడి

తాడిగడప మహిళ మృతి

- తాడిగడపలో బుధవారం అంత్యక్రియలు పూర్తి



పెనమలూరు, జూన్ 12: తోటి మహిళలతో కలిసి కర్ణాటక రాష్ట్రంలో విహారయాత్రకని వెళ్లిన తాడిగడపకు చెందిన ఓ మహిళ (57) అరేబియా సముద్రంలో రాకాసి అలల మధ్య చిక్కుకొని మృతిచెందిన సంఘటనతో తాడిగడపలో విషాదఛాయలు నెలకొన్నాయి. తాడిగడపకు చెందిన పరిమి లక్ష్మీప్రసన్న, రత్నకుమారి కుటుంబం కొన్ని దశాబ్దాల క్రితం వ్యాపారరీత్యా హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లిలో స్థిరపడ్డారు. ఈనెల 6న హైదరాబాద్ నుంచి విమానంలో రత్నకుమారి తన ఐదుగురి స్నేహితురాళ్లతో కలిసి కర్ణాటకలోని మైసూరు రాష్ట్రానికి టూర్ వెళ్లారు. 10న సోమవారం మధ్యాహ్నానికి ఉళ్లాళ అనే ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి బీచ్‌కు వెళ్లిన ఆరుగురు మహిళల్లో ఇద్దరు బీచ్ ఒడ్డునుండగా మిగిలిన నలుగురు సముద్రంలోకి వెళ్లారు. ఆ సమయంలో అకస్మాత్తుగా రాకాసి అలలు ఎగిసి పడడంతో వారు సముద్రంలోకి లాగబడ్డారు. అక్కడున్న గజ ఈతగాళ్లు రక్షించి బయటకు తీసుకు వచ్చి ఆసుపత్రికి తరలిస్తుండగా రత్నకుమారి మరణించారు. మిగిలిన ముగ్గురూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. రత్నకుమారి మృతదేహాన్ని పోలీసులు భర్త లక్ష్మీప్రసన్నకు అప్పగించారు. మంగళవారం రాత్రి మృతదేహాన్ని తాడిగడపకు తీసుకురాగా బుధవారం అంత్యక్రియలు చేశారు.



నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన జాస్తి వీరాంజనేయులు, మంత్రి కొల్లు రవీంద్రను అభినందిస్తున్న దేవినేని ఉమామహేశ్వరరావు, లుక్కా, సాయిరాం ప్రసాద్‌గౌడ్

మంత్రులకు అభినందనలు

వన్‌టౌన్/విద్యాధరపురం, జూన్ 12: సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు, మంత్రిగా ప్రమాణం చేసిన లోకేశ్‌కు అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ జాస్తి వీరాంజనేయులు శుభాకాంక్షలు తెలిపారు. లోకేశ్‌ను కలిసిన ఆయన అభినందనలు తెలుపుతూ యువగళం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి ప్రజల మన్ననలను పొంది టీడీపీని విజయపథంలో నడిపించారని కొనియాడారు. అలాగే మంత్రులుగా ప్రమాణం చేసిన పవన్‌కల్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, సత్యప్రసాద్‌తో పాటు మిగతా మంత్రుకు శుభాకాంక్షలు తెలిపారు.

కొల్లు, కొలుసుకు అభినందనలు

సీఎం చంద్రబాబు మంత్రివర్గంలో బుధవారం నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, బందరు ఎమ్మెల్యే కొల్లు రవీంద్రకు నేతలు, కార్యకర్తలు దుశ్శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. కొల్లు రవీంద్రను ఆయన నివాసంలో మాజీ మంత్రి దేవినేని ఉమా కలిసి అభినందించారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ కూడా కొల్లు రవీంద్రను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



పార్థసారథిని కలిసిన గురునాథం

చంద్రబాబు మంత్రివర్గంలో ప్రమాణస్వీకారం చేసిన కొలుసు పార్థసారథికి ఆయన కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర నేత మాదిగాని గురునాథం, మాజీ కార్పొరేటర్ నరసింహ చౌదరి, డాక్టర్ విశ్వనాథం కలిసి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో అభినందించారు.



చంద్రబాబుబు చిత్రపటానికి పాలాభిషేకం

సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటాలలకు భవానీపురంలోని 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. సీఎంకు, మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. సూదులగుంట శ్రీనివాసరావు, ఎస్.రవికుమార్, జి.వెంకటరెడ్డి, గాడు గణేష్, మన్నం నారాయణ, వెంకటేశ్వర్లు, కందికంటి శ్రీనివాసరావు, వంశీ, నారాయణ, నవీన్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

చంద్రబాబు-పవన్‌కు అభినందనలు

ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు సారథ్యం వహిస్తుండడంపై రాష్ట్ర గ్రామ, వార్డు, సెక్రటరీయేట్, సర్వీసెస్ అసోసియేషన్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపింది. అలాగే మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పవన్‌కల్యాణ్‌కు, మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జీవీవీ రాఘవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మొహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి పులిబండ్ల నరసింహారావు అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త ప్రభుత్వానికి కళాబృందాల నీరాజనాలు

విజయవాడ కల్చరల్, జూన్ 12: కొత్త ప్రభుత్వానికి స్వాగతం పలుకుతూ కళాబృందాలు నీరాజనాలు పలికాయి. శాస్త్రీయ, జానపద గాత్ర, నృత్యాంశాలతో అశేష జన సమూహాన్ని ఉర్రూతలూగించాయి. మహాగణపతి మసనా స్మరిస్తూ ప్రార్థన గీతంతో భాగవతుల వెంకట రామశర్మ బృందం కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించింది. తదుపరి తెలుగువారి చారిత్రక ఔన్నత్యాన్ని సాంస్కృతిక సౌభ్రాతృత్వం, పర్యాటక సౌరభం, ఆధ్యాత్మిక ఆనందం, ప్రాచీన నాగరికత, ఆంధ్ర రాష్ట్ర వైభవాన్ని తెలుపుతూ అమరావతి గీతానికి సౌమ్య శిష్యబృందం రసవత్తరంగా నర్తించింది. అజరామరమైనది అమరావతి నగరం అంటూ రాజధానిపై మరో గీతాన్ని ఆలపిస్తూ భాగవతుల వెంకట రామశర్మ బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. రంగం రాజేష్ బృందం, దామోదర గణపతి బృందం జానపద గీతాలాపన, జానపద నృత్యాలను మేళవించి ప్రదర్శించిన తీరు కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించింది. విద్యార్థులకు తల్లిదండ్రులకు ఉద్యోగులకు కార్మికులకు రైతులకు మహిళలకు బడుగు బలహీన వర్గాలకు సర్వజనులకు చంద్రబాబు అవసరం ఎలాంటిదో వివరిస్తూ జానపదంతో మైమరిపించారు. అమరావతి చంద్రుడు నవ్యాంధ్ర నేత సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న చంద్రబాబు అంటూ మరో జయహో గీతాన్ని ఆలపించారు. కోయ జాతి గిరిజనుల కొమ్ము, కోయ ప్రాచీన గిరిజన నృత్యం ప్రదర్శించి రమేష్ బృందం జానపద సంప్రదాయాన్ని కళ్లకట్టింది. లెజెండ్ సాంగ్‌తో రసూల్ బాబు సినీ గీతాన్ని ఆలపించి ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నారు. తలపాగా చుట్టుకొని, జబ్బా వేసుకొని ధోతి కట్టుకొని మెడలో కాసుల దండలు ధరించి అంగవస్త్రాలతో మధ్యలో వాద్యాన్ని వాయిస్తూ అనంతపురం జిల్లా గ్రామీణ సంస్కృతిని తలపిస్తూ అనంతపురం జిల్లాకు చెందిన రాము బృందం ఉరుముల కళా రూపాన్ని ప్రదర్శించి అలరించారు. పులి వేషాలతో గోపి బృందం బుట్ట బొమ్మలతో ఆదిబాబు బృందం, తప్పెటగుళ్లతో కోదండరామయ్య బృందం, డప్పులతో సిహెచ్.శ్రీనివాస్ బృందం, గరగలతో కేవైవీ ప్రసాద్ బృందం తమ కళారూపాలను జన రంజకంగా సాగించారు. కళా ప్రదర్శనలను ఏపీ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మల్లిఖార్జునరావు పర్యవేక్షించారు. మురళీకృష్ణ, భార్గవి, సన్‌షైన్ భాస్కర్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.



దిక్సూచి
DIKSUCHI

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ) ఆధ్వర్యంలోని లక్ష్మీబాయ్ నేషనల్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎల్ఎన్‌సీపీఈ, తిరువనంతపురం)- డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) ఇన్నోవేటివ్, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్(ఎంపీఈఎస్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ టెస్ట్, కౌన్సెలింగ్, మెడికల్ టెస్ట్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ టెస్ట్‌ను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. యూనివర్సిటీ ఎగ్జామ్స్‌లో మంచి మార్కులు సాధించినవారికి నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్‌లు ఇస్తారు.

లక్ష్మీబాయ్ నేషనల్ కాలేజీలో
ఫిజికల్ ఎడ్యుకేషన్

బీపీఈడీ ఇన్నోవేటివ్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటా యి. ఇందులో మొత్తం 70 సీట్లు ఉన్నాయి. వీటిలో 28 సీట్లను మహిళలకు కేటాయించారు. థియరీ కోర్సులు, కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాక్టికల్ ట్రెయినింగ్, టీచింగ్ ప్రాక్టీస్, కోచింగ్ ఎబిలిటీ, ఇంటర్న్‌షిప్ ఉంటాయి. వీటితోపాటు లెక్చర్స్, ప్రాక్టికల్స్, ల్యాబొరేటరీ వర్క్‌లు, ఫీల్డ్ వర్క్‌లు, ఔట్ రీచ్ యాక్టివిటీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఒకేషనల్ ట్రెయినింగ్, సెమినార్లు, అసైన్‌మెంట్‌లు, ప్రజంటేషన్‌లు కూడా ఉంటాయి.

అర్హత: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 2024 జూన్ 1 నాటికి 23 ఏళ్లు మించకూడదు. ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. వివాహిత మహిళలు ఆరోగ్యం అనుకూలించని పక్షంలో కోర్సు నుంచి వైదొలిగే వీలుంది.

అడ్మిషన్ టెస్ట్: మొదట రాత పరీక్ష ఉంటుంది. దీనికి 50 మార్కులు నిర్దేశించారు. ఇందులో జనరల్ ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, స్పోర్ట్స్ అండ్ ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ అంశాలనుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట. కనీసం 20 మార్కులు సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహిస్తారు. దీనికి 30 మార్కులు నిర్దేశించారు. తరవాత స్పోర్ట్స్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ ఉంటుంది. ఇది అభ్యర్థి ఎంచుకొన్న గేమ్/స్పోర్ట్‌కు సంబంధించి ఉంటుంది. దీనికి 10 మార్కులు కేటాయించారు. స్పోర్ట్స్ అచీవ్‌మెంట్‌కు మరో 10 మార్కులు ప్రత్యేకించారు. దీనికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే మొత్తమ్మీద కనీసం 45 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.

- ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ఫిట్‌నెస్ సెంటర్లు, హెల్త్ క్లబ్‌లు, స్పోర్ట్స్ క్లబ్‌లు, స్పోర్ట్స్ అకాడమీల్లో పీఈ టీచర్స్/ట్రెయినర్స్/ఇన్‌స్ట్రక్టర్స్/కోచ్‌లుగా ఉద్యోగావకాశాలు పొందవచ్చు.

ఎంపీఈఎస్

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. 25 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సు, ఎలక్టివ్ కోర్సులు, స్పెషలైజేషన్ సబ్జెక్ట్, స్పెషలైజేషన్ స్పోర్ట్స్, డిజర్టేషన్, కోచింగ్ ఎబిలిటీ సెషన్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీపీఈఎస్/బీపీఈ/బీపీఈడీ/బీఎస్సీ-పీఈ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు.

అడ్మిషన్ టెస్ట్: రాత పరీక్షకు 100 మార్కులు నిర్దేశించారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్-స్పోర్ట్స్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి 20, డిగ్రీ స్థాయిలో థియరిటికల్ నాలెడ్జ్ అంశాల నుంచి 80 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. గేమ్/స్పోర్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్‌కు 30 మార్కులు; గేమ్/స్పోర్ట్స్ అచీవ్‌మెంట్‌కు 20 మార్కులు నిర్దేశించారు.

- గేమ్/స్పోర్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ నిర్వహించే క్రీడలు: బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, ఖోఖో, స్విమ్మింగ్, టెన్నిస్, రెజ్లింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్ జూడో, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, ట్రాక్ అండ్ ఫీల్డ్, యోగా, క్రికెట్, హ్యాండ్ బాల్, కబడ్డీ, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, వాలీబాల్.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** www.lncpe.ac.in

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రశ్నలు 'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/wlxbrZ9లో చదవండి.

ఉస్మానియా వర్సిటీలో లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం/సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/ సీఎస్ఎన్/సీఎస్ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీబీసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

తెలుగులో ఇలాంటి సినిమా రాలేదు




"నేను 'హరోం హర' లాంటి సినిమా చేయాలని సూపర్‌స్టార్ కృష్ణ గారు కోరుకున్నారు. ఆయన కోరుకున్న విధంగా ఈ సినిమాలో నా పాత్ర ఉంటుంది. ఇప్పటివరకూ ఇలాంటి నేపథ్యంలో తెలుగులో సినిమా రాలేదు. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఇదే ఫీలవుతారు" అని సుధీర్‌బాబు అన్నారు. ఆయన హీరోగా జ్ఞానసాగర్ ద్వారక తెరకెక్కించిన చిత్రమిది. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ప్రతి సన్నివేశంపైనా ఎంతో వర్క్ చేసి సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి హిట్ కొట్టబోతున్నామనే నమ్మకం ఉంది' అన్నారు. జ్ఞానసాగర్ ద్వారక మాట్లాడుతూ 'ఈ సినిమాను మురుగన్ స్వామికి అంకితం ఇస్తున్నా. సింగిల్ సిట్టింగ్‌లో సుధీర్ కథ ఓకే చేశారు. ఆయన కష్టం వల్లే సినిమా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. "హరోం హర ప్రేక్షకులకు గుర్తుండిపోయే సినిమా అవుతుంది. ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఇదొక కమర్షియల్ మూవీ.సాగర్ అద్భుతంగా తీశారు' అని నిర్మాతలు సుబ్రహ్మణ్యం, సుమంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్వక్‌సేన్, అడివిశేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఆకట్టుకునే భావోద్వేగాలతో



నూతన దర్శకుడు శివ పాలడుగు దర్శకత్వం వహించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. అజయ్‌ఘోష్, చాందినీ చౌదరి ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు శివ పాలడుగు మీడియాతో ముచ్చటించారు. "రంగస్థలం' సినిమాలో అజయ్‌ఘోష్ నటన చూసి ఈ సినిమా కథకు ఆయనే పర్ఫెక్ట్ అని అనుకున్నాను. కథ వినగానే ఆయనకూ నచ్చి నటించడానికి ఒప్పుకున్నారు. ఇరవయ్యేళ్ల వయసులో సంగీతంలో రాణించాలని అనుకుని కొన్ని కారణాలతో ఆగిపోయిన ఓ వ్యక్తి యాభై ఏళ్లు వచ్చాక తన కలను ఎలా సాధించాడు అనేదే చిత్ర కథ. ఈ సినిమా కథను మలుపు తిప్పే పాత్రలో చాందినీ చౌదరి నటించారు. సినిమాలోని భావోద్వేగాలు అందరినీ ఆకట్టుకుంటాయి. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది" అని చెప్పారు.

బన్నీని అన్‌ఫాలో చేసిన సాయిదుర్గ తేజ్





మెగా, అల్లు ఫ్యామిలీల మధ్యన దూరం పెరుగుతోందన్న వార్తల నేపథ్యంలో చిరంజీవి మేనల్లుడు, హీరో సాయిదుర్గ తేజ్ సోషల్ మీడియాలో అల్లు అర్జున్‌ను, ఆయన భార్య స్నేహారెడ్డిని అన్‌ఫాలో చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్... రెండింటిలోనూ బన్నీని ఫాలో అవడం లేదు. అయితే బన్నీ సోదరుడు శిరీష్‌ను మాత్రం తేజ్ ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నారు.



గోపీచంద్ కథానాయకుడిగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విశ్వం'. టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మాతలు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. బుధవారం గోపీచంద్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'విశ్వం' చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. స్పోర్ట్స్ బైక్‌ను నడుపుతున్న గోపీచంద్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

హీరోగా తెలుగు సినిమా చేస్తా



తెలుగులోనూ మంచి అభిమానగణాన్ని సొంతం చేసుకున్న తమిళ నటుల్లో విజయ్ సేతుపతి ఒకరు. ఆయన నటించిన 50వ చిత్రం 'మహరాజా'. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరమ్, జగదీశ్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను హీరో విజయ్ సేతుపతి మీడియాతో పంచుకున్నారు. "ఒక నటుడిగా 50 చిత్రాలు పూర్తి చేసుకున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. 'మహరాజా' సినిమా కథనం చాలా ప్రత్యేకంగా ఉంటుంది. నా క్యారెక్టర్ సినిమాలో చాలా భాగం వరకూ అండర్ ప్లే చేసి.. కీలక సమయంలో ఒక్కసారి వయోలెంట్‌గా మారుతుంది. ఇందులో నాది కుటుంబం కోసం ఎంతకైనా తెగించే పాత్ర. ఇటువంటి బ్యాలెన్సింగ్ పాత్రలో ప్రేక్షకులు నన్ను ఇంతవరకూ చూడలేదు కాబట్టి తెరపై నా నటన.. పాత్ర తీరు కొత్తగా అనిపిస్తుంది. దర్శకుడు సినిమాను అనుకున్న దాని కంటే చాలా బాగా తీశారు. ఎంతో సహజత్వంతో తెరకెక్కిన ఈ సినిమా తెలుగువారికి తప్పకుండా చేరువవుతుంది. అన్నీ చక్కగా కుదిరితే త్వరలోనే స్ట్రయిట్ తెలుగు సినిమా చేస్తా" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/dPQh6nH లో చదవండి.

ఎమ్మెల్యే కామినేనికి అస్వస్థత


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కామినేని

కైకలూరు, జూన్ 12: ఏలూరు జిల్లా కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యారు. నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో ఇబ్బందికి గురయ్యారు. దీంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు ఆయన ఆసుపత్రి నుంచి ఓ వీడియో విడుదల చేశారు. 'సీఎం ప్రమాణస్వీకారానికి సైతం రాలేని స్థితిలో ఉన్నా. నియోజకవర్గ ప్రజలు కార్యక్రమానికి పెద్దఎత్తున వెళ్లి విజయవంతం చేయాలి. కోలుకుని నాలుగు రోజుల్లో కైకలూరులో ప్రజలకు అందుబాటులో ఉంటా. నన్ను చూసేందుకు నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు రావద్దు' అని కామినేని సూచించారు.

దాడులను నిరోధించేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో వైవీ సుబ్బారెడ్డి పిల్

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల అనంతరం జరుగుతున్న దాడులను నిరోధించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసేలా ఆదేశించాలని, బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని పిటిషన్‌లో కోరారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ పిల్ వేసవి సెలవుల ప్రత్యేక ధర్మాసనం ముందు గురువారం విచారణకు రానుంది.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో వాసుదేవరెడ్డి పిటిషన్.. నేడు విచారణ

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం అమ్మకాలకు సంబంధించిన కీలక దస్త్రాలు, కంప్యూటర్ హార్డ్ డిస్కుల చోరీ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. వాసుదేవరెడ్డి ఈ నెల 6న ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచి కీలక దస్త్రాలు, హార్డ్ డిస్కులు చోరీచేసి తరలిస్తుండగా తాను చూశానని ఎన్టీఆర్ జిల్లా కంచకచర్ల మండలానికి చెందిన గద్దె శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మంగళగిరి సీఐడీ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై వేసవి సెలవుల ప్రత్యేక బెంచ్ గురువారం విచారణ జరపనుంది.

పిన్నెల్లి కేసుల్లో స్పెషల్ కౌన్సిల్‌గా అశ్వనీకుమార్

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఈవీఎం ధ్వంసం చేయడంతో పాటు తదనంతరం చోటు చోటుచేసుకున్న ఘటనలో మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై నమోదైన నాలుగు కేసుల్లో ప్రాసిక్యూషన్ తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది ఎస్ అశ్వనీకుమార్‌ని రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ కౌన్సిల్‌గా నియమించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి (ఎఫ్ఏసీ) జీ విజయ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై నమోదైన కేసులు గురువారం విచారణకు రానున్నాయి.

గుండెపోటుతో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు మృతి

ఉంగుటూరు/చెన్నూరు/వల్లూరు, జూన్12: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఇద్దరు కార్యకర్తలు గుండెపోటుతో మృతి చెందారు. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నాయుడు ఏసురత్నం (45) చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం తిరిగి వెళుతూ మార్గమధ్యంలో పొట్టిపాడు వద్ద రోడ్డు పక్క మిత్రులతో భోజనం చేస్తుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో కడప జిల్లా వల్లూరు మండలం వెంకటేశాపురం వాసి కావడి నరసింహులు (71) చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని చూడాలని మంగళవారం రాత్రి చెన్నూరు నుంచి బస్సులో బయల్దేరాడు. అప్పటికే తీవ్ర ఉద్వేగంతో ఉన్న ఆయన అర్ధరాత్రి దాటిన తరువాత అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం ఉదయం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా కొద్దిసేపటికే గుండెపోటుతో మృతి చెందాడు.

ప్రశ్నిస్తే వేటేయడమే!

రూల్స్ మాట్లాడితే వేరే రాష్ట్రానికి బదిలీ.. తప్పుచేయనంటే సస్పెన్షన్ బహుమానం

- టీడీపీ వ్యక్తిగా ముద్రవేసి తీవ్ర వేధింపులు
- గనుల శాఖలో వైసీపీ పెద్దల అరాచకాలు
- తమకు భజన చేసేవారికే కీలక పోస్టులు
- ఒక ఉద్యోగి హక్కులు కాలరాసినందుకు... వెంకటరెడ్డికి షోకాజ్ ఇవ్వాలన్న హైకోర్టు
- అయినా పట్టించుకోని జగన్ ప్రభుత్వం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ పాలనలో గనుల శాఖను ప్రభుత్వ పెద్దలు, అధికారులు సొంత సామ్రాజ్యంగా మార్చుకున్నారు. తమ అడుగులకు మడుగులొత్తే వారిని ఏరికోరి కీలక పోస్టుల్లో కూర్చోబెట్టారు. నియమ నిబంధనలు, ప్రభుత్వ ప్రయోజనాల గురించి మాట్లాడినవారిని తీవ్ర వేధింపులకు గురిచేశారు. రెగ్యులర్ ఉద్యోగులను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేసేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని అకారణంగా టెర్మినేషన్ చేసి ఇంటికి పంపించారు. 'మీరు చేసేదే సరైనది, మీ అంత గొప్పోళ్లు లేరు' అన్నవారిని పిలిచి పీఠమెక్కించి అడ్డగోలుగా పదోన్నతులు ఇచ్చారు. ఇలా ప్రమోషన్లు పొందినవారే ప్రకాశం జిల్లాలో కత్తులు, గొడ్డళ్లు తదితర మరణాయుధాలు వాహనాల్లో వేసుకొని విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. అరాచక అధికారులను ఢీకొనలేనివారు ఇతర విభాగాలకు వెళ్లిపోయారు. గడిచిన ఐదేళ్లలో గనుల శాఖ డైరెక్టరేట్, ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థలో కొందరు ఉద్యోగులు రాజభోగాలు అనుభవిస్తే, మరికొందరు వేధింపులతో సహజీవనం చేశారు.

ప్రశ్నించినందుకు డీజీఎంపై వేటు

ఎంటెక్ చదివిన మనోహర్ 2016లో గనుల శాఖలో చేరారు. 2019 వరకు మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టులో పనిచేశారు. ఆ తర్వాత ఎండీసీలో డిప్యూటీ జనరల్ మేనేజర్ హోదాలో సివిల్, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ (సీఎంసీ) బాధ్యతలు చూశారు. జగన్ సర్కారు చేపట్టిన భూముల సర్వేకోసం 2020లో సర్వేరాళ్ల కొనుగోలు బాధ్యతను ఎండీసీకి అప్పగించారు. దీనికోసం టెండర్లు పిలిచినప్పుడు నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని మనోహర్ సిఫారసు చేశారు. ఒకే వ్యక్తి మూడు నాలుగు కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉంటూ, వాటితో బిడ్‌లు వేయిస్తే వాటిని ఆమోదించకూడదని నిబంధనలు ఉన్నాయి. అలా వచ్చిన బిడ్‌లను తిరస్కరించాలని, ఆయా కంపెనీల ఈఎండీలను ఆపేయాలని ఆయన ఫైల్‌పై రాశారు. ఇది గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డికి నచ్చలేదు. ఓడిశాకు చెందిన ఉత్కళ్ అనే కంపెనీని తెరమీదకు తీసుకొచ్చి టెండర్ కట్టబెట్టారు. ఇందులో నిబధనల ఉల్లంఘన జరిగిందని మనోహర్ ఫైలుపై రాయగా ఎండీసీ ఛైర్మన్ విచారణకు ఆదేశించారు. తప్పులు జరిగిన మాట నిజమేనని కమిటీ కూడా తేల్చింది. కమిటీ నివేదిక ఇచ్చిన మరుసటి రోజే మనోహర్‌ను ఉద్యోగం నుంచి టెర్మినేట్ చేస్తూ వెంకటరెడ్డి ఆదేశాలు ఇప్పించారు. నిజానికి సర్వేరాళ్ల కొనుగోళ్లలో నిబంధనలు ఉల్లంఘించి టెండర్లు జరిపారు. ఓ ఉన్నతాధికారి తన బంధువు కంపెనీని తెరమీదకు తీసుకొచ్చి టెండర్ దక్కించుకున్న విషయాన్ని ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. సర్వేరాళ్ల కొనుగోళ్లలో భారీగానే గోల్‌మాల్ జరిగిందని, విచారణ నివేదికలోని అంశాలను బయటపెట్టింది. తమను ప్రశ్నించినందుకు మనోహర్‌ను టెర్మినేట్ చేసిన వెంకటరెడ్డి, 'ఆంధ్రజ్యోతి' వార్తలకు వివరణ ఇవ్వలేదు.

మధ్యప్రదేశ్‌కు బదిలీ

ఎండీసీలో సీనియర్ అధికారి కేదార్‌నాథ్ రెడ్డి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హోదాలో పనిచేయాల్సిన అధికారిని తమను ప్రశ్నించారనే కారణంతో ప్రధాన కార్యాలయంలో లేకుండా చేశారు. శ్రీకాకుళంలో బీచ్‌శాండ్ ప్రాజెక్టుపై హైకోర్టులో కేసు నడుస్తోంది. అది పరిష్కారం కాకుండానే మరో కొత్త బిడ్డర్‌ను తీసుకొచ్చి ముందుకు తీసుకెళ్లాలని అధికారులు ప్రయత్నించగా కేదార్‌నాథ్‌రెడ్డి అడ్డుకున్నారు. కోర్టులో ఉన్న ప్రాజెక్టుపై కొత్తగా టెండర్లు పిలవడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని, పైగా ఇది కంపెనీలను ఇబ్బందిపెట్టే పనవుతుందని ఫైల్‌పై రాశారు. ఓ కంపెనీకి అడ్డగోలుగా బెరైటీస్‌ను కట్టబెట్టాలన్న ప్రయత్నాలను ప్రశ్నించారు. దీంతో ఆయనపై టీడీపీ వ్యక్తి అనే ముద్రవేశారు. రాత్రికి రాత్రే ఆయన్ను మధ్యప్రదేశ్‌లోని సులియారి కోల్‌బ్లాక్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. అక్కడా ఎలాంటి బాధ్యతలు అప్పగించకుండా ఖాళీగా ఉంచారు. కోల్‌బ్లాక్ ఫైళ్లు, ఇతర సమాచారం ఆయనకు వెళ్లకుండా అధికారులు జాగ్రత్తపడ్డారు. ఏడాదిన్నర తర్వాత ఆయన్ను రాష్ట్రానికి తీసుకొచ్చి ప్రకాశం జిల్లా చీమకుర్తిలో పోస్టింగ్ ఇచ్చారు. అప్పటికే అక్కడ ఓ అధికారి ఉన్నా కేదార్‌నాథ్‌రెడ్డికి ఓ అప్రాధాన్య పోస్టు ఇచ్చారు. ఎండీసీలో ఎండీ తర్వాత నెంబర్.2గా ఉండాల్సిన అధికారిని చీమకుర్తిలో కొనసాగిస్తున్నారు.

జీపీఎస్ ఉండాలన్నందుకు సస్పెన్షన్

గనులశాఖ జియాలజీ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి గోదావరి జిల్లాల్లో ఇసుక బాధ్యతలను చూశారు. ఇదే పనిమీద ఆయన్ను ప్రత్యేక అధికారిగా నియమించారు. ఎండీసీనే ఇసుక వ్యాపారాన్ని పర్యవేక్షిస్తున్న సమయంలో గోదావరి జిల్లాలకు చెంది ఓ వైసీపీ నేత ఇసుక దందా చేశారు. ఇసుకను తరలించే వాహనాలకు జీపీఎస్ ఉండి తీరాలని, లేదంటే రేవు దాటించేదిలేదని ఈ జియాలజిస్ట్ చెప్పారు. అంతే, 2020, నవంబరులో ఆయనకు సస్పెన్షన్‌ను బహుమానంగా ఇచ్చారు. కారణాలు లేవు. విచారణ లేదు. ఏం తప్పుచేశారో తేల్చేలేదు. వైసీపీ నేతలకు ఆయన నచ్చలేదు. మూడున్నరేళ్లపాటు సస్పెన్షన్‌లోనే కొనసాగించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డిని వ్యక్తిగతంగా కలవడం లేదనే పేరుతో సస్పెన్షన్ కొనసాగించారు. దీనిపై బాధిత అధికారి హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయం దక్కింది. చివరకు మార్చిలో ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. అయితే, ఈ కేసులో గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఒక ఉద్యోగి హక్కులను దారుణంగా కాలరాసి, అకారణంగా మూడేళ్లు సస్పెన్షన్‌లో ఉంచినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కానీ, జగన్ ప్రభుత్వం వెంకటరెడ్డికి నోటీసు ఇవ్వలేదు. ఈలోగా ప్రభుత్వం మారింది. వెంకటరెడ్డిపై వేటు పడింది.

విశాఖకు ఆర్‌బీఐ అధికారులు

- ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుపై ఉన్నతాధికారులతో సమావేశం
- ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం చెబుతామన్న కలెక్టర్


సిరిపురంలో ఆర్బీఐ అధికారులు పరిశీలించిన భవనం

విశాఖపట్నం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు ఉన్నతాధికారులు బుధవారం విశాఖలో ఓ భవనాన్ని పరిశీలించారు. సిరిపురం జంక్షన్‌లో గల వీఎంఆర్‌డీఏ పరిపాలనా భవనం ఎదురుగా నిర్మిస్తున్న మల్టీ లెవెల్ పార్కింగ్ భవనంలో పది వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఐదో అంతస్తు కేటాయించాల్సిందిగా జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ డాక్టరు ఎ.మల్లికార్జునతో ఆర్బీఐ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ మహానా సమావేశమయ్యారు. కార్యాలయం ఏర్పాటుకు వీలైనంత వేగంగా భవనం కేటాయించాలని కోరారు. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. ప్రతి రాష్ట్రంలో ఆర్‌బీఐకు ప్రాంతీయ కార్యాలయం ఉంటుంది. రాష్ట్ర విభజన అనంతరం 2014 తరువాత అమరావతిలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు అప్పటి సీఎం చంద్రబాబు భూమి కేటాయించారు అయితే 2019లో జగన్ సీఎం అయిన తరువాత అమరావతిని పక్కన పెట్టడంతో అనేక కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు కూడా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో గతేడాది ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆర్‌బీఐ అధికారులు కలవగా విశాఖలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుచేయాలని సూచించారు. దీంతో వారు జిల్లా కలెక్టర్‌ను కలిశారు.

విజయవాడ ఎయిర్‌పోర్టు బిజీ బిజీ

- 17 షెడ్యూల్ విమానాలు, 9 స్పెషల్ ఫ్లైట్స్, 2 హెలికాప్టర్లు
- ప్రధాని మోదీ, అమిత్ షా, గడ్కరీ, నడ్డా రాకపోకలు
- సెలబ్రిటీలు, దౌత్యవేత్తలు, వీవీఐపీల రాకతో సందడి

విజయవాడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవంతో విజయవాడ విమానాశ్రయం బిజీ బిజీగా మారింది. షెడ్యూల్డ్ విమానాలతోపాటు.. స్పెషల్ ఫ్లైట్స్, హెలికాప్టర్ల రాకపోకలతో ఎన్నడూ లేనంత హడావుడిగా కనిపించింది. ఇది ఓ రకంగా రికార్డుగా భావిస్తున్నారు. ఇక్కడ రోజువారీగా షెడ్యూల్డ్ విమానాలు 17 ఉన్నాయి. అంటే రోజూ 34మూవ్‌మెంట్స్ ఉంటాయి. బుధవారం కూడా 34 మూవ్‌మెంట్స్ నూరుశాతం ఆక్యుపెన్సీతో నడిచాయి. ఇవి కాకుండా ప్రత్యేక ఆహ్వానితుల కోసం అదనంగా 9 స్పెషల్ ఫ్లైట్స్, రెండు హెలికాప్టర్లు నడిపించారు. విమానాశ్రయానికి దగ్గర్లోనే సభాస్థలి ఉండటంతో చాలామంది ప్రముఖులు ఈ విమానాశ్రయానికి వచ్చి అక్కడినుంచి సభాస్థలికి చేరుకున్నారు. ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డి, అనురాగ్ పాటిల్, బండి సంజయ్, కింజరపు రామ్మోహన్‌నాయుడు తదితరులు ఇక్కడి నుంచే రాకపోకలు సాగించారు. విదేశీ దౌత్యవేత్తలు, వ్యాపార ప్రముఖులు, ఇతర రాష్ట్రాల సీఎంలు, రాజకీయ ప్రముఖులు కూడా ఈ విమానాశ్రయం నుంచే రాకపోకలు సాగించారు.

అట్టహాసంగా ముగిసిన ఆటా 18వ కన్వెన్షన్

- రికార్డ్ స్థాయిలో 18 వేలమంది హాజరు
- తెలుగు రాజకీయ, సినీ ప్రముఖులతో కళకళలాడిన అట్లాంటా

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నవత, యువత, భవిత... అనే నినాదంతో తెలుగు వారి అతి పెద్ద పండుగ ఆటా-2024 వేడుక అమెరికాలో ఘనంగా జరిగింది. జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్‌లో జూన్ 7 నుంచి 9 వరకు అట్లాంటాలో జరిగిన 18వ ఆటా కన్వెన్షన్‌కు 18 వేల మందికి పైగా హాజరయ్యారు. ఆటా అధ్యక్షురాలు బొమ్మినేని మధు, కన్వీనర్ కిరణ్ పాశం నాయకత్వంలో తొలి రోజు బ్యాంకెట్ సమావేశం జరిగింది. తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కాన్సులేట్ జనరల్ రమేష్ బాబు లక్ష్మణ్, ధ్యాన గురు దాజి, సినీ నటులు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, హీరో శ్రీకాంత్, హీరోయిన్ మెహ్రీన్, నేహా శెట్టి, తమ్మారెడ్డి భరద్వాజ, తనికెళ్ల భరణి హాజరయ్యారు. జార్జియా రాష్ట్ర అభివృద్ధికి తెలుగు వారు తోడ్పడుతున్నారని జార్జియా గవర్నర్ బ్రయాన్ కెంప్ కొనియాడారు. నవత, యువత, భవిత అనే లక్ష్యాలతో ఈ సారి కన్వెన్షన్ నిర్వహించామని బొమ్మినేని మధు తెలిపారు. ఇంత పెద్ద కన్వెన్షన్ చేయడం అంత తేలిక కాదని.. దీన్ని ముందుకు తీసుకువెళ్తామని ప్రెసిడెంట్ ఎలెక్ట్ జయంత్ చల్లా అన్నారు. శ్రీ సీతారామ కల్యాణం వైభవంగా జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు హాజరయ్యారు. తనికెళ్ల భరణి, గంగాధర శాస్త్రి ప్రవచనాలు అద్భుతంగా సాగాయి. వివిధ రంగాల్లో ప్రతిభాపాటవాలు చూపించిన 17 మందికి ఆటా అవార్డులు ప్రదానం చేశారు. మాజీ అధ్యక్షులు భువనేష్ బూజాల, హరి ప్రసాద్ రెడ్డి లింగాల, రామకృష్ణారెడ్డి ఆల, సాయినాథ్ బోయపల్లి, విజయ్ కుందూరు, రఘువీరారెడ్డిలకు అవార్డులు అందజేశారు. ఆటా లైఫ్‌టైమ్ సర్వీస్ అవార్డును డాక్టర్ రాజేశ్వర్ రావు టెక్మాల్‌కు అందజేశారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని సన్మానించారు. అట్లాంటాలో ఆటా మహాసభలు నిర్వహించడం ఇది మూడోసారి.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● గురువారం 13 జూన్ 2024

diksuchi@andhrajyothy.com

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ) ఆధ్వర్యంలోని లక్ష్మీబాయ్ నేషనల్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(ఎల్ఎన్‌సీపీఈ, తిరువనంతపురం)- డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) ఇన్నోవేటివ్, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్(ఎంపీఈఎస్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ టెస్ట్, కౌన్సెలింగ్, మెడికల్ టెస్ట్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ టెస్ట్‌ను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. యూనివర్సిటీ ఎగ్జామ్స్‌లో మంచి మార్కులు సాధించినవారికి నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్‌లు ఇస్తారు.



లక్ష్మీబాయ్ నేషనల్ కాలేజీలో

ఫిజికల్ ఎడ్యుకేషన్

బీపీఈడీ ఇన్నోవేటివ్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఇందులో మొత్తం 70 సీట్లు ఉన్నాయి. వీటిలో 28 సీట్లను మహిళలకు కేటాయించారు. థియరీ కోర్సులు, కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాక్టికల్ ట్రెయినింగ్, టీచింగ్ ప్రాక్టీస్, కోచింగ్ ఎబిలిటీ, ఇంటర్న్‌షిప్ ఉంటాయి. వీటితోపాటు లెక్చర్స్, ప్రాక్టికల్స్, ల్యాబొరేటరీ వర్క్‌లు, ఫీల్డ్ వర్క్‌లు, ఔట్ రీచ్ యాక్టివిటీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఒకేషనల్ ట్రెయినింగ్, సెమినార్‌లు, అసైన్‌మెంట్‌లు, ప్రజంటేషన్‌లు కూడా ఉంటాయి.

అర్హత: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 2024 జూన్ 1 నాటికి 23 ఏళ్లు మించకూడదు. ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. వివాహిత మహిళలు ఆరోగ్యం అనుకూలించని పక్షంలో కోర్సు నుంచి వైదొలిగే వీలుంది.

అడ్మిషన్ టెస్ట్: మొదట రాత పరీక్ష ఉంటుంది. దీనికి 50 మార్కులు నిర్దేశించారు. ఇందులో జనరల్ ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్, స్పోర్ట్స్ అండ్ ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ అంశాలనుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట. కనీసం 20 మార్కులు సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహిస్తారు. దీనికి 30 మార్కులు నిర్దేశించారు. తరవాత స్పోర్ట్స్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ ఉంటుంది. ఇది అభ్యర్థి ఎంచుకొన్న గేమ్/స్పోర్ట్‌కు సంబంధించి ఉంటుంది. దీనికి 10 మార్కులు కేటాయించారు. స్పోర్ట్స్ అచీవ్‌మెంట్‌కు మరో 10 మార్కులు ప్రత్యేకించారు. దీనికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే మొత్తమ్మీద కనీసం 45 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.

- ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ఫిట్‌నెస్ సెంటర్లు, హెల్త్ క్లబ్‌లు, స్పోర్ట్స్ క్లబ్‌లు, స్పోర్ట్స్ అకాడమీల్లో పీఈ టీచర్స్/ట్రెయినర్స్/ఇన్‌స్ట్రక్టర్స్/కోచ్‌లుగా ఉద్యోగావకాశాలు పొందవచ్చు.

ఎంపీఈఎస్

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. 25 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సు, ఎలక్టివ్ కోర్సులు, స్పెషలైజేషన్ సబ్జెక్ట్, స్పెషలైజేషన్ స్పోర్ట్స్, డిజర్టేషన్, కోచింగ్ ఎబిలిటీ సెషన్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీపీఈఎస్/బీపీఈ/బీపీఈడీ/బీఎస్సీ-పీఈ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 జూలై 1 నాటికి 28 ఏళ్లు మించకూడదు.

అడ్మిషన్ టెస్ట్: రాత పరీక్షకు 100 మార్కులు నిర్దేశించారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్-స్పోర్ట్స్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి 20, డిగ్రీ స్థాయిలో థియరిటికల్ నాలెడ్జ్ అంశాల నుంచి 80 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. గేమ్/స్పోర్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్‌కు 30 మార్కులు; గేమ్/స్పోర్ట్స్ అచీవ్‌మెంట్‌కు 20 మార్కులు నిర్దేశించారు.

- గేమ్/స్పోర్ట్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ నిర్వహించే క్రీడలు: బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, ఖోఖో, స్విమ్మింగ్, టెన్నిస్, రెజ్లింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, జూడో, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, ట్రాక్ అండ్ ఫీల్డ్, యోగా, క్రికెట్, హ్యాండ్ బాల్, కబడ్డీ, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, వాలీబాల్.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 18
- **అడ్మిషన్ టెస్ట్‌లకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 19
- **ఎంపీఈఎస్ అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** జూన్ 24, 25
- **బీపీఈడీ అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** జూన్ 27 నుంచి 29
- **ర్యాంక్‌ల లిస్ట్ విడుదల:** జూలై 8
- **వెబ్‌సైట్:** www.lncpe.ac.in

ఉస్మానియా వర్సిటీలో

లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం/సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/ సీఎస్ఎన్/సీఎస్ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

ఎంట్రెన్స్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 36 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 15 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** డిప్లొమా సర్టిఫికెట్-మార్కుల పత్రాలు, టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, పదోతరగతి సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి డిప్లొమా వరకు స్టడీ సర్టిఫికెట్లు, సర్వీస్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, జిరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు.
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 2
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 7
- **ఫలితాలు విడుదల:** జూలై 12
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 20
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

సివిల్స్ ప్రిలిమ్స్

GS Mock Questions

నిన్నటి తరువాయి

51. Consider the following statements regarding National Asset Reconstruction company(NARCL):

1. It aims to improve financial system stability by reducing NPAs of banks.
2. It is incorporated under the Banking Regulation Act,1989 with PSBS holding a majority stake.

Which of the statements given above is correct?

a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

52. Consider the following statements regarding Urea gold:

1. It is a non-organic slow-release fertilizer.
2. It is prepared by coating preheated urea granules with neem.
3. Urea gold ensures a more gradual release of nitrogen.

Which of the above statements given above are correct?

a. 1 and 2 only b. 2 and 3 only
c. 1 and 3 only d. 1, 2 and 3

53. Consider the following statements regarding Animal Husbandry Infra structure Development Fund (AHIDF)?

1. Dairy processing infrastructure
2. Meat processing and value addition infrastructure
3. Coastal aquaculture tanks
4. Animal feedplant

a. Only two b. Only three
c. Only four d. None

54. Consider the following statements with respect to the National Logistics Policy 2022?

1. Improve the logistics performance Index ranking and be among top 10 countries by 2030.
2. Create data driven decision support mechanism for a logistics system.
3. Reduce cost of logistics in India to global benchmarks by 2030.

Select the correct answer using the code given below:

a. 1 and 2 b. 2 and 3
c. 1 and 3 d. 1, 2 and 3

55. Consider the following statements regarding Zero coupon Zero principal (ZCZP) bonds:

1. ZCZP bonds neither offer interest nor returns the principal.
2. These bonds are issued only by not-for-profit organizations registered on the social stock Exchange.

Which of the statements given above is correct?

a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

56. Consider the following statements regarding GDP calculation approaches:

1. The income approach measures the total income earned by the factors of production.
2. The production approach sums the value added at each stage of production.
3. The Expenditure approach measures the total expenditure incurred by all entities in goods and services.
4. India uses all three methods for GDP calculation and the value arrived using each method is always exactly the same.

How many of the statements given above is/are correct?

a. only one b. Only two
c. Only three d. All four

57. Consider the following statements regarding Self Help Groups (SHG):

1. SHGs are voluntary, village-based intermediaries.
2. The area of their influence is only limited to the economic sphere.
3. In India more than 80 percent of the SHGs are well organized.

How many of the statements given above is/are correct?

a. Only one b. Only two
c. Only three d. None

58. Consider the following statements regarding 'Special assistance to states for capital Investment:

1. It provides 20 year interest free loans to states.
2. The scheme instituted by the Ministry of Finance in 2020-21 in the wake of Covid-19 Pandemic.
3. The scheme has seven parts.
4. Among eight parts ,Incentives to states for scrapping of old vehicles is one of the part.

Which of the statements is/are correct?

a. Only two b. Only three
c. All four d. None

59. Consider the following statements regarding Gross domestic product:

1. India uses Income method to calculate GDP.
2. The base year for GDP calculation is 2014-15.

Which of the statements given is/are correct?

a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

60. Consider the following statements of GDP deflator:

1. It is the ratio of real GDP to nominal GDP.
2. It reveals the increase in GDP that has happened on account of higher prices rather than an increase in output.

Which of the above statements given above is/are Correct?

a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

61. Consider the following statements regarding National Multi-dimensional poverty Index (MPI):

1. It is calculated by using Alkier-foster methodology.
2. An individual is considered MPI poor if their deprivation score equals to or exceeds India's national MPI poverty cutoff of 35%.

Which of the statements given above is/are correct?

a. Only 1 b. Only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

62. Consider the following statements regarding Lakpati Didi Scheme:

1. It was launched during a pandemic.
2. It was launched by the ministry of micro, small and medium enterprises.
3. Lakpat Didis are women members of the SHGs with annual earnings of one lakh and more.

How many of the statements given above are correct?

a. Only one b. Only two
c. Only three d. All four

63. Consider the following statements regarding regarding Public debt:

1. General Government Debt was about 60% of GDP as of the end of March 2023.
2. External Debt constituted more than 50% of public debt.
3. High public debt leads to crowding out effect and limits the fiscal resources.

Which of the statements given above are correct?

a. Only 3 b. 1 and 3 only
c. 2 and 3 only d. 1, 2 and 3.

64. Consider the following statements regarding Cash Reserve Ratio (CRR):

1. All scheduled commercial banks have to maintain CRR at 4.5%.
2. CRR are to be maintained in form of liquid cash with the concerned Banks.
3. The banks do not earn any interest on CRR.
4. As per the RBI Act 1934, the cooperative Banks are excluded from maintaining CRR.

Which of the statements given above is correct?

a. 1 and 2 b. 1 and 3
c. 1, 2 and 4 d. 1, 3 and 4

65. Consider the following statements regarding Treasury bills:

1. These are issued by RBI.
2. These are short term debt instruments issued for maturities of less than 91 days.
3. These are zero coupon securities and pay no interest.

Which of the statements given above is/are correct?

a. 1 and 2 b. 2 and 3
c. 3 only d. 1, 2 and 3

66. Lichens, which are capable of initiating ecological succession even on a bare rock, are actually a symbiotic association of

a. Algae and bacteria
b. Algae and fungi
c. Bacteria and fungi
d. Fungi and mosses

67. Which of the following is the correct sequence in ecological from the lowest to the highest?

a. Individual-Population-Community-Ecosystem-Biosphere
b. Population- Individual- Community - Biosphere- Ecosystem
c. Individual-Community-Population-Ecosystem-Biosphere
d. Individual- Population- Community - Biosphere- Ecosystem

68. In Environment context "operation Green Wave"is associated to which of the following countries?

a. Brazil b. Canada
c. India d. Indonesia

69. Which of the following statements ae correct?

1. The Sundarbans mangroves are the largest single block of tidal holophytic mangroves of the world.
2. Indian Sundarban is bound on the east by river Muriganga and on the west by rivers Harinbhahga and Raimangal.
3. The Sunderbans Delta is the only mangrove forest in the world inhabited by tigers.

Select the correct option from the codes given below:

a. Only one b. Only two
c. All three d. None


70. Which of the following is the Dominant producer in lakes?

a. Phytoplankton b. Zoo plankton
c. Macrophytes d. Halophytes

ANSWERS

51. a			65. b
52. c			66. b
53. b	57. a	61. a	67. a
54. b	58. a	62. a	68. a
55. c	59. a	63. a	69. b
56. c	60. b	64. b	70. a

Prepared by : CSB Academy, Hyderabad



సీతాఫలం నేర్పిన నీతి

నాగావళీ నదీ తీరంలో ఆనంద మహర్షి అనే ముని ఆశ్రమాన్ని నిర్మించుకుని తన శిష్యులతో కలసి నివసించేవాడు. ఒక రోజు ఆయన శిష్యులు- ఒక వ్యక్తిని మోసుకువచ్చారు. "ఇతను నదిలో కొట్టుకుపోతూ ఉంటే కాపాడాం" అని చెప్పారు. అప్పుడు ఆ ముని- ఆ వ్యక్తిని- "నదిలో ఎలా పడ్డావు?" అని అడిగాడు. అప్పుడు ఆ వ్యక్తి- "నా జీవితంలో అన్నీ కష్టాలే! అందుకే చనిపోదామనుకున్నా" అన్నాడు. అప్పుడు ఆ ముని తన శిష్యులతో- "ఇతనికి ఒక సీతాఫలం ఇవ్వండి" అని చెప్పాడు. ఆ వ్యక్తి ఆకలితో ఉండటంతో సీతాఫలాన్ని ఆబగా తినేశాడు. అప్పుడు ఆ ముని- "పండు తిన్నావు కదా.. గింజలను ఎందుకు ఉమ్మేశావు" అని అడిగాడు. అప్పుడు ఆ వ్యక్తి- "గింజలను ఎలా తింటాం స్వామి.. వాటిని బయటే పడేయాలి" అన్నాడు. అప్పుడు ముని- "జీవితం కూడా ఈ సీతాఫలం లాంటిదే! గింజలు మనకు వచ్చే కష్టాలు. వాటిని తొలగించుకొని జీవితాన్ని ఆస్వాదించాలి" అని హితవు చెప్పాడు. ఆ వ్యక్తికి జ్ఞానోదయమయింది.



సరైన నీడ ఏది?



ఎన్ని కుక్కలు ఉన్నాయి?



10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 331

8						3	4	
5			6					
	1	2					9	7
		5	1	4	8			9
				2				
1			3	9	5	8		
2	5					9	6	
					1			3
	9	7						1

సుడోకు - 330 సమాధానం

6	4	3	7	2	1	5	9	8
2	1	5	4	8	9	6	3	7
7	9	8	5	3	6	2	1	4
8	7	9	1	5	4	3	6	2
1	2	6	3	9	8	7	4	5
3	5	4	2	6	7	9	8	1
5	8	1	6	7	3	4	2	9
9	3	2	8	4	5	1	7	6
4	6	7	9	1	2	8	5	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.